www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14



బుధవారం | 5-3-2025
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 336
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి మ.12.52 తదుపరి సప్తమి, నక్షత్రం: కృత్తిక రా.1.08 తదుపరి రోహిణి, వర్జ్యం: మ.1.53-3.23, అమృతఘడియలు: రా.10.53-12.23, దుర్ముహూర్తం: మ.12.03-12.50, రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 6.19
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



భారత్ బద్‌లా

చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో
ఆస్ట్రేలియాపై రోహిత్ సేన ఘన విజయం

వరల్డ్‌కప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం
కోహ్లీ మరోసారి మాస్టర్ ఛేజ్ 11
రాణించిన అయ్యర్, రాహుల్, పాండ్యా
బంతితో కంగారూలను దెబ్బతీసిన షమి, వరుణ్



మ్యాచ్‌కు ముందు ఏదో అనుమానం.. గతం తాలూకూ భయాలు.. అయినా ఆల్ రౌండ్ షోతో అదరగొట్టిన భారత్.. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. విరాట్ కోహ్లీ (84)తోపాటు శ్రేయాస్ అయ్యర్ (45), కేఎల్ రాహుల్ (42 నాటౌట్), హార్దిక్ పాండ్యా (28) రాణించడంతో.. ఉత్కంఠభరితంగా జరిగిన సెమీస్‌లో టీమిండియా.. ఆస్ట్రేలియాపై 4 వికెట్ల తేడాతో గెలిచింది. 2023 వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమికి బదులు తీర్చుకొంది. రోహిత్ మరోసారి టాస్ ఓడడంతో.. అభిమానుల్లో ఒక్కసారిగా ఆందోళన రేగింది. మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకొన్న కంగారూలు మానసికంగా పైచేయి సాధించే ప్రయత్నం చేశారు. ఒకానొక దశలో ఆసీస్ స్కోరు 300 పరుగులు దాటేలా కనిపించింది. కానీ, ఆస్ట్రేలియాను భారత్ ఊహించిన దానికంటే తక్కువ స్కోరుకే కట్టడి చేసింది. అనుభవం లేని బౌలర్లున్నా.. కంగారూలు అంత తేలిగ్గా వదల్లేదు. ఒకానొక దశలో భారత్‌ను తీవ్ర ఒత్తిడికి గురిచేశారు. కానీ, కోహ్లీ ఏమాత్రం ఆందోళనపడకుండా.. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ కూల్‌గా భాగస్వామ్యాలు నిర్మించాడు. దీంతో భారత్ ఐదోసారి ఈ టోర్నీ తుది పోరుకు చేరుకొంది. రోహిత్ సేన విజయం సాధించడంతో.. ఫైనల్ మ్యాచ్ కూడా దుబాయ్‌నే వేదిక కానుంది. దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ జట్ల మధ్య నేడు జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో భారత్ ఫైనల్లో తలపడుతుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో..
బీజేపీ ముందంజ

ఆరు రౌండ్లలో 6,931 ఓట్ల ఆధిక్యంలో అంజిరెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గట్టి పోటీ

31,481 ఓట్లతో మూడో స్థానంలో
కొనసాగుతున్న బీఎస్పీ అభ్యర్థి హరికృష్ణ
కరీంనగర్ స్థానంలో కొనసాగుతున్న హోరాహోరీ
మొదటి ప్రాధాన్య ఓట్లల్లో ఫలితం తేలేది కష్టమే!
తప్పనిసరి కానున్న రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు


కరీంనగర్‌లోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

కరీంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకున్న బీజేపీ.. ఇదే జిల్లాలకు చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కూడా ముందంజలో కొనసాగుతోంది. మంగళవారం రాత్రి 12 గంటల వరకు ఆరు రౌండ్లు లెక్కించగా.. బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి కన్నా 6,931 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. అయితే వరుసగా ఐదు రౌండ్లలో ఆధిక్యం కనబరిచిన బీజేపీ.. 6వ, 7వ రౌండ్లలో మాత్రం వెనకబడింది. ఆరో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి 211 ఓట్ల స్వల్ప ఆధిక్యం సాధించారు. ఇక ఏడో రౌండ్‌లో నరేందర్‌రెడ్డికి 600 పైచిలుకు ఓట్ల ఆధిక్యం లభించినట్లు తెలుస్తోంది. ఇంకా నాలుగు రౌండ్లు లెక్కించాల్సి ఉంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఈ నెల 3న ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా.. ఆ రోజంతా చెల్లని ఓట్లను విభజించి కట్టలు కట్టడానికే సరిపోయింది. మంగళవారం ఉదయం 11.30 గంటలకు అసలు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి మొత్తం 2,52,100 ఓట్లు పోల్ కాగా.. వాటిలో 28,000 ఓట్లు చెల్లుబాటు కానివిగా నిర్ధారించారు. మిగిలిన 2,24,100 ఓట్లను ఒక్కో రౌండ్‌లో 21,000 చొప్పున లెక్కిస్తున్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఆరు రౌండ్లలో బీజేపీ అభ్యర్థి

మిగతా 12వ పేజీలో...

మజ్లిస్ ఎటు!?

సిటింగ్ సీటును తమకే ఇవ్వాలంటూ
కాంగ్రెస్‌ను డిమాండ్ చేస్తున్న మజ్లిస్ 12
స్థానికంలో మద్దతిస్తామంటున్న హస్తం
రెండో అభ్యర్థిని దించాలని బీఆర్ఎస్ ప్లాన్
సిటింగ్ సీటుకు మద్దతుపై మజ్లి‌స్‌కు ఆఫర్
ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉత్కంఠ


కేంద్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులు

1,891 కోట్ల బకాయిలు చెల్లించండి

సీఎంఆర్ డెలివరీ సమయం పొడిగించండి

4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు
ఉత్పత్తికి అనుమతులు పునరుద్ధరించండి
కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్‌రెడ్డి వినతి

మహిళా సమాఖ్యలకు బస్సులు

అద్దెకు ఆర్టీసీకి.. బస్సుపై నెలకు రూ.77,220 రాబడి
కొనుగోలుకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వనున్న ప్రభుత్వం
ఈ నెల 8న తొలి విడతగా 150 బస్సుల ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖకు సంబంధించి తెలంగాణకు రావాల్సిన రూ.1,891 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కేంద్ర ఆహార, పౌర సరఫరాలు, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రితోపాటు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మిగతా 13వ పేజీలో...

ఏకపక్ష పాలన సాగించడానికి
ఇది రాచరికం కాదు

ప్రజాస్వామ్యంలో అణచివేతకు తావు లేదు
ప్రజా ఉద్యమాల ఐక్యవేదిక 14
జాతీయ సదస్సులో మీనాక్షి నటరాజన్


చరఖాతో నూలు వడుకుతున్న మీనాక్షి నటరాజన్



ప్రముఖ గాయని కల్పన
ఆత్మహత్యాయత్నం!

నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి
2 రోజులుగా తలుపులు తెరవకపోవడంతో
భర్తకు సమాచారమిచ్చిన సెక్యూరిటీ 14
ఆయన ఫోన్‌తో రంగంలోకి పోలీసులు
ఆస్పత్రికి తరలింపు.. వెంటిలేటర్‌పై చికిత్స

అరవకుండా మత్తుమందు ఇచ్చి..
కొట్టి, గొంతు నులిమి..

శిరీషను.. ఆమె భర్త, ఆడపడుచే హత్య
చేసినట్టు పోలీసుల ప్రాథమిక నిర్ధారణ?
ప్రేమించినట్లు నటించి శిరీషను
మూడో పెళ్లి చేసుకున్న వినయ్ 14
మొదటి భార్యను కూడా ఇలాగే
చంపినట్లు విచారణలో వెల్లడి!
వేధింపులతోనే వెళ్లిపోయిన రెండో భార్య

అనుమానం వస్తే చాలు..
ఆన్‌లైన్ అంతా జల్లెడ!

ఐటీ అధికారులకు విస్తృత అధికారాలు 2
సోషల్, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్, ఈమెయిల్
ఏ ఖాతాలనైనా తనిఖీ చేసేందుకు పవర్
కొత్త ఐటీ బిల్లులో ఈ మేరకు నిబంధనలు
పార్లమెంటు ఆమోదిస్తే వచ్చే ఏడాది అమలు

వేలానికి 400 ఎకరాలు

అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు.. కంచ గచ్చిబౌలిలో లే అవుట్.. 5 విడతల్లో వేలం
రూ.30 వేల కోట్ల ఆదాయమే లక్ష్యం.. కన్సల్టెంట్ల నుంచి ప్రతిపాదనలు కోరుతూ టీజీఐఐసీ ప్రకటన
7న ప్రీ బిడ్ సమావేశం.. ఈనెల 15 వరకు బిడ్ దాఖలుకు గడువు



నెలాఖరుకు 70 వేల కోట్లకు అప్పు

బడ్జెట్‌లో వేసిన అంచనాకు మించి సేకరణ!
ఇప్పటికే రూ.63,586 కోట్లకు చేరిక 13
తాజాగా 2 వేల కోట్ల అప్పు తీసుకున్న సర్కారు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వనరుల సమీకరణ కోసం భూముల వేలానికి సర్కార్ సిద్ధమైంది. అత్యంత విలువైన కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను లే అవుట్ వేసి వేలం ప్రక్రియ ద్వారా విక్రయించాలని నిర్ణయించింది. అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాత దీనిని చేపట్టనుంది. తద్వారా, సుమారు రూ.30 వేల కోట్ల నిధులు సేకరించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఈ మేరకు కన్సల్టెంట్ల నుంచి ప్రతిపాదనలు కోరుతూ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) టీజీఐఐసీ ప్రకటన ఇచ్చింది. సదరు కన్సల్టెంట్ రెండు ప్రిలిమినరీ, తుది మాస్టర్ ప్లాన్ లే అవుట్‌ను రూపొందించి సర్కారుకు అందజేయాల్సి ఉంటుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి పరిధిలోని సర్వే నంబరు 25 (పి) పరిధిలో 400 ఎకరాల భూములున్నాయి. సైబరాబాద్, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ జిల్లా, రాయదుర్గం తదితర ప్రాంతాలకు సమీపంలోనే ఈ భూములున్నాయి. వేలానికి ప్రతిపాదించిన భూమి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 33 కి.మీ. దూరంలో; సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి 22 కి.మీ.; హైటెక్ సిటీ నుంచి 7-8 కి.మీ. దూరంలో ఉంది. ఈ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి భారీ లే అవుట్‌ను రూపొందించిన

మిగతా 13వ పేజీలో...

సుంకాల యుద్ధం

అమెరికా ఉత్పత్తులపై చైనా, కెనడా ప్రతీకార పన్నులు
ట్రంప్‌నకు తగిన సమాధానం చెప్పి తీరుతాం: ట్రూడో
సుంకాల వ్యవహారం ఒకరకంగా యుద్ధమే: వారెన్ బఫెట్

ఉక్రెయిన్‌కు సైనికసాయం నిలిపివేత

అమెరికా నిర్ణయం.. తక్షణం అమల్లోకి
రష్యాతో చర్చలకు సిద్ధపడితేనే నిర్ణయం వెనక్కి
అది కూడా ట్రంప్ నిర్ధారించిన తర్వాతే: వైట్‌హౌస్
ట్రంప్ నేతృత్వంలో నడుస్తాం.. ఖనిజాల ఒప్పందానికి సిద్ధం
తొలుత గగనతలంలో శాంతి.. ఎక్స్‌లో జెలెన్‌స్కీ ప్రకటన



వాషింగ్టన్, బీజింగ్, మార్చి 4: అమెరికా, చైనా, కెనడా, మెక్సికో నడుమ సుంకాలు, ప్రతి సుంకాల యుద్ధం జోరందుకుంది! చైనాపై ఇప్పటికే విధిస్తున్న 10 శాతం సుంకాన్ని రెట్టింపు చేయడంతోపాటు.. మెక్సికో, కెనడాలపై విధించిన 25% సుంకాల అమలు మంగళవారం నుంచే మొదలవుతుందని ట్రంప్ చేసిన ప్రకటనకు ఆయా దేశాలు

మిగతా 2వ పేజీలో...

ఆంధ్రజ్యోతి

సింహాలతో సయ్యాట!

వంతారాలో సరదాగా గడిపిన ప్రధాని మోదీ

వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ప్రారంభం

అహ్మదాబాద్, మార్చి 4: ప్రపంచంలోనే అతిపెద్ద వన్య ప్రాణి సంరక్షణ, పునరావాస కేంద్రమైన వంతారాను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. గుజరాత్ పర్యటనలో భాగంగా ఆయన జామ్‌నగర్ జిల్లాలో 3,500 ఎకరాల విస్తీర్ణంలో అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని సందర్శించారు. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ ఏర్పాటు చేసిన ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో 1.5 లక్షలకు పైగా జంతువులు, పక్షులను సంరక్షిస్తున్నారు. నిపుణుల సంరక్షణలో అరుదైన, అంతరించిపోతున్న జాతులను కాపాడుతున్నారు. ఈ కేంద్రానికి వచ్చిన ప్రధాని మోదీకి.. ముకేశ్ అంబానీ కుటుంబ సమేతంగా స్వాగతం పలికారు. వంతారాను ప్రారంభించిన అనంతరం అనంత్ అంబానీతో కలిసి ప్రధాని వంతారా మొత్తం కలియ దిరిగారు. ఈ కేంద్రంలో పునరావాసం పొందుతున్న వివిధ రకాల జంతువులతో సరదాగా గడిపారు. సింహం పిల్లలు, చిరుతపులి పిల్లలకు పాలు పట్టారు. ఏనుగులు, జిరాఫీలకు ఆహారం అందించారు. జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ సెంటర్లను, ఐసీయూ వంటి అధునాతన సౌకర్యాలతో కూడిన మల్టీ స్పెషాలిటీ వైల్డ్ లైఫ్ హాస్పటల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఆర్ఐ స్కానింగ్ తీయించుకుంటున్న ఆసియా సింహాన్ని గమనించారు. ప్రమాదంలో గాయపడిన చిరుతపులికి శస్త్రచికిత్స చేస్తున్న ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించారు. ఏనుగులు త్వరగా కోలుకోవడానికి ఉపయోగపడే హైడ్రోథెరపీ పూల్‌ను పరిశీలించారు. జీబ్రాలతో కలిసి నడిచారు. చింపాంజీలతో ఫొటోలు దిగారు. పెద్ద కొండ చిలువలు, రెండు తలల పాములు, రెండు తలల తాబేళ్లు, మొసళ్లు, సీల్స్‌తో సహా ప్రపంచంలోని కొన్ని అరుదైన జాతులను వంతారాలో సంరక్షిస్తున్నారు.




అనంత్ మనసు గొప్పది: మోదీ

పర్యావరణ సుస్థిరతను, వన్యప్రాణుల సంక్షేమాన్ని ప్రోత్సహిస్తూనే జంతువులకు సురక్షితమైన ఆవాసాన్ని కల్పిస్తున్న వంతారాను ప్రారంభించడం ఆనందంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఇంతటి దయగల పనిచేస్తున్న అనంత్ అంబానీ, అతని బృందాన్ని అభినందిస్తున్నానని చెప్పారు. వంతారాలో పనిచేస్తున్న వైద్యులు, సహాయక సిబ్బంది, కార్మికులతో ప్రధాని మోదీ మాట్లాడారు.



చిరుతపులి కూనకు పాలు తాగిస్తున్న ప్రధాని మోదీ

లోకం తీరు



సుంకాల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అంతే ఘాటుగా స్పందించాయి. అమెరికా నుంచి తాము దిగుమతి చేసుకునే చికెన్, గోధుమలు, మొక్కజొన్న, పత్తి వంటి ఉత్పత్తులపై అదనంగా 15% సుంకాన్ని విధిస్తున్నట్టు చైనా ప్రకటించింది. అలాగే సోయాబీన్స్, పంది మాంసం, బీఫ్, పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులపై 10% అదనపు సుంకాన్ని వసూలు చేస్తామని పేర్కొంది. అంతేకాదు.. అమెరికాపై ప్రపంచ వాణిజ్య సంస్థలో చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించింది. తాము విధించిన అదనపు సుంకాలు మార్చి 10 నుంచి అమల్లోకి వస్తాయని చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్ తెలిపింది. ఈ చర్యలతోపాటు.. అమెరికాకు చెందిన 10 కంపెనీలను 'విశ్వసనీయం కాని సంస్థల జాబితా'లో చేర్చాలని చైనా నిర్ణయించింది. అమెరికాకు చెందిన రక్షణ, ఏఐ, వైమానిక, ఐటీ రంగాలకు చెందిన కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ చర్యలతోపాటు.. అమెరికాతో ఉక్రెయిన్‌కు, యూరప్ దేశాలకు మధ్య దూరం పెరిగిన నేపథ్యంలో యూరోప్ దేశాలతోపాటు ఉక్రెయిన్‌తో సంబంధాలు పెంచుకునేందుకు చైనా ప్రయత్నాలు ప్రారంభించింది. మరోవైపు.. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. దీనికి తాము తగిన సమాధానం చెప్పి తీరుతామని హెచ్చరించారు. అమెరికా తన నిర్ణయాన్ని వెనక్కితీసుకోకపోతేగనక.. ఆ దేశం నుంచి కెనడాకు దిగుమతయ్యే ఉత్పత్తులపై తొలి దశలో 25% సుంకాలను విధిస్తామని, మంగళవారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచే ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని ఆయన వెల్లడించారు. మరో మూడువారాల తర్వాత.. రెండో దశలో భాగంగా ఆటోమొబైల్, స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై 25% సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. అమెరికా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేదాకా ఈ సుంకాలను ఇలాగే కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. మరోవైపు మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మాత్రం.. అమెరికా సుంకాలపై తాము ఆచితూచి వ్యవహరిస్తామని, దీనిపై తమ వద్ద ప్లాన్ ఏ, ప్లాన్ బీ, సి, డి కూడా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ట్రంప్ తీరుపై అమెరికా స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ స్పందించారు. ప్రతీకార సుంకాలు విధించడాన్ని.. ఒకరకంగా యుద్ధంగానే (యాక్ట్ ఆఫ్ వార్) భావించవచ్చని పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో నిరసనలు చేస్తే నిధులు ఆపేస్తాం

అమెరికా విద్యాసంస్థల్లో నిరసనలపై నిషేధం విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఆజ్ఞలను ఉల్లంఘిస్తే నిధులు నిలిపివేస్తామని ఆయన హెచ్చరించారు. 'చట్ట వ్యతిరేక నిరసనలు, ఆందోళనలను ప్రోత్సహించే విద్యాసంస్థలకు నిధులను నిలిపివేస్తాం. అంతేకాకుండా ఆందోళనకారులకు జైలుశిక్ష లేదా దేశ బహిష్కరణ తప్పదు.' అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమ వేదిక అయిన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.

మహారాష్ట్ర మంత్రి ధనుంజయ్ రాజీనామా

- ప్రధాన అనుచరుడిపై హత్య కేసుతో సంచలన నిర్ణయం



ధనుంజయ్ ముండే

ముంబై, మార్చి 4: మహారాష్ట్రలో సంచలనం చోటు చేసుకుంది. సీఎం ఫడణవీస్ మంత్రివర్గంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న ఎన్సీపీ ఎమ్మెల్యే ధనుంజయ్ ముండే మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. తన ప్రధాన అనుచరుడు వాల్మీక్ కరాడ్‌పై హత్య కేసు నమోదు కావడంతో తాను మంత్రి పదవికి రాజీనామా చేసినట్టు ముండే తెలిపారు. సోమవారం రాత్రి ఎన్సీపీ చీఫ్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. కరాడ్‌పై సీఐడీ నమోదు చేసిన హత్య కేసు సహా మరో కేసుకు సంబంధించి ఆయన చర్చించారు. మరుసటి రోజే మంత్రి ధనుజయ్ తన పదవికి రాజీనామా చేశారు. బీడ్ జిల్లా పార్లి నియోజకవర్గం నుంచి ముండే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీడ్ జిల్లాలోని ఓ ఇంధన సంస్థపై ముండే ప్రధాన అనుచరుడు కరాడ్ అతని అనుచరులు దాడి చేయడంతోపాటు సంస్థ ఆస్తులను దోచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే జిల్లాలోని మస్సాజాగ్ గ్రామ సర్పంచ్ సంతోశ్ దేశ్‌ముఖ్.. కరాడే అక్రమాలను అడ్డుకోవడంతోపాటు వాటిని వెలుగులోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో గతేడాది డిసెంబరు 9న దేశ్‌ముఖ్ కిడ్నాప్, హత్య జరిగింది. విచారణ జరిపిన సీఐడీ అధికారులు దేశ్‌ముఖ్ హత్యకేసుతోపాటు మరో రెండు కేసులకు సంబంధించి 1200 పేజీల చార్జిషీట్‌ను కోర్టులో సమర్పించారు. దీనిలో రెండు కేసుల్లో కరాడ్‌ను ఏ-1గా పేర్కొన్నారు. దీంతో గత మూడు మాసాలుగా విపక్షాలు మంత్రి ధనుంజయ్ రాజీనామాకు పట్టుబట్టడంతోపాటు అసెంబ్లీని స్తంభింపజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముండే ఎట్టకేలకు రాజీనామా చేశారు. కాగా, సర్పంచ్ దేశ్‌ముఖ్ హత్యకు సంబంధించి సీఐడీ అధికారులు దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడించారు. డిసెంబరు 9న అపహరణకు గురైన దేశ్‌ముఖ్‌ను నిందితులు అత్యంత దారుణంగా హింసించారని, రాడ్లతో విచక్షణా రహితంగా కొట్టారని చార్జిషీట్‌లో పేర్కొన్నారు. అంతేకాదు.. ఆయనపై మూత్రం పోసి పైశాచిక ఆనందం పొందారని తెలిపారు. ప్రాణం పోయేవరకు కొన్ని గంటలపాటు రాడ్లతో కొడుతూనే ఉన్నారని పేర్కొన్నారు.

అసెంబ్లీ ద్వారం వద్ద పాన్ ఉమ్మిన ఎమ్మెల్యే.. స్వయంగా కడిగి శుభ్రం చేసిన యూపీ స్పీకర్

లఖ్‌నవూ, మార్చి 4: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ప్రధాన హాలు ప్రవేశ ద్వారం వద్ద కార్పెట్‌పై ఓ సభ్యుడు పాన్ మసాలా ఉమ్మేయడంపై స్పీకర్ సతీశ్ మహానా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలను అడ్డుకోవాలని, సభా గౌరవాన్ని కాపాడాలని ఎమ్మెల్యేలను ఆయన కోరారు. మంగళవారం ఉదయం సెషన్ ప్రారంభమైన వెంటనే స్పీకర్ మాట్లాడుతూ, గౌరవ సభ్యుల్లో ఒకరు విధానసభ హాల్‌లో పాన్ మసాలా ఉమ్మి వేశారని చెప్పారు. 'ఆ సభ్యుడు ఎవరో నాకు తెలుసు. అయితే నేను బహిరంగంగా పేరు చెప్పదల్చుకోలేదు. నాకు ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదు. ఆ సభ్యుడు తనంతట తానుగా వచ్చి నన్ను కలవాలి. లేకుంటే బలవంతంగా పిలిపించాల్సి వస్తుంది' అని మహానా పేర్కొన్నారు. సభా కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే ఈ విషయం తెలియడంతో తాను స్వయంగా ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశానని వెల్లడించారు. అసెంబ్లీ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని స్పష్టం చేశారు. కార్పెట్ మార్చడానికి అయ్యే వ్యయాన్ని సదరు సభ్యుడి నుంచి వసూలు చేయాలన్నారు.

సినిమాలు చూడకుండా నేను బతగ్గలను

- సినీరంగం వారిని ఉద్దేశించి డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సినిమాలు చూడకుండా బతికేశక్తి తనకు ఉందని, కానీ సినిమా వాళ్లు బతకాలంటే ప్రభుత్వం, ప్రజలు తప్పనిసరిగా ఉండాల్సిందేనని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. విధానసౌధలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో సినిమారంగం వారు రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని, వారి నట్లు, బోల్టులు ఎలా టైట్ చేయాలో తెలుసని తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలపై డీకే స్పందించారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోనని, సినిమావారికి ఎంత సాయం చేశానో తనకు తెలుసునన్నారు. కానీ రాష్ట్రంలో నేల, నీరు, భాష మనుగడ సాధించాల్సిందేనన్నారు.

ఉక్రెయిన్‌కు సైనికసాయం బంద్

అమెరికా నిర్ణయం.. తక్షణం అమల్లోకి.. 100 కోట్ల డాలర్ల ఆయుధ సామగ్రి సరఫరాపై ప్రభావం

- ట్రంప్ నాయకత్వంలో నడుస్తాం
- ఖనిజాలు అప్పగించేందుకూ సిద్ధం
- ఎక్స్‌లో జెలెన్‌స్కీ ప్రకటన
- వైట్ హౌస్‌లో వాగ్వాదంపై పశ్చాత్తాపం



ఓవల్ ఆఫీసులో జెలెన్‌స్కీ, ట్రంప్ వాగ్వాదం(ఫైల్)

వాషింగ్టన్, మార్చి 4: రష్యాతో యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్‌కు గత కొన్నేళ్లుగా అందిస్తున్న సైనిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని, 100 కోట్ల డాలర్లకుపైగా (రూ.8,722 కోట్ల) విలువైన ఆయుధ సామగ్రి సరఫరా మీద ప్రభావం పడుతుందని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అంతేగాక, 'ఉక్రెయిన్ సెక్యూరిటీ అసిస్టెన్స్ ఇనిషియేటివ్' కింద అమెరికా కంపెనీల నుంచి ఆయుధాలను కొనుగోలు చేయటానికి ఉక్రెయిన్‌కు అందిస్తున్న లక్షలాది డాలర్ల సాయం కూడా నిలిచిపోనుందన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన పలువురు అధికారులతో సమగ్రంగా చర్చించిన తర్వాతే అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రష్యాతో శాంతి చర్చలకు ఉక్రెయిన్ కట్టుబడి ఉందని ట్రంప్ నిర్ధారించుకునేంతవరకూ ఈ నిర్ణయం అమల్లో ఉంటుందన్నారు. అమెరికా అంతర్గతవ్యవహారాల శాఖ ప్రకారం.. రష్యా ఆక్రమణ మొదలైన తర్వాత 2022 ఫిబ్రవరి 24 నుంచి ఇప్పటి వరకూ ఉక్రెయిన్‌కు అమెరికా 6,590 కోట్ల డాలర్ల (రూ.5,74,811 కోట్ల) సైనిక సాయాన్ని అందించింది. ఇటీవల అమెరికాను సందర్శించిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, ఉక్రెయిన్‌కు ట్రంప్ సైనికసాయాన్ని నిలిపివేయటం గమనార్హం.

ముగింపు లేని యుద్ధం కోరుకోవడం లేదు

సైనిక సాయం నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించిన గంటల వ్యవధిలోనే జెలెన్‌స్కీ స్పందిస్తూ.. ఉక్రెయిన్‌లో సుస్థిర శాంతి నెలకొనేందుకు ట్రంప్ దృఢమైన నాయకత్వంలో పనిచేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "శుక్రవారం వైట్‌హౌజ్‌లో జరిగిన మా సమావేశం అనుకున్న రీతిలో సాగలేదు. అందుకు చింతిస్తున్నా. పరిస్థితులను చక్కదిద్దాల్సిన సమయం ఆసన్నమైంది" అని పేర్కొన్నారు. "ముగింపులేని యుద్ధం కొనసాగాలని ఎవరమూ కోరుకోవడం లేదు. శాంతి కావాలని ఉక్రెయిన్లకు తప్ప ఇంకెవరికి ఉంటుంది? సుస్థిరమైన శాంతి సాధన కోసం అధ్యక్షుడు ట్రంప్ సమర్థ నాయకత్వంలో నేను, నా బృందం కలిసి నడుస్తాం" అంటూ అమెరికాకు అనుకూలంగా అభిప్రాయాలను వెల్లడించారు. తొలుత గగనతలంలో శాంతి నెలకొల్పడమే తమ లక్ష్యమని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. "యుద్ధాన్ని ముగించడం కోసం సత్వరమే ప్రయత్నాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం. ఒప్పందంలో భాగంగా తొలిదశలో ఖైదీలను విడుదల చేస్తాం. గగనతలంలో శాంతి నెలకొనేలా చూస్తాం. క్షిపణులు, దీర్ఘశ్రేణి డ్రోన్లు, ఇంధన వనరులు, పౌర సదుపాయాలపై బాంబుల ప్రయోగాన్ని నిషేధిస్తాం. తరువాత సముద్రంపై జరుగుతున్న యుద్ధానికి సంబంధించి సంధి కుదుర్చుకుంటాం. రష్యా కూడా ఇలాగే చేస్తే అనంతర దశలపై కూడా సత్వర చర్యలు తీసుకుంటాం. అమెరికాతో కలిసి పనిచేసి బలమైన తుది ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం" అని వివరించారు. ఇంతవరకు అమెరికా చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెబుతూ ఖనిజాల విషయమై ఒప్పందాన్ని కుదుర్చుకుంటామని తెలిపారు. "ఉక్రెయిన్ సార్వభౌమ అధికారం, స్వాతంత్ర్యం పరిరక్షణకు అమెరికా అందించిన సాయాన్ని గౌరవిస్తున్నాం" అన్నారు.

రష్యాపై అమెరికా ఆంక్షల ఎత్తివేత!

రష్యాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ట్రంప్ భావిస్తున్నారు. ఏయే అంశాలపై ఆంక్షలను తగ్గించవచ్చో జాబితా రూపొందించాలంటూ అధ్యక్షుడి కార్యాలయమైన శ్వేత సౌధం నుంచి ఆర్థిక శాఖకు సమాచారం అందించింది. కొన్ని వస్తువులతో పాటు, వ్యక్తులపై విధించిన ఆంక్షలను కూడా తగ్గించనుంది. ఆ దేశ ప్రభుత్వంపై ప్రభావం చూపే సంపన్నుల (కులీనులు)పై ఉన్న ఆంక్షలను కూడా ఎత్తివేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకు ప్రతిగా ఏమి ఆశిస్తున్నారన్నది ఇంకా తెలియరాలేదు.

అమౌంట్ స్థానంలో అకౌంట్ నంబర్..

కస్టమర్ ఖాతాలోకి రూ. 52,314 కోట్లు

వాషింగ్టన్, మార్చి 4: బ్యాంకు ఉద్యోగులు చేసే చిన్న చిన్న పొరపాట్లతో ఒకరి ఖాతాలో జమవ్వాల్సిన డబ్బులు మరొకరి ఖాతాలో పడటం లేదా పెద్ద మొత్తంలో నగదు అకౌంట్‌లో జమకావడం చూస్తూ ఉంటాం. అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం సిటీ గ్రూపులో కూడా ఇలాంటి పొరపాటే జరిగింది. కాకపోతే ఒకటి రెండు లక్షలు కాదు.. ఏకంగా రూ. 52,314 కోట్ల నగదు పొరపాటున ఒకరి ఖాతాలోకి జమయ్యింది. 2023 ఏప్రిల్‌లో సిటీ గ్రూపు ఉద్యోగి ఓ కస్టమర్ ఖాతాలోకి నగదు జమ చేయబోయి.. పొరపాటున అమౌంట్ స్థానంలో కస్టమర్ అకౌంట్ నంబరు కొట్టారు. లావాదేవీలు పర్యవేక్షించాల్సిన మరో అధికారి కూడా దాన్ని క్లియర్ చేశారు. దాంతో సంబంధిత కస్టమర్ ఖాతాలోకి రూ. 52,314 కోట్లు జయ్యాయి. తర్వాత జరిగిన పొరపాటును గుర్తించి, ఆ లావాదేవీని రివర్స్ చేసి నగదును వెనక్కు తీసుకుని హమ్మయ్య అనుకున్నారు.

బొబ్బట్ల పార్సిల్‌లో కవర్లు వాడొద్దు

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇడ్లీ పార్సిల్‌లో పాలిథీన్ పేపర్లను(ప్లాస్టిక్ కవర్లు) నిషేధించిన అధికారులు.. తాజాగా హోళిగె (బొబ్బట్లు) పార్సిల్‌లోనూ పాలిథీన్ పేపర్లను వినియోగించవద్దని వ్యాపారులను ఆదేశించారు. బొబ్బట్లు పార్సిల్ చేసే సమయంలో ఒకదానికొకటి అతుక్కోకుండా మధ్యలో పాలిథీన్ పేపర్లను ఉపయోగిస్తారు. వేడిగా ఉండే పదార్థానికి పాలిథీన్ పేపర్ వినియోగిస్తే రసాయనాలు విడుదలై క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని ఆహార సంరక్షణ అధికారులు పేర్కొన్నారు. బెంగళూరు, మైసూరులో హోళిగె సెంటర్లపై దాడులు చేసి పాలిథీన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.

వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

- ప్రభుత్వానికి ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు

న్యూఢిల్లీ, మార్చి 4: భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రాయపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ సోమవారం రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాలు, ఆయుధాలు, మౌలిక వసతులు, స్థానికంగా ఉత్పత్తి తదితర అంశాల్లో ఉన్న లోటుపాట్లను అధ్యయనం చేసి, వాటిని అధిగమించడానికి సిఫార్సులు చేసింది. వాయుసేనకు 42 ఫైటర్ స్క్వాడ్రన్స్ మంజూరు కాగా, ప్రస్తుతం 30 మాత్రమే ఉన్నాయి. ఏటా 40 యుద్ధ విమానాలు సరఫరా కావాల్సి ఉండగా సకాలంలో అందడం లేదు. తేలికపాటి యుద్ధ విమానాలు (ఎల్‌సీఏ ఎంకే-1ఏ తరహావి) సరఫరా చేయడంలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సామర్థ్యంపై వాయుసేన అధిపతి అనుమానాలు వ్యక్తం చేశారు కూడా. ఈ నేపథ్యంలోనే యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.

చైనా రక్షణ బడ్జెట్ భారీగా పెంపు!

బీజింగ్, మార్చి 4: చైనా తన రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచనున్నట్లు సంకేతాలిచ్చింది. గతేడాది 232 బిలియన్ డాలర్ల మేర రక్షణ బడ్జెట్‌ను ప్రకటించిన చైనా ఈ సారి దాన్ని మరింత పెంచేందుకు సిద్ధమైంది. ప్రధాని లీ కియాంగ్ ప్రధాన బడ్జెట్‌ను బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న వేళ రక్షణ బడ్జెట్ పెంపు సమాచారం బయటకు వచ్చింది. చైనా తన రక్షణ శక్తి సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు అత్యాధునిక ఎయిర్‌క్రాఫ్టులు, సాంకేతికత కలిగిన యుద్ధ నౌకలు నిర్మించడంతోపాటు సాయుధ దళాలను ఆధునీకరించే పనిలో పడింది. ఇందు కోసం ఏటా భారీగా ఖర్చు పెడుతోంది. ఈ రక్షణ వ్యయంపై నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి స్పందిస్తూ, బలమైన శక్తితోనే శాంతిని పరిరక్షించుకోవచ్చన్నారు.

స్పోర్ట్స్ కోటాలో ఐటీబీపీ కానిస్టేబుల్ ఉద్యోగాలు

న్యూఢిల్లీ, మార్చి 4: ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)లో స్పోర్ట్స్ కోటాలో 133 కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో పురుషులకు 70, మహిళలకు 63 పోస్టులు ఉన్నాయి. అథ్లెటిక్స్, స్విమ్మింగ్, షూటింగ్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, తైక్వాండో, ఆర్చరి, జిమ్నాస్టిక్స్, కబడ్డీ, ఐస్‌హాకీ, ఫుట్‌బాల్, గుర్రపు స్వారీ, కయాకింగ్, రోయింగ్, వాలీబాల్, జూడో, రెజ్లింగ్, హ్యాండ్ బాల్, ఐస్ స్కీయింగ్, పవర్ లిఫ్టింగ్, సైక్లింగ్, యోగాసన, పెన్కాక్, సిలాట్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడాకారులు ఈ ఉద్యోగాలకు అర్హులు. అయితే అభ్యర్థులు మెట్రిక్యులేషన్‌తో పాటు సంబంధిత క్రీడలో వివిధ స్థాయిలలో విజయం సాధించి ఉండాలి. వయసు 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.

ఐటీ ఎగ్గొట్టారని అనుమానం వస్తే చాలు..

మీ మెయిల్‌నూ తనిఖీ చేస్తారు

- ఐటీ అధికారులకు విస్తృత అధికారాలు
- సోషల్, ఇన్వెస్ట్‌మెంట్, ఈ మెయిల్ ఇలా ఏ ఖాతాలనైనా తనిఖీ చేసేందుకు పవర్
- కొత్త ఐటీ బిల్లులో ఈ మేరకు నిబంధనలు
- పార్లమెంటు ఆమోదిస్తే వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి కొత్త చట్టం



న్యూఢిల్లీ, మార్చి 4: మీరు ఆదాయపు పన్ను(ఐటీ)ను ఎగ్గొడుతున్నారన్న అనుమానం వస్తే చాలు.. ఐటీ అధికారులు మీ సోషల్ మీడియా ఖాతాలను, వ్యక్తిగత మెయిళ్లను, బ్యాంక్ అకౌంట్లను, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఖాతాలను తనిఖీ చేయవచ్చు. కేంద్ర క్యాబినెట్ ఇటీవల ఆమోదించిన కొత్త ఐటీ బిల్లు ఇందుకు అధికారం కల్పిస్తోంది. లెక్కల్లో చూపించని నగదు, నగలు, ఇతర విలువైన వస్తువులు, పత్రాలు మీ దగ్గర ఉన్నట్లు భావించినా కూడా అధికారులు వీటన్నింటినీ తనిఖీ చేసేలా ఈ బిల్లు విస్తృత అధికారాలను కట్టబెడుతోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఐటీ చట్టం-1961 ప్రకారం.. ఎవరైనా పన్ను ఎగవేస్తున్నారన్న అనుమానం, సమాచారం ఉంటే వారి ఇండ్లు, ఆఫీసులు, లాకర్లు, అల్మారాల తాళాలు పగలగొట్టి సోదాలు నిర్వహించేందుకు మాత్రమే ఐటీ అధికారులకు అధికారం ఉంది. కానీ, కొత్తగా తీసుకురానున్న చట్టంలో 'వర్చువల్ డిజిటల్ స్పేస్'ను కూడా తనిఖీ చేయవచ్చని పేర్కొన్నారు. ఐటీ బిల్లులోని 247వ క్లాజులో వర్చువల్ డిజిటల్ స్పేస్ కిందకు ఏమేం వస్తాయన్నదానిపై వివరణ ఇస్తూ.. ఈ మెయిళ్లు, ట్రేడింగ్ ఖాతాలు, సోషల్ మీడియా అకౌంట్లను, క్లౌడ్ సర్వర్లను ఆ జాబితాలో చేర్చారు. అయితే, ఈ నిబంధనలపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వీటి వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుందన్న వాదనలున్నాయి. కొత్త ఐటీ బిల్లును ఫిబ్రవరి 7న కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. పార్లమెంటు ఆమోదించాల్సి ఉంది. పార్లమెంటు ఆమోదించి రాష్ట్రపతి సంతకం చేస్తే ఆ బిల్లు చట్టంగా మారి వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది.

బస్తర్ కొత్త ఆశ.. కేశ్‌కాల్ టన్నెల్!

- శరవేగంగా సొరంగ మార్గం పనులు
- భారత్‌మాల ప్రాజెక్టు కింద ఆరు లేన్లతో 464 కి.మీ. రహదారి
- పూర్తయితే రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నానికి 7 గంటలే
- ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి



న్యూఢిల్లీ, మార్చి 4: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా గిరిజన సంస్కృతికి, ప్రకృతి సౌందర్యానికి, అందమైన జలపాతాలకు ప్రసిద్ధి చెందింది. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ ప్రాంతం పర్యాటకంగా బాగా అభివృద్ధి చెందాలి..! కానీ.. గిరిజన ప్రాంతం కావడం, సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో పర్యాటకంగా బాగా వెనకబడింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నం మీదుగా దక్షిణ భారతదేశానికి చేరుకోవాలంటే బస్తర్ నుంచే రావాలి. కొండలు, లోయలతో కూడిన ఈ ప్రాంతంలో ప్రయాణాన్ని సులభతరం చేసే ఉద్దేశంతో బస్తర్ వద్ద కేశ్‌కాల్ టన్నెల్‌ను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. భారత్‌మాల ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న ఈ 2.5 కి.మీ. టన్నెల్ బస్తర్‌తో పాటు ఈ రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చేయనుంది. దక్షిణ భారతదేశానికి కనెక్టివిటీని మెరుగుపరిచే ఈ సొరంగ మార్గం.. ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నానికి రోడ్డు మార్గంలో రావాలంటే దాదాపు 12 గంటలు పడుతోంది. ఈ టన్నెల్ పూర్తయి, ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ హైవే అందుబాటులోకి వస్తే ఇది ఏడు గంటలకు తగ్గనుంది. ఇది వాణిజ్యానికి, పర్యాటక రంగం అభివృద్ధికి ఊతమిస్తుంది. అలాగే స్థానికంగా పరిశ్రమలు పెరుగుతాయి. ఈ నేపథ్యంలో బస్తర్ వద్ద నిర్మిస్తున్న కేశ్‌కాల్ సొరంగ మార్గంపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే టన్నెల్ నిర్మాణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ప్రతిరోజూ 10 మీటర్ల మేర కొండరాయిని తొలుస్తున్నారు.

మారనున్న బస్తర్ ముఖచిత్రం

- బస్తర్ వద్ద నిర్మిస్తున్న కేశ్‌కాల్ టన్నెల్ పొడవు 2.5 కిలోమీటర్లు. ఛత్తీస్‌గఢ్‌లో ఇదే అతి పొడవైన సొరంగ మార్గం.
- 1910లో నిర్మించిన ఇరుకైన పాత రోడ్డు స్థానంలో ఆరు వరుసలతో కూడిన విశాలమైన ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో కేశ్‌కాల్ టన్నెల్ చాలా కీలకమైనది.
- ఈ టన్నెల్ పూర్తయి ఎక్స్‌ప్రెస్ హైవే కూడా అందుబాటులోకి వస్తే.. ఈ మార్గంలో ఉన్న చిత్రకోట జలపాతం, తీరథ్‌గఢ్ జలపాతం, కుతుంసర్ గుహలు, ప్రసిద్ధ దంతేశ్వరి ఆలయం వంటి ప్రధాన పర్యాటక ప్రాంతాలకు ఆదరణ పెరుగుతుంది.

పర్యాటకానికి ఊతం..

కేశ్‌కాల్ టన్నెల్ పూర్తయితే రైతులు, వ్యాపారులకు అపారమైన అవకాశాలు దక్కుతాయి. ముఖ్యంగా బస్తర్‌లో పర్యాటక రంగం అభివృద్ధికి ఇది కీలకం కానుంది. ఈ ప్రాంతం ఇప్పటికే దాని సహజసిద్ధమైన సౌందర్యానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రసిద్ధి చెందింది. కానీ, క్లిష్టమైన భూభాగం కారణంగా సరైన గుర్తింపు దక్కలేదు. ఎక్స్‌ప్రెస్ హైవే వస్తే ఛత్తీస్‌గఢ్, బస్తర్ రైతులు తమ వ్యవసాయ, అటవీ ఉత్పత్తులు, హస్తకళలను దక్షిణ భారతదేశంలోని విస్తారమైన మార్కెట్లకు సులభంగా రవాణా చేయగలుగుతారు. 2026 మార్చినాటికి బస్తర్‌లో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ రోడ్డు మార్గం మరింత సహకరించనుంది. రహదారుల కనెక్టివిటీ, పాఠశాలలు, ఆస్పత్రులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. నక్సలిజంతో అట్టుడికిన ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు మార్గం సుగమం అవుతుంది.

మహిళా సమాఖ్యలకు బస్సులు

- ప్రతి మండల సమాఖ్యకు ఒక బస్సు కేటాయింపు
- ఆపై అద్దెకు ఆర్టీసీకి.. బస్సుపై నెలకు రూ.77,220 రాబడి
- కొనుగోలుకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వనున్న ప్రభుత్వం
- ఈ నెల 8న తొలి విడతగా 150 బస్సుల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. తాజాగా వారికి మరో శుభవార్త చెప్పింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు.. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించాలని నిర్ణయించింది. మహిళలతోనే బస్సులు కొనుగోలు చేయించి.. వారి ఆధ్వర్యంలోనే ఆర్టీసీలో అద్దె నడపనుంది. బస్సుల కొనుగోలు కోసం మహిళా సమాఖ్యలకు ప్రభుత్వమే బ్యాంకు గ్యారంటీ ఇస్తుంది. ఈ మేరకు మార్గదర్శకాలను వివరిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి మండల మహిళా సమాఖ్యకు ఒక బస్సు చొప్పున కేటాయించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తొలి విడత గా 150 మండల సమాఖ్యలకు బస్సులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో బస్సు విలువ రూ.38 లక్షలు అని, బస్సుకు ప్రతి నెలా అద్దె కింద ఆర్టీసీ రూ.77,220 చెల్లిస్తుందని పేర్కొన్నారు. దీంతో దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను నడపనున్నాయి. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు ఈ అద్దె బస్సులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులను ప్రభుత్వం కేటాయించనుంది.

మహిళలకు మంచిరోజులు: మంత్రి సీతక్క

కాంగ్రెస్ ప్రజాపాలనలో మహిళలకు మంచిరోజులు వచ్చాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనసూయ సీతక్క అన్నారు. ఇప్పటివరకు దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసి అద్దెబస్సులను నడపనున్నట్లు చెప్పారు. దీంతోపాటు మరిన్ని వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహించేలా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను ఈ నెల 8న పరేడ్ గ్రౌండ్‌లో ఇందిరా మహిళా శక్తి-2025 కార్యక్రమం ద్వారా ప్రకటిస్తామని తెలిపారు.

ప్రాణం తీసిన ఉరితాడు సరదా!

- త్వరలో ప్రేమపెళ్లి.. ప్రియురాలిని భయపెట్టేందుకు మెడకు ఉరి తాడు.. అది బిగిసి క్యాబ్‌డ్రైవర్ మృతి

బర్కత్‌పురా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకోబోతున్న ప్రియురాలిని భయపెట్టేందుకు సరదాగా వేసుకున్న ఉరితాడు బిగిసి ఓ క్యాబ్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తిలక్ నగర్‌లో నివాసముంటున్న యాకయ్య కుమారుడు ఆదర్శ్(25) నగరంలో క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడు ఐదేళ్లుగా నల్లకుంటలో నివాసముంటున్న ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇద్దరు ఒకరినొకరు ప్రేమించుకోవడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దానికి వారి తల్లిదండ్రులు కూడా అంగీకరించారు. వచ్చే ఏప్రిల్ నెలలో వీరిద్దరికి వివాహం కావాల్సి ఉంది. అయితే సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంటిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఐరన్ బాక్స్ వైరుతో ఉరేసుకుంటున్నట్లు సరదాగా చూపించి కాబోయే భార్యను భయపెట్టాలని అనుకున్నాడు. ఈ క్రమంలో ఫొటో తీసి ఆమెకు పంపించాలని భావించాడు. కాగా ఉరి వేసుకుంటున్నట్లు చూపించే తరుణంలో పొరపాటుగా ఐరన్ బాక్స్ వైరు ఆదర్శ్ మెడకు గట్టిగా బిగుసుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. అతడి మృతితో రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

అసెంబ్లీ స్పీకర్‌కు 'సుప్రీం' నోటీసులు

'ఫిరాయింపుల'పై 22లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశం.. ఐదేళ్లు పూర్తయ్యే వరకూ వాయిదా వేస్తూ ఉంటారా?

- 'తగినంత సమయం'పై మరోసారి సుప్రీం అసహనం
- స్పీకర్ కార్యాలయానికి నోటీసులు అందలేదన్న సింఘ్వీ
- స్పీకర్ సహా ప్రతివాదులందరికీ నోటీసులిచ్చిన కోర్టు
- తదుపరి విచారణ 25కు వాయిదా



న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు అంశంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పీకర్ కోణంలో తగినంత సమయమంటే ఇంకెంత అంటూ మరోసారి నిలదీసింది. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం సహా ప్రతివాదులు అందరికీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22వ తేదీలోపు సమాధానం చెప్పాలని ఆదేశించింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, వారిపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ జనవరి 15న సుప్రీంకోర్టులో మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ మూడింటినీ కలిపి మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌మసీహ్‌ల ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు, న్యాయవాది మోహిత్ రావు, స్పీకర్ కార్యాలయం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ముకుల్ రోహత్గీ హాజరయ్యారు.

ఏడాదవుతున్నా చర్యల్లేవు..

తొలుత ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ.. "గత ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో తొలిసారి ఎమ్మెల్యేల ఫిరాయింపులపై కోర్టును ఆశ్రయించాం. ఆ తర్వాత జూన్‌లో రిట్ పిటిషన్ వేశాం. సుమారుగా ఏడాది కావస్తోంది. నేటికీ స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ బీఫాంపై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. మరో ఎమ్మెల్యే ఏకంగా కాంగ్రెస్ పార్టీ కోసం ప్రచారం చేశారు. మిగతా వాళ్లు ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇది పార్టీ ఫిరాయింపు కాకపోతే మరేమిటి? దీనిపై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాం. సింగిల్ బెంచ్ విచారించింది. తగిన సమయం అంటే ఎంతో ఖరారు చేయాలని ఆదేశించింది. దీనికి నాలుగు వారాల సమయం ఇచ్చింది. హైకోర్టు నిర్ణయంపై స్పీకర్ కార్యాలయం అప్పీల్‌కు వెళ్లగా, సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్ పక్కన పెట్టింది. కానీ, నేటికీ తగిన సమయం అంటే ఎంతో చెప్పలేదు. స్పీకర్ 'తగిన సమయం'పై సుభాష్ దేశాయ్, కేశం మేఘాచంద్, రాజేంద్ర సింగ్ రాణా కేసుల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయి. ఆ తీర్పుల ఆధారంగా పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవచ్చు" అని తెలిపారు.

అలాంటి నిబంధన ఏమీ లేదు..

అసెంబ్లీ స్పీకర్ కార్యాలయం తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. ఫిరాయింపులపై గత ఏడాది జూలై మొదటి వారంలో స్పీకర్‌కు ఫిర్యాదు చేశారని, అదే నెల 9 నాటికే కోర్టులో పిటిషన్ కూడా వేశారని చెప్పారు. ఫిర్యాదుకు, పిటిషన్‌కు మధ్య నిర్దిష్ట గడువు ఉండాలని నారిమన్ తీర్పు ఉందని గుర్తుచేశారు. "ఫిర్యాదులు అందగానే స్పీకర్ స్పందించారు. ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. వారి సమాధానం రాగానే నిర్ణయం తీసుకుంటారు. నిర్దిష్ట సమయంలోనే నిర్ణయం తీసుకోవాలన్న నిబంధనేమీలేదు. స్పీకర్ అనేది రాజ్యాంగ బద్ధంగా అత్యంత ఉన్నత పదవి. అలాంటి స్పీకర్‌కు కోర్టు ఆదేశాలు జారీ చేసే అవకాశం లేదు"అని సింఘ్వీ వాదనలు వినిపించారు.

ఏళ్ల తరబడి సాగదీస్తారా?

సింఘ్వీ వాదనలపై జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్రంగా స్పందించారు. "మీ (స్పీకర్) దృష్టిలో తగినంత సమయం అంటే ఎంత? ఇలా ఏళ్ల తరబడి వాయిదాలు వేస్తూ ఉంటారా? ఐదేళ్లు పూర్తయ్యే వరకూ వాయిదాలతో కాలం వెళ్లదీస్తారా? సమయం విషయంలో న్యాయస్థానం కలగజేసుకోవాలా? వద్దా? నిర్దిష్ట సమయాన్ని నిర్ణయించాల్సిన అవసరం ఉందా? లేదా? చట్టసభల గడువు ముగిసే వరకూ నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తామంటే ఎలా? ఆపరేషన్ సక్సెస్.. పేషంట్ డెడ్ అన్నట్టు వ్యవహరిస్తామంటే సరికాదు" అని జస్టిస్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన సింఘ్వీ, రోహత్గీ.. తగిన సమయం, ఫిరాయింపులపై నిర్ణయానికి సంబంధించి స్పీకర్ కార్యాలయానికి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక నోటీసులు అందలేదని చెప్పారు. దీంతో అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం సహా ప్రతివాదులు అందరికీ ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టుతోపాటు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రీ నేరుగా నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. నోటీసులపై ఈ నెల 22లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను 25న నిర్వహిస్తామని తెలిపింది. దీన్ని అత్యంత ప్రాధాన్య కేసుగా పరిగణించి 25న తొలి కేసుగా లిస్టు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

15 ఏళ్లకే.. 175 సర్టిఫికెట్ కోర్సులు

- పదో తరగతి విద్యార్థిని ప్రవల్లిక ఘనత
- ప్రత్యేక ఇంటర్వ్యూ చేసిన డిస్నీ హాట్ స్టార్



విద్యార్థిని ప్రవల్లిక

భీమునిపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చదివేది పదో తరగతి.. అయితేనేం 15 ఏళ్ల వయసులోనే 175 సర్టిఫికెట్ కోర్సులు చేసి ఔరా అనిపించింది. అందుకే ప్రముఖ టెలివిజన్ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ఆ విద్యార్థినిని వెతుక్కుంటూ వచ్చి ఇంటర్వ్యూ తీసుకుంది. విశాఖపట్నం జిల్లా భీమిలి మండలంలోని గొల్లలపాలెం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న బండారు ప్రవల్లికను.. డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసిందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకుమారి మంగళవారం తెలిపారు. ఇన్ఫోసిస్ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ అయిన స్ప్రింగ్ బోర్డులో ప్రవల్లిక టైమ్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, డ్రోన్, రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా బేసిస్ వంటి అనేక అంశాలపై 175 సర్టిఫికెట్ కోర్సులు చేసిందని చెప్పారు. చిన్న వయసులోనే ఇన్ని సర్టిఫికెట్ కోర్సులు చేసిన ఆమెను ఢిల్లీ నుంచి వచ్చిన హాట్‌స్టార్ టీమ్ కలిసిందని, ఆమె అనుభవాలను అడిగి తెలుసుకుందని పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూ త్వరలోనే డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రసారమవుతుందని తెలిపారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం కోనెంపాలేనికి చెందిన ప్రవల్లిక తల్లి పాప బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. తండ్రి కొవిడ్ సమయంలో చనిపోయారు.

కేసు సీబీఐకి వెళ్లకుండా పుట్టా మధు ప్రయత్నాలు

- వామనరావు దంపతుల హత్య కేసులో న్యాయవాది వాదనలు
- విచారణ వాయిదా వేసిన సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సంచలనం సృష్టించిన న్యాయవాదులు గట్టు వామనరావు, నాగమణి దంపతుల హత్య కేసు మంగళవారం మరోసారి సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసు కేంద్ర దర్యాప్తు సంస్థ- సీబీఐ పరిధిలోకి వెళ్లకుండా అనుమానితుడు పుట్టా మధుకర్ ప్రయత్నిస్తున్నారని సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో 2021 ఫిబ్రవరి 17న జరిగిన గట్టు వామనరావు దంపతుల హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కోరుతూ ఆయన తండ్రి గట్టు కిషన్ రావు అదే ఏడాది సెప్టెంబర్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గత విచారణ సందర్భంగా.. కేసు విచారణను సీబీఐకి అప్పగించడానికి తమకు అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు ఆదేశిస్తే విచారణకు తాము సిద్ధమేనని సీబీఐ సైతం స్పష్టం చేసింది. ఈ క్రమంలో తన వాదనలు సైతం వినాలని పుట్టా మధుకర్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. రెండు వారాల సమయమిచ్చింది. ఆ పిటిషన్ మంగళవారం ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. మధుకర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆర్టీఐ ద్వారా సమాచారం కోరామని, అందువల్ల కౌంటర్ దాఖలుకు మరో రెండువారాల సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కిషన్ రావు తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి అభ్యంతరం తెలిపారు. కేసు విచారణ సీబీఐ దర్యాప్తునకు వెళ్లకుండా అడ్డుకునే యత్నం చేస్తున్నారని అన్నారు. గత విచారణ సందర్భంగానే కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కోరారని, మళ్లీ ఇప్పుడు గడువు అడుగుతున్నారని చెప్పారు. వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం కేసు విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

మామునూరులో ఉద్రిక్తత

సర్వే అధికారులను అడ్డుకున్న రైతులు.. భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్

- వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు



ఆర్డీవో, తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

మామునూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ మామునూరు విమానాశ్రయ స్థలం వద్ద రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. భూ సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. మంత్రి కొండా సురేఖ ఇచ్చిన మాట ప్రకారం భూమికి బదులు భూమి ఇస్తేనే సర్వేకు అనుమతి ఇస్తామని, లేదంటే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. నక్కలపల్లి, భట్టుపల్లి, నల్లగుంట, గాడిపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది రైతులు నిరసన చేపట్టారు. భూమి ఇవ్వని పక్షంలో మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని, అంతేగాకుండా తమ ఊరికి ప్రత్యామ్నాయ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. దీంతో దాదాపు రెండు గంటల పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. విధి లేని పరిస్థితిలో రెవెన్యూ అధికారులు సర్వే చేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు.

సేకరించాల్సిన భూమి 253 ఎకరాలు

మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి ఇటీవలే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుంది. ఇప్పటికే 696ఎకరాల స్థలం ఉండగా మరో 253 ఎకరాలు అవసరమని అధికారులు నిర్ణయించారు. భూసేకరణకు నిధులను కూడా ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెలలోనే భూసేకరణ చేసి మరో నాలుగైదు నెలల్లో విమానాల రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా గతంలో భూమి కోల్పోతున్న బాధితులకు భూమికి బదులు భూమిని, ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు ఇస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారని, దానికి కట్టుబడి ఉండాలని రైతులు డిమాండ్ చేశారు.

నిజాంపేటలో హైడ్రా కూల్చివేతలు

- ఇందిరమ్మ కాలనీలో రోడ్డు ఆక్రమణల తొలగింపు
- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన మహిళలు
- ఉద్రిక్తతల మధ్యే ఆక్రమణలను తొలగించిన అధికారులు



పోలీసులను అడ్డుకుంటున్న ఇందిరమ్మ కాలనీ మహిళలు

నిజాంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ఆక్రమణలపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపించారు. నిజాంపేట కార్పొరేషన్‌లో ఆక్రమణలను కూల్చివేశారు. 12వ డివిజన్‌లో ఉన్న ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లో రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, ఆక్రమణలను హైడ్రా అధికారులు మంగళవారం కూల్చేశారు. ఇందిరమ్మ కాలనీలో కొందరు రహదారులను ఆక్రమించి అపార్ట్‌మెంట్ ర్యాంపుల ముందు రోడ్డుపైకి జరిగి చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరు మొక్కల కోసం ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసి ఐరన్ ఫ్రేమ్ మెట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గతంలో హైకోర్టు కూడా కార్పొరేషన్‌కు ఆదేశాలు ఇచ్చింది. అయితే అధికారులు స్పందించలేదు. ఈ ఆక్రమణల కారణంగా ఇందిరమ్మ కాలనీ మీదుగా మియాపూర్ వైపు రాకపోకలు సాగించడానికి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ విషయమై బాలాజీహిల్స్, కేటీఆర్ కాలనీ వాసులు హైడ్రాకు రెండు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అధికారులు అప్పట్లోనే కాలనీలను సందర్శించి ఆక్రమణలను రెండు నెలల్లో తొలగించాలని ఆదేశించారు. అయినా ఆక్రమణదారులు పట్టించుకోలేదు. దీంతో హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది, బాచుపల్లి పోలీసులు, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా మంగళవారం ఆక్రమణలను తొలగించారు.

నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారు?

హైడ్రా అధికారులపై ఇందిరమ్మ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. తమ కాలనీలో కూల్చుతున్నట్లుగా పక్కన కాలనీల్లోనూ కూల్చివేయాలని డిమాండ్ చేశారు. తాము గత 20 ఏళ్లుగా ఇందిరమ్మ కాలనీలో ఉంటున్నామని, చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్నామని, వాటిని తొలగించాలని పక్క కాలనీల వాసులు తమపై కక్ష కట్టారని వాపోయారు. తమ దుకాణాలను కూల్చి, జీవితాలను ఆగం చేయొద్దంటూ పోలీసులు, హైడ్రా అధికారులను వేడుకున్నారు. కాలనీ వాసులంతా ఏకమై మియాపూర్ నుంచి వచ్చే రోడ్డును పూర్తిగా బంద్ చేశారు. కేటీఆర్ కాలనీ, బాలాజీ హిల్స్ వారి వాహనాలు ఎలా పోతాయంటూ అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఒకదశలో పోలీసులతో వాగ్వాదం, తోపులాట జరిగింది. ఆందోళనలు కొనసాగుతుండగానే హైడ్రా సిబ్బంది కూల్చివేతలను పూర్తి చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బిహార్‌లో ఎన్నికల వేడి

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు మా చెడ్డ కోపం వచ్చింది. మీ నాన్నను రాజకీయాల్లోకి తెచ్చిందీ, ఉద్ధరించిందీ నేనే, నాముందా నీ కుప్పిగంతులు అంటూ లాలూ యాదవ్ కుమారుడిమీద మంగళవారం అసెంబ్లీలో వీరంగం వేశారు. ఆదాయం ఆవగింజంత పెరగకున్నా, బడ్జెట్‌ని మాత్రం భారీగా వండేస్తున్నారని విమర్శిస్తూ తన తండ్రి ఏలుబడిలో రాష్ట్రం వెలిగిందనీ, ఇప్పుడన్నీ గారడీలేనని ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ వ్యాఖ్యానించడంతో నితీశ్ కోపం నసాళానికి అంటింది. మీ నాన్నను తయారుచేసిందీ, పెంచిందీ నేను.. మీ నాన్న ఏలుబడిలో అసలేం ఉంది, అంతా చీకటి, సాయంత్రమైతే బయటకు రావడానికి జనం జడుసుకొనేవారు, అప్పుడు నువ్వు పిల్లాడివి, పోయి ఆ జనాన్ని అడుగు నిజాలు తెలుస్తాయి అని నితీశ్ ఆగ్రహించారు. లాలూ సొంతకులానికి చెందినవారే ఆయన ఎదుగుదలను వ్యతిరేకిస్తుంటే, తాను మాత్రం ఆయనను పైకి తీసుకొచ్చానని నితీశ్ చెప్పుకొచ్చారు. మరో తొమ్మిదినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున రాబోయే రోజుల్లో ఇటువంటి దృశ్యాలు చాలా చూడాల్సి ఉంటుంది.

లాలూ ఏలుబడిలో బిహార్‌లో ఆటవిక రాజ్యం కొనసాగిందని నితీశ్‌తో పాటు, ప్రధాని నరేంద్రమోదీ కూడా ఆ రాష్ట్ర ప్రజలకు గుర్తుచేశారు. పది రోజుల క్రితం ఆయన బిహార్‌లో చేసిన పర్యటనతో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టేసినట్టుగా కనిపించింది. అన్నదాతలకు పెట్టుబడిసాయం అందించే పీఎం కిసాన్ పథకం 19వ విడత నిధుల విడుదల కార్యక్రమానికి ప్రధాని బిహార్‌లోని భాగల్పూర్‌ను ఎంచుకున్నారు. నిధుల విడుదలతో పాటుగా, లాలూ కుటుంబాన్ని పేరెత్తకుండా విమర్శించారు. పశువుల దాణాను బుక్కేసినవారికి రైతు సంక్షేమం పట్టదన్నారు. కుంభమేళా మీద లాలూ ప్రసాద్ చేసిన విమర్శలను ప్రత్యేకంగా ప్రస్తావించి, జంగల్‌రాజ్‌ను నమ్ముకున్నవారు మన ఘనమైన వారసత్వాన్ని, విశ్వాసాలను అవమానిస్తారంటూ విరుచుకుపడ్డారు. మహాశివరాత్రికి రెండురోజుల ముందు జరిగిన ఈ సదస్సులో మహాకుంభ్‌ను అవమానించినవారిని రాష్ట్రప్రజలు కఠినంగా శిక్షించాలని కూడా మోదీ పిలుపునిచ్చారు. యూపీ మాదిరిగా బిహార్‌లో మతరాజకీయాలు చెల్లవన్నది అందరూ నమ్ముతున్నమాట. ఈ భాగల్పూర్ నుంచే మూడునెలల క్రితం కేంద్రమంత్రి హిందూ స్వాభిమాన్ యాత్ర చేస్తే జనం పెద్ద పట్టించుకోలేదు. అయినప్పటికీ, ఘనమైన రామమందిర నిర్మాణాన్ని జీర్ణించుకోలేనివారు మహాకుంభ్‌ని ఆడిపోసుకుంటున్నారని, ప్రజలే వీరిని శిక్షించాలని మతాన్ని సమపాళ్ళలో మేళవిస్తూ మోదీ చేసిన ఈ వ్యాఖ్య కచ్చితంగా హిందూ ఓబీసీలను, మహిళలను తాకుతుందని బీజేపీ నాయకుల ఆశ. రాబోయే రోజుల్లో బిహార్‌లో బీజేపీ సాగించబోయే ఎన్నికల ప్రచారం ఏ విధంగా ఉండబోతున్నదో ఊహించుకోవచ్చు.

ముఖ్యమంత్రి ఎవరో ముందుగా చెప్పకుండా, మోదీ మొఖాన్ని ముందుపెట్టుకొని ఎన్నికల ప్రచారం సాగించే సంప్రదాయానికి కూడా ఈ మారు తెరపడింది. కేంద్రంలో తమకు వెన్నుదన్నుగా ఉన్న నితీశ్‌నే ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేల్చిచెప్పి, బీజేపీ ఆయన వెంటే నడుస్తోంది. నితీశ్ ఇటీవల చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో మొత్తం ఏడుగురినీ బీజేపీ నుంచే చేర్చుకున్నారు. దీనితో 36మంది మంత్రుల్లో నితీశ్ సహా జేడీయూకు చెందినవారు 13మంది ఉంటే, బీజేపీ నుంచి ఎనిమిది మంది అధికం. బీజేపీతో మరింత బలమైన బంధానికి ఇది నిదర్శనమని, రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారానికి దిగబోతున్నామని జేడీయూ నాయకులు చెప్పుకుంటున్నారు. ఐదేళ్ళనాటి అసెంబ్లీ ఎన్నికల్లో 115 స్థానాల్లో పోటీచేసిన జేడీయూ 43 మాత్రమే గెలుచుకుంటే, 110కి 74నెగ్గి బీజేపీ మంచి స్కోర్‌నీ, రన్‌రేట్‌నీ సాధించింది. దీనితో నాలుగు దశాబ్దాల తరువాత బీజేపీ పెద్దన్న స్థానాన్ని ఆక్రమించి నితీశ్‌కు ఆశీస్సులు అందించింది. ఆయననే కుర్చీలో కొనసాగనిచ్చి కొత్త సమస్యలు రాకుండా జాగ్రత్తపడింది. ఈ సమయాన్ని బీజేపీ ఎంతో చక్కగా వినియోగించుకొని బిహార్‌లో మరింతగా విస్తరించిందని అంటారు. మహారాష్ట్రలో చిన్న భాగస్వామిగా ఉంటూ గుట్టుచప్పుడు కాకుండా ఎదిగి అంతిమంగా శివసేనను మింగేసిన వైనం తెలిసిందే. కానీ, ఆరునూరైనా కుర్చీనుంచి దిగకుండా ఉండటం కోసం ఇప్పటికే పలుమార్లు బీజేపీ, ఆర్జేడీలను అటూ ఇటూ మార్చిన నితీశ్ ప్రస్తుతానికి చేయగలిగింది కూడా ఏమీ లేదు. తొమ్మిదిసార్లు సీఎం అయినా ఒక్కసారి కూడా నేరుగా ప్రజలనుంచి నెగ్గలేదంటూ ఆయనను పల్టూరామ్‌గా హేళన చేసిన ఆర్జేడీ నాయకుడు సునీల్‌కుమార్‌సింగ్‌ను శాసనమండలి బహిష్కరించడం, సుప్రీంకోర్టు ఆయనను తిరిగి సభలోకి అనుమతించడం తెలిసిందే. ప్రజలు ఈ మారు ఆయనను బాహుబలినే చేస్తారో, మరింత బలహీనపరుస్తారో చూడాలి.

ఉత్తరప్రదేశ్ యువతి షహేజాదీ వలే గల్ఫ్ నాట కొందరు తెలుగు మహిళలూ తీవ్ర అభియోగాలు ఎదుర్కొన్నారు. వారికి ఎలాంటి న్యాయ సహాయం అందలేదు. అసలు మరణ శిక్షను ఎదుర్కొనే వారికి కనీస న్యాయ సహాయం లేదా మార్గదర్శకం చేసే వ్యవస్థ భారతీయ ఎంబసీలలో లేదు. షహేజాదీ ఉదంతంతో తెలుగు రాష్ట్రాలు అప్రమత్తం కావల్సిన అవశ్యకత ఉంది.

షహేజాదీలు ఎందరో!

వెలిగిపోతూ వికసిస్తున్న నవ భారతదేశంలో ఉపాధి లేమితో ఏ రకంగానైనా విదేశీగడ్డకు వెళ్ళి తామూ అభ్యున్నతి సాధించాలని ఆరాటపడుతున్న యువజనులకు కొదవలేదు, ఈ విషయంలో యువతులు, యువకులు అనే తేడా లేదు. ఈ క్రమంలో కొందరు అమెరికాకు వెళ్ళి చేతులు, కాళ్ళకు బేడిలతో తిరిగి వస్తుండగా మరి కొందరు ఎడారి దేశాలలో దీనంగా దినాలు గడుపుతున్నారు. ఈ అభాగ్య భారతీయుల గురించి మన పాలకులు పెద్దగా పట్టించుకున్న సందర్భాలు లేవు. తాజాగా ఎడారినాట ఒక భారతీయ మహిళకు అమలుపరిచిన మరణ శిక్ష ఉదంతమే అందుకు నిదర్శనం.


పరాయి గడ్డపై ఒక భారతీయ వనిత మరో తోటి భారతీయ వనిత క్రూర మరణానికి కారణం కాగా క్షేత్రస్థాయిలో సామరస్య

గల్ఫ్ లేఖ

పూర్వకంగా ఈ విపత్కర పరిస్థితిని పరిష్కరించవల్సిన సమాజం ఫేస్‌బుక్‌కు మాత్రమే పరిమితమై మిన్నకుండిపోయింది! గ్రామ పంచాయితీ స్థాయి నుంచి రాష్ట్రపతి భవన్ దాకా ఆ నిర్భాగ్య ప్రవాస భారతీయురాలి తల్లిదండ్రులు తమ కుమార్తెను రక్షించుకునేందుకు చేసిన ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి.. వారి రోదనలు అరణ్యరోదనలయ్యాయి. సమాజం చూపిన ఉపేక్ష మరణాన్ని మించిన బాధకరమైన అనుభవం. పైగా తోటి భారతీయుల కారణాన ఆ దీన ప్రవాసురాలు ప్రాణాలు కోల్పోవడం మరింత బాధాకరం.

గల్ఫ్ దేశాలలో ఖద్దమా లేదా సేవకురాలు అనే ఉద్యోగం చేయడానికి ప్రతి రోజూ కొన్ని వందల మంది భారతదేశం నుండి వస్తుంటారు. ఈ వచ్చేవారిలో అత్యధికులు పేదరికం నుంచి బయటపడి తమ కుటుంబాలకు బంగారు భవిష్యత్తునివ్వాలని స్వప్నించే వారే. ఈ రకంగా వచ్చే వారిలో అత్యధికులు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందినవారే ఉండడం కద్దు. ఉత్తరాది నుండి వచ్చే వారు బహు అరుదు.

నాలుగేళ్ళ క్రితం ఉత్తరప్రదేశ్ నుండి 30 ఏళ్ళ షహేజాదీ అనే యువతి యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్‌కు ఒక లక్ష్యంతో వచ్చింది, బాల్యంలో ప్రమాదవశాత్తు పడిన వేడి నీళ్ళ కారణాన చర్మం కాలిపోయి ముఖంపై శాశ్వత మచ్చలు మిగిలిపోవడంతో, వాటిని తొలగించుకునేందుకు అవసరమైన ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాలని ఆమె నిర్ణయించుకుంది. అయితే ఆ వైద్యం చేయించుకునేందుకు కావాల్సిన డబ్బును సంపాదించుకునేందుకే అమె ఆ గల్ఫ్ దేశానికి వచ్చింది. అయితే విధి వంచితురాలు అయింది. తోటి భారతీయులు అందునా



తోటి రాష్ట్రీయులు, పైగా తనను సిఫార్సు చేసిన వ్యక్తి కరోనా మహమ్మరిలో పేదలకు అన్నదానం చేసిన వాడు కావడంతో అమె ఎక్కడా ఏ కోశాన కూడ సంకోచించకుండా ఎడారి బాట పట్టింది. ఆగ్రాకు చెందిన విద్యాధికుల కుటుంబీకురాలు పైగా ఆబుధాబి విశ్వవిద్యాలయంలో ఆచార్యురాలు తన కాబోయే యాజమానురాలు కావడంతో షహేజాదీ తన భవిష్యత్తు అంతా సవ్యమని భావించింది.

షహేజాది వచ్చిన తర్వాత మాత్రమే ఆమె యాజమానురాలు గర్భం దాల్చి 2022 ఆగస్టులో మగ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి వరకు తల్లి కావడాన్ని ఆ విద్యాధికురాలు వాయిదా వేసుకున్న విషయం ఇక్కడ గమనార్హం. తన ఉద్యోగం సక్రమంగా చేయకుండా వేతనం విషయమై కక్షపూరితంగా వ్యవహరించి షహేజాది తన బిడ్డకు ఊపిరాడకుండా చేసి తన చిన్నారి మరణానికి కారణమయిందని పోలీసులకు ఆ యాజమానురాలు ఫిర్యాదు చేసింది. విచారణ జరిపిన న్యాయస్థానం అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల ప్రాతిపదికన అమెను దోషిగా నిర్ధారిస్తూ 2023 జూలై 31న తీర్పు ఇచ్చింది. ఏడాదిన్నర కాలంగా షహేజాది తండ్రి పోలీసులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులు, స్థానిక కోర్టులు, హై కోర్టులు, ప్రధానమంత్రి, చివరకు రాష్ట్రపతి వరకు ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి తమకు న్యాయ సహాయం చేయవల్సిందిగా అభ్యర్థించారు. చివరకు డిల్లీ హైకోర్టులో ఆమె తండ్రి వేసిన పిటిషన్‌కు సమాధానంగా అమెను కాల్చి చంపి మరణ శిక్షను అమలు చేసినట్లుగా యు.ఏ.ఇ అధికారులు తమకు ఫిబ్రవరి 28న సమాచారం అందించారని ఎమిరేట్స్‌లోని భారతీయ ఎంబసీ పేర్కొంది.

ఇదే ఆబుధాబి ఏమిరేట్ పరిధిలో రెండు దశాబ్దాల క్రితం ఫిలిప్పీన్స్ జాతీయురాలయిన సారా బాల్బగన్‌కు స్థానిక ఇమరాతీ జాతీయుడయిన తన యాజమానిని 34సార్లు దారుణంగా కత్తితో పొడిచి హత్య చేసినందుకు మరణ శిక్ష విధించారు. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం చాకచక్యంగా అమె మరణ శిక్షను హతుడి కుటుంబం చేత రద్దు చేయించి రాజీ చేయించి స్వల్ప జైలు శిక్ష అనంతరం అమెను విడిపించుకుని తన దేశానికి తీసుకుని వెళ్ళింది. ఈ రకమైన ఉద్యోగాలకు పెద్ద సంఖ్యలో తమ మహిళలను పంపించే ఫిలిప్పీన్స్‌తో పాటు శ్రీలంక, ఇండోనేషియా దేశాలు ఇటువంటి కేసులలో గల్ఫ్ దేశాలలోని షరియా చట్టాలకు అనుగుణంగా తమ జాతీయులకు న్యాయ సహాయం అందిస్తూ అండగా నిలుస్తుంటాయి. అయితే ఇక్కడి అటువంటి అభాగ్య భారతీయులకు అటువంటి అండ అందని చందమామే!

ఉన్నత స్థాయి పర్యటనలు, పెట్టుబడులు, యోగా తరగతులు అంటూ మురిసిపోయే మనం.. మనకు అత్యంత సన్నిహిత దేశంలో మన జాతీయురాలికి మరణ శిక్ష అమలు చేసిన తర్వాత కూడ ఆ విషయం తెలుసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాము. అదే రాజకీయ అవసరాల కొరకు, విదేశాలలో శవాల నుండి రక్త పరీక్ష నమూనాలను గంటలలో సేకరించడంలో చూపే ఆసక్తిలో ఏ కొంచెమైనా షహేజాదీ లాంటి ఆభాగ్యురాళ్ళ విషయంలో చూపితే బాగుండేది.

షహేజాదీ ఎదుర్కొన్నటువంటి అభియోగాలను గల్ఫ్ నాట కొందరు తెలుగు మహిళలూ ఎదుర్కొన్నారు. అయితే వారికి సైతం ఎలాంటి న్యాయ సహాయం అందలేదు. అసలు మరణ శిక్షను ఎదుర్కొనే వారికి కనీస న్యాయ సహాయం లేదా మార్గదర్శకం చేసే వ్యవస్థ భారతీయ ఎంబసీలలో లేదు. షహేజాదీ ఉదంతంతో తెలుగు రాష్ట్రాలు అప్రమత్తం కావల్సిన అవశ్యకత ఉంది.

▪ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సైద్ధాంతిక స్పష్టతే బీజేపీ బలం



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

‘ఏమండీ, మనం కూడా కుంభమేళాకు ఎందుకు పోకూడదు...’ అని ఇటీవల ఒక ప్రముఖ ప్రగతిశీలవాదిగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్‌ను ఉదయాన్నే డైనింగ్ టేబుల్ వద్ద ఆయన సతీమణి అడిగారట. ‘ఏముంది అక్కడ, మురికి నీళ్ళు, జనం చచ్చిపోతున్నారు.’ అని ఆయన జవాబిచ్చారు. ‘మీకేం తెలుసండీ.. అన్ని కోట్ల మంది ప్రజలు అక్కడకు వెళుతున్నారంటే వారు పిచ్చివాళ్లనా మీ అభిప్రాయం? దేశ సంప్రదాయాలను వ్యతిరేకించే వారి దుష్ప్రచారానికి మీరు లోనవుతున్నారు..’ అని భార్య విసురుగా వంటింట్లోకి వెళ్లిపోయిందట. ఈ విషయం ఆయనే చెప్పారు. ‘మా ఇంట్లో కూడా హిందూత్వవాదులు ప్రవేశించారు. నేనేమి చేయను?’ అని ఆ ఆచార్యులవారు వాపోయారు. కుంభమేళాకు వచ్చిన అనేకమంది ప్రముఖులు అక్కడ చేరిన కోట్లాది ప్రజల మధ్య తాము పొందిన అవస్థల గురించి చెప్పారు. ఘాట్ 14 కిమీ దూరంలో ఉన్నప్పటికీ కేంద్ర సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షురాలు దాదాపు 14 గంటలు కారులోనే గడపాల్సి వచ్చిందట. ఆఖరుకు అల్పాహారం చేసేందుకు కూడా గంటసేపు లైనులో నిలుచోవాల్సి వచ్చింది. డిల్లీలో తొక్కిసలాట జరిగిన తర్వాత ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌ను కొద్ది రోజుల పాటు మూసివేయాల్సి వచ్చింది.


భారతదేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి ఇది. కుంభమేళాపై వ్యతిరేక వ్యాఖ్యలు చేసినవారు హిందూ మతాన్ని ద్వేషిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రంగా విమర్శించారు. భారతదేశ మత వారసత్వ సంపదను తక్కువ అంచనా వేసేవారు బానిసమనస్తత్వంతో ఉన్నారని ఆయన అన్నారు. ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసిన క్షణాల్లోనే దేశంలో కోట్లాది వాట్సాప్ గ్రూపుల్లో ఆయన వీడియోలు ప్రత్యక్షమయ్యాయి. కొన్ని లెఫ్టిస్టు గ్రూపులను మినహాయిస్తే ఇవాళ ఏ వాట్సాప్ గ్రూప్ చూసినా సగానికిపైగా భారతదేశంలో హిందూమత గొప్పతనాన్ని వివరించే సందేశాలు కనపడుతున్నాయి. ప్రజల సామూహిక చేతనలో మతం ఇంత గణనీయమైన పాత్ర వహించడం గతంలో ఎప్పుడూ లేదు.

ఈ పరిణామాల్ని విస్మరించగలమా? అసలు ఎందుకు విస్మరించాలి? పోనీ ఈ పరిణామాల్ని ఏ రకంగా విశ్లేషించాలి? భారతీయ జనతా పార్టీ రాజకీయంగా విస్తరించే ముందు సామాజికంగా విస్తరిస్తోందన్న విషయంలో సందేహం లేదు. సమాజంలో ఉవ్వెత్తున ఒక ఊపును నిర్మించిన తర్వాత దాన్ని రాజకీయంగా సంఘటితం చేసుకునేందుకు బీజేపీకి అవకాశాలు లభిస్తున్నాయి. డిల్లీ ఎన్నికల్లో విజయం తర్వాత ఇక ‘బెంగాల్ కీ బారీ..’ అని ఆ పార్టీ నేతలు వెంటనే ప్రకటించారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరిగే బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, కేరళ, తమిళనాడులలో తమ పార్టీని విస్తరించేందుకు బీజేపీ ఎప్పుడో సన్నాహాలు ప్రారంభించింది. అస్సాంలో బీజేపీకి ఇప్పటికే ప్రభుత్వం ఉన్నది. బెంగాల్‌లో 2021 ఎన్నికల్లో బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా మారింది. బీజేపీకి, తృణమూల్‌కు కేవలం 3 శాతం ఓట్ల తేడా మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో డిల్లీ ఫలితాలు బెంగాల్‌లో పునరావృతం అయినా ఆశ్చర్యం లేదు. బిహార్‌లో ఈ ఏడాది ఆఖరులో తనంతట తాను మెజారిటీ సీట్లు సాధించేందుకు బీజేపీ తప్పనిసరిగా ప్రయత్నిస్తుంది. హరియాణా, మహారాష్ట్ర, డిల్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాల ఊపు రాబోయే ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీ కొనసాగించేందుకు శాయశక్తులా కృషి చేస్తుందనడంలో సందేహం లేదు.

రాజకీయంగా బీజేపీని ఎదుర్కోవడమే వివిధ రాజకీయ పక్షాల లక్ష్యం. అందుకు అనేక రాజకీయ వ్యూహాలు పన్నేందుకు అవి సిద్ధంగానే ఉన్నాయి. కాని బీజేపీ, దానికి మద్దతునిచ్చే వందలాది సంస్థలు సమాజంలో నిర్మిస్తున్న మతపరమైన భావోద్వేగాలను ఎదుర్కోవడం అంత సులభం కాదు. బీజేపీని సకల విపక్షాల నేతలతో పాటు వామపక్ష మేధావులూ రకరకాలుగా విమర్శిస్తూనే ఉన్నారు. కార్పొరేట్ల అనుకూల పార్టీ అని, రాజ్యాంగ సంస్థల్ని ధ్వంసం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని, నిరుద్యోగాన్ని, పెరుగుతున్న ధరలను అరికట్టలేకపోతోందని ఎన్నో విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి. రోజుకు వందలాది సెమినార్లు, సభలు జరుగుతూనే ఉన్నాయి. కాని ఈ సభల్లో పాల్గొనే వారెవరూ విస్తరిస్తోన్న బీజేపీ ప్రభావాన్ని అరికట్టలేకపోతున్నారు. బీజేపీని అత్యధికంగా విమర్శించిన రాష్ట్రాల్లోనే ఆ పార్టీ ఓట్ల శాతాన్ని పెంచుకుంటోంది. అందుకు కారణం బీజేపీ, దాని అనుబంధ సంస్థలు, అభిమాన సంస్థల ప్రచారం ముందు బీజేపీ వ్యతిరేకులు చేస్తున్న ప్రచారం వెలవెలబోవడమే.

సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో ఓడిపోయిన తర్వాత భారతదేశంలో ఆ పార్టీ భవిష్యత్ అగమ్యగోచర పరిస్థితిలో పడిందని అనేకమంది మేధావులు అంచనా వేశారు. ప్రజల నుంచి ఆ పార్టీ దూరమైందని, తన రాజకీయ అజెండాపై ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆ పార్టీ సానుభూతిపరులైనవారే విశ్లేషించారు. విచిత్రమేమంటే బెంగాల్‌లో గత 14 ఏళ్లలో సీపీఎం తన పునాదిని రోజురోజుకూ కోల్పోవడమే కాక బీజేపీ విస్తరణను అడ్డుకోలేకపోయింది. ఇప్పుడు వచ్చే ఏడాది కేరళ అసెంబ్లీ ఎన్నికలలో మూడోసారి ఆ పార్టీ అధికారంలోకి రాలేకపోతే దేశవ్యాప్తంగా అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. అస్తిత్వ సంక్షోభం అనేది సీపీఎంకే కాదు, రకరకాల రూపాల్లో ఉన్న వామపక్ష శక్తులన్నిటికీ ఇప్పుడు ఏర్పడుతున్న సవాలు. తాము ఎంత ప్రచారం చేసినా, ఎన్ని సభలు నిర్వహించినా, ఎన్ని పుస్తకాలు రాసినా ప్రజలు తమకు అనుకూలంగా ఎందుకు స్పందించడం లేదు అని ఈ శక్తులు ఒక్కసారి స్వేచ్ఛగా చర్చించుకున్నా వారికి జవాబు వచ్చేదేమో. కాని వీరెవరూ తమది తప్పుడు పంథా అని, తాము క్షీణిస్తున్నామని, తమ మూలంగా యువత త్యాగాలు వృథా అవుతున్నాయని ఆత్మవిమర్శ చేసుకునేందుకు బహిరంగంగా సిద్ధం కావడం లేదు. పైగా బీజేపీ, మోదీపై కురిపిస్తున్న తిట్ల వర్షం వారికే నష్టం చేకూరుస్తోంది.

తమ అస్తిత్వ సంక్షోభం వల్ల ఏర్పడిన అయోమయం వారి సిద్ధాంతీకరణల్లో కూడా కనిపిస్తోంది. బీజేపీని, మోదీని ఇంతకాలం వామపక్షాలు ఫాసిస్టు శక్తులుగా అభివర్ణించాయి. తాజాగా సీపీఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ బీజేపీని తాను ఫాసిస్టు అని కానీ, నయా ఫాసిస్టు అని కానీ అనడం లేదని, అయితే నయా ఫాసిస్టు మార్గంలో బీజేపీ పయనిస్తోందని విశ్లేషించారు. అదే పార్టీ ముసాయిదా తీర్మానంలో ప్రతిఫలించింది. విచిత్రమేమంటే మూడేళ్ల క్రితం 2022లో ఆమోదించిన రాజకీయ తీర్మానంలో కూడా బీజేపీ స్పష్టంగా ఫాసిస్టు



ఒక సైద్ధాంతిక పార్టీగా అస్తిత్వాన్ని, కాంగ్రెస్ 1970ల తరువాత కోల్పోవడం ప్రారంభమయింది. బీజేపీకి సైద్ధాంతిక ప్రత్యామ్నాయంగా ఎందుకు మారాలో కాంగ్రెస్ స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోనంత వరకూ ఆ పార్టీ అడుగులు తడబడుతూనే ఉంటాయి. సిద్ధాంతం ప్రజలలో పట్టుబిగించనంతవరకూ అది భౌతికశక్తిగా మారదని, భౌతికశక్తిని భౌతిక శక్తే తొలగించగలదని కారల్ మార్క్స్ ‘క్రిటిక్ ఆఫ్ హెగెల్ ఫిలాసఫీ’లో చెప్పిన విషయం బీజేపీకి అర్థం అయినంత బాగా ఈ దేశంలో మరే పార్టీకి అర్థం కావడం లేదు.

సంస్థ అని సీపీఎం విమర్శించింది. ఇటీవల మరణించిన పార్టీ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి కూడా తన ‘ఐడియా ఆఫ్ ఇండియా’ అన్న వ్యాసంలో భారతదేశంలో ఫాసిస్టు శక్తుల మతతత్వ అజెండా గురించి విశ్లేషించారు. సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ఇప్పటికే బీజేపీని ఫాసిస్టు శక్తిగా అభివర్ణించాయి. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ మోదీని ఫాసిస్టు అని అనేకసార్లు ప్రకటించారు.

మోదీ ఫాసిస్టా, నయా ఫాసిస్టా లేక ఫాసిస్టు అయ్యే క్రమంలో ఉన్నారా, హిట్లర్, ముస్సోలినీ కంటే మోదీ భిన్నమైన వ్యక్తా అన్న చర్చ జరగడమే ఒక అసంబద్ధంగా అనిపిస్తోంది. మోదీని, బీజేపీని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ సామాజిక సిద్ధాంతాలు లేనప్పుడు అవతలి సంస్థలను, వ్యక్తులను ఏదో ఒక పేరుతో విమర్శించడం, లేదా సిద్ధాంతీకరణ చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? సీతారాం ఏచూరి దేశంలో దేశభక్తి గల అన్ని ప్రజాస్వామిక శక్తులు ఐక్యమయి బీజేపీని అధికారం నుంచి తొలగించడం గురించి రాశారు. కాని కనీసం వామపక్ష శక్తులైనా సిద్ధాంతాల అయోమయం లేకుండా కలిసి పనిచేసే అవకాశాలున్నాయా? ఇక మిగతా శక్తులు కలిసి పనిచేసేందుకు మోదీ వ్యతిరేక ఎజెండా తప్ప వాటిని ఐక్యంగా బంధించే సామాజిక సిద్ధాంతం అంటూ ఏమైనా ఉన్నదా?

ఇవాళ దేశంలో బీజేపీ ఒక్కటే స్పష్టమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ సైద్ధాంతిక లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రతిపక్షాలను హిందూమత విద్వేషకులన్నా, అర్బన్ నక్సల్స్ అన్నా మోదీకి ఒక సైద్ధాంతిక స్పష్టత ఉన్నది. అదే సమయంలో సంఘ్ పరివార్ శక్తులు ఒక స్పష్టమైన అవగాహనతో పనిచేస్తున్నాయి. ప్రజల్లోకి భావోద్వేగాలు చొచ్చుకుపోతున్నాయి. కుంభమేళా వంటి కార్యక్రమాలు ప్రజలను స్వచ్ఛందంగా హిందూత్వ భావజాలం దిశగా ఆకర్షితులను చేస్తున్నాయి. దేశ భక్తినీ, భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక చరిత్ర పట్ల గౌరవాన్ని పెంపొందించే దిశగా కళారూపాలు తయారవుతున్నాయి. ఆ రకమైన సినిమాలు హిట్ అవుతున్నాయి. వాటిలో సహేతుకతను ప్రశ్నించినవారే ఆత్మరక్షణలో పడాల్సి వస్తోంది. రాజకీయ ప్రయోజనాలకోసమైనా హిందూత్వను ఆమోదించినట్లు ప్రదర్శించేవారు అంతటా కనపడుతున్నారు. ఇది గత పదేళ్లపై నుంచి మోదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందువల్ల సాధించిన విజయం అని చెప్పక తప్పదు.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న చరిత్ర గల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్నేళ్ల వరకూ ఆ స్ఫూర్తిని కొనసాగించింది. కాని ఆ ప్రభావాన్ని ఎక్కువ కాలం కొనసాగించడంలో విఫలమైంది. వెనుకబడిన వర్గాలకోసం, దళితుల కోసం ఏర్పడ్డాయనుకున్న సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు తమ లక్ష్యాలకు దూరమయ్యాయి. ఒక సైద్ధాంతిక పార్టీగా అస్తిత్వాన్ని, తన సంప్రదాయ ఓటు బ్యాంక్‌ను కాంగ్రెస్ 1970ల తరువాత కోల్పోవడం ప్రారంభమయింది. ఇవాళ ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ కులగణన, రాజ్యాంగం, బడుగు బలహీన వర్గాల గురించి మాట్లాడుతున్నారు. ఒక సైద్ధాంతిక పార్టీగా కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని కల్పించే కృషి ఉధృతంగా జరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తాము బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎందుకు మారాలో కాంగ్రెస్ స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోనంత వరకూ ఆ పార్టీ తడబడుతూ అడుగులు వేస్తూనే ఉంటుంది. సిద్ధాంతం ప్రజలలో పట్టు బిగించనంతవరకూ అది భౌతిక శక్తిగా మారదని, భౌతికశక్తిని భౌతికశక్తే తొలగించగలదని కారల్ మార్క్స్ ‘క్రిటిక్ ఆఫ్ హెగెల్ ఫిలాసఫీ’లో చెప్పిన విషయం బీజేపీకి అర్థం అయినంత బాగా ఈ దేశంలో మరే పార్టీకి అర్థం కావడం లేదు.

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)

ప్రపంచ చరిత్ర.. మరొక్కసారి!

ప్రజాప్రతినిధులైన వాళ్ళు పాలనలోని నియమ నిబంధనలు తెలుసుకోకుండా రాష్ట్ర, దేశ, ప్రపంచ స్థితిగతులు, మానవ అభివృద్ధి పరిణామం చరిత్ర గురించి అవగాహన లేకుండా ఉండటం సిగ్గుపడే అంశమని నా అభిప్రాయం. నా వరకు నేను కొద్దో గొప్పో చదువుకుని మంచి కుటుంబ నేపథ్యంలో వ్యక్తిగా ఉండి, చెడు అనిపించుకోకపోయినా... మరొక విషయంలో మాత్రం నేను లోపభూయిష్టుడుగా భావించేవాడిని. అది ఏమంటే... చరిత్ర, పాలనలకు సంబంధించిన విషయం గురించి అవగాహన లేకపోవడం... ఇవి తెలియని వ్యక్తి ప్రజాప్రతినిధిగా ఉండటానికి ఎంత మాత్రం అర్హుడు కాడనేది నా అభిప్రాయం. ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుని నాలాగా ఎంతోమంది ప్రజాప్రతినిధులు చరిత్ర చదవకుండా, చరిత్ర తెలియకుండా, రాజకీయాల్లో ఉన్న విషయాన్ని గమనించి ముందు నన్ను నేను ప్రక్షాళన చేసుకుని జ్ఞానవంతుడు అవ్వటం నా బాధ్యత అని భావించాను. అందుచేత 1983లో నేను మొట్టమొదటిసారిగా శాసనసభ్యుడిని అయినప్పటి నుంచి పుస్తకాలు ముఖ్యంగా చరిత్ర, దేశాల పాలనలు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రముఖుల జీవిత చరిత్రలు సేకరించేవాడిని. కానీ నాకున్న సమయాభావం వల్ల వాటిని క్షుణ్ణంగా చదివే అవకాశం లేకపోయింది. వీలైనప్పుడల్లా ఆ పుస్తకాలు చదువుతూ కొంతమేర అవగాహన ఏర్పరచుకొన్నాను. నేను తెలుసుకొన్న విషయాలు నాలాంటి వారికి, ఇతరులకు అందుబాటులోకి తెస్తే మంచిది అన్న అభిప్రాయం కలిగి, 2009 నుంచి రచనలు ప్రారంభించాను.

నాలాగా ఎంతోమంది ప్రజాప్రతినిధులు చరిత్ర చదవకుండా రాజకీయాల్లో ఉన్న విషయాన్ని గమనించి, ముందు నన్ను నేను ప్రక్షాళన చేసుకుని జ్ఞానవంతుడు కావటం నా బాధ్యత అని భావించాను. నేను తెలుసుకొన్న విషయాలు నాలాంటి వారికి, ఇతరులకు అందుబాటులోకి తెస్తే మంచిది అన్న అభిప్రాయం కలిగి, 2009 నుంచి రచనలు ప్రారంభించాను.



నేను స్వయంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత జరిగిన పరిణామాలను ‘ఒక చరిత్ర – కొన్ని నిజాలు’ అనే నామకరణంతో నా మొదటి రచన చేశాను. దీనిని పాఠకులు బాగా ఆదరించారు.

తరువాత 2014లో ఆంధ్ర రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలుగా ఏర్పడిన సందర్భంలో అసలు తెలుగువారు ఎప్పటివారు, పాలకులు ఎవరు అని, భిన్న రాష్ట్రాలుగా, భిన్న ప్రాంతాలుగా పరిపాలన సాగిన విషయాన్ని ప్రజాప్రతినిధులకు, పాఠకులకు వీలైనంత క్లుప్తంగా తెలియజేయాలని ఈ రచన కొనసాగించాను ‘తెలుగువారి చరిత్ర.. వేర్పాటువాదం’ అనే పేరుతో. ఇది కూడా పాఠకుల మన్ననలు పొందింది.

ఇక మూడవది ‘ప్రపంచతత్త్వం–నాయకత్వం’ చరిత్రలో... క్రీ.పూ. 500 సంవత్సరాల నుంచి క్రీ.శ. 2000 సంవత్సరాల వరకు కాలంలో తత్త్వవేత్తలు, ప్రజానాయకులు అనేక దేశాల ఆవిర్భావాలకు, ఆయా దేశాల ప్రగతికి కారణభూతులయ్యారు. వారిలో 50 మందిని ఎంచుకుని క్లుప్తంగా వారి చరిత్ర గురించి పుస్తక రచన కొనసాగించగా, పాఠకుల ఆదరణకు నోచుకుంది.

తరువాత నాలుగవ రచనగా ‘ప్రపంచ దేశాలు పాలనా వ్యవస్థలు’ అనే పేరుతో ప్రపంచంలో ఉన్న అనేక రకాలైన పరిపాలన వ్యవస్థలను ఒకేచోటుకు చేర్చి క్లుప్తంగా రచించగా, ప్రజాపాలనలో ఉన్నవారికి ఎంతో ఉపయోగపడింది.

ఇకపోతే ప్రస్తుత రచన ‘ప్రపంచ చరిత్ర’ ఆది నుంచి నేటి వరకు వచ్చేటప్పటికి...

ఈ గ్రంథంలో చెప్పిన విషయాలు ఇంతకు ముందు అనేక మంది పెద్దలు గ్రంథస్థం చేసినవే. నేను కొత్తగా ఏమీ సృష్టించలేదు. కొత్త కోణం కూడా కాదు. కాకపోతే అనేక రచనలుగా ఉన్న ప్రపంచ చరిత్రలోని అనేక భాగాలైన... భూమి, నీరు ఎలా ఏర్పడ్డాయి దగ్గర నుంచి, ఖగోళం, రాతియుగం, జీవి పుట్టుక, ఆదిమానవుడు, ప్రాచీన నాగరికతలు, రోమ్, గ్రీక్ సంస్కృతులు, వివిధ మతాల ఆవిర్భావం, మతకలహాలు, రాజ్యాలు ఏర్పడటం, అవి పతనమవటం, రాజ్యపాలనలు, సాంస్కృతిక పునరుజ్జీవనం, పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచ్, రష్యా ఇతర విప్లవాలు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, వలస రాజ్యాలు, ప్రపంచ యుద్ధాలు, రష్యా, అమెరికా వైరాలు, వివిధ దేశాల స్వాతంత్ర్య పోరాటాలు, సాంస్కృతిక– సైన్సు ఆవిష్కరణలు, భారత్ చైనా లాంటి దేశాల చరిత్ర, ఇంకా అనేకం కలిపి ఇందులో క్లుప్తంగా క్రోడీకరించాను. చివరిగా కరోనా గురించి, భవిష్యత్ దర్శినిని కూడా చేర్చి ముగించాను.

వేటికి వాటిగా ప్రత్యేక రచనలుగా ఉన్న విభిన్న అంశాలను ఒకచోట చేర్చడం ఈ రచనలోని ప్రధాన అంశం. దీనితోబాటు గత రెండు వందల సంవత్సరాల్లో జరిగిన సాంస్కృతిక విజ్ఞాన ఆవిష్కరణలయిన అచ్చు యంత్రం, ఆవిరియంత్రం, కరెంటు, రేడియో, మోటార్ కారు, రైలు, విమానం, టెలిఫోన్, కంప్యూటర్, టీవీ, సెల్ ఫోన్ వంటి వాటి వివరాలు చెప్పుకున్నాం. ఎక్కడో దేశాంతరంలో ఉన్న వారితో ఫోన్‌లో చూస్తూ మాట్లాడటం, ఇంటి నుంచే పాఠాలు, ఉద్యోగం, వ్యాపారం చేయటం ప్రపంచ సమాచారాన్ని మొత్తం గూగుల్ ద్వారా చిటికెలో అందుబాటులోకి తెచ్చుకోవడం, వైద్య రంగంలో అనేక ఆవిష్కరణలు, వ్యాధి నివారణలో అత్యాధునిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చాయి. వందలకొద్దీ శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపి కొత్త చరిత్ర సృష్టించబడింది. ఇవన్నీ మన కళ్లముందు మనం జీవించిన కాలంలో ఆవిష్కరించబడ్డ అద్భుతాలయితే, వీటిలో కొన్నింటిని దార్శనికులు కొంతమంది ముందే ఊహించారు. హెచ్.జి వెల్స్ అనే మేధావి 19వ శతాబ్దంలో ఊహించి తన రచనలలో కొన్ని ఊహతో జరిగే పరిణామాలను పొందుపరచగా, 20వ శతాబ్దంలో చాలావరకు అవి నిజమయ్యాయి.

▪ **డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు**

డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర (ఆదినుండి నేటివరకు– ఆ తరువాత) పుస్తకం లోని ‘నామాట’ నుంచి కొన్ని భాగాలు ఇవి. గ్రంథావిష్కరణ కార్యక్రమం రేపు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతుంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథి. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు, ఇంగ్లిష్ అనువాదం ‘ద గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ’ని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆవిష్కరిస్తారు. పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఆందోళన అర్థవంతమే!

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవచ్చుననే భయం అర్థరహితం కాదు, సహేతుకమే. నష్టపోతారని ఎవరూ భయపడనక్కర లేదంటూ, పార్లమెంటులో ఈ రాష్ట్రాలు ఏ మాత్రం సీట్లు కోల్పోవడం జరగదని ఈ మధ్య తమిళనాడులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ పద్ధతిలో, ఇలా చేయొచ్చు అని చూచాయగానైనా ఆయన, కేంద్ర ప్రభుత్వం వివరిస్తే తప్ప, ఈ ఆందోళన సమసిపోదు. దానికి ముఖ్య కారణం ఇప్పుడు అమల్లో ఉన్న ఏ విధానం తీసుకున్నా, ఫలితాలు వ్యతిరేకంగానే వస్తాయి.

వాస్తవానికి పదేళ్లకోసారి జరిగే ప్రతీ జనాభా లెక్కల తర్వాత పార్లమెంటు స్థానాల డీలిమిటేషన్ ప్రక్రియ జరగాలి. కానీ మూడుసార్లు మాత్రమే జరిగాయి. కారణం జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచినప్పుడు, జనాభా నియంత్రణ చక్కగా అమలుపరిచిన రాష్ట్రాలు నష్టపోతున్నాయి. అలా జరగరాదని 1971 జనాభా లెక్కల ప్రకారమే సంఖ్య నిర్ధారించి, 2026 వరకూ పెంచకుండా పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ద్వారా ఫ్రీజ్ చేశారు. 2026 తర్వాత వచ్చే జనాభా లెక్కల ప్రాతిపదికన కొత్తగా డీలిమిటేషన్ జరగాల్సి ఉంది. అది 2031 సెన్సస్‌కి వర్తించాల్సింది. కానీ 2021లో కరోనా కారణంగా వాయిదా పడిన లెక్కలు 2026కి అందుబాటులోకి వస్తాయి కనుక, అవే తాజా ప్రాతిపదిక అవుతాయి. పార్లమెంటు ద్వారా ఏర్పడబోయే డీలిమిటేషన్ కమిషన్ వాటినే గమనంలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఇక్కడ సమస్య ఏమిటంటే ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా విపరీతంగా పెరిగి, దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ పెరిగింది. పార్లమెంటు సీట్లను అలాగే 543గానే ఉంచి, నియోజకవర్గాలను జనాభా నిష్పత్తి ప్రకారం మారిస్తే తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కేరళ చెరో ఎనిమిదేసి సీట్ల చొప్పున కోల్పోతాయి. అలా కాకుండా ఇంత జనాభాకు ఒక నియోజకవర్గం అంటూ మొత్తం సీట్లను 840కి పైగా పెంచాల్సి వస్తే, దక్షిణాది రాష్ట్రాలకు పది చొప్పున పెరిగితే, ఉత్తరప్రదేశ్‌కు ఏకంగా 65 పెరుగుతాయి. ఏ రకంగా చూసినా నష్టమే కనబడుతున్నది. కాబట్టి కేంద్రం, పార్లమెంటు ఈ అసమానతలు లేకుండా మార్గాంతరం చూడాలి. వీలైతే సీట్ల పెంపుదలపై ఫ్రీజింగ్ కొనసాగించి, రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచుకోవాలి. అప్పుడు కూడా రాజ్యసభకి రాష్ట్రాల ప్రాతినిధ్యంలో అసమానతలు ఏర్పడకుండా చూడాలి. సామాజిక న్యాయం, ప్రాంతాల ప్రాతినిధ్యం సరిగ్గా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యానికి అందం, బలం.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ





ఓపీలో కనీస సౌకర్యాలు లేని దృశ్యం

- పాలనను గాలికొదిలేసిన ఉన్నతాధికారులు
- సమయం పాటించని పెద్ద సార్
- అదే బాటలోనే వైద్యులు.. సిబ్బందిపైనే భారం
- ఏళ్ల తరబడి ఆర్ఎంవోల పోస్టులు ఖాళీ
- పని చేయని ఏసీలు.. ఉక్కపోతలో రోగులు
- దారుణంగా అంతర్గత రోడ్లు.. ఇబ్బందుల్లో జనం
- ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని వేడుకోలు

పెద్దాస్పత్రిని పట్టించుకోండయ్యా..

అధ్వానంగా ఎంజీఎం నిర్వహణ

వరంగల్ మెడికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి పరిస్థితి రాజులేని రాజ్యంలా తయారైంది. పాలనాధికారులు చాలినంత మంది లేక.. ఉన్నవారు పర్యవేక్షణ చేయక ఆస్పత్రి నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా మారింది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సకాలంలో, సరైన వైద్యం అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా ఆస్పత్రి పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. ఆస్పత్రి పనితీరు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. రోగుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమైనప్పుడో, ఫిర్యాదులు దాఖలైనప్పుడో మాత్రమే స్పందిస్తున్న అధికారులు.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. ఉత్తర తెలంగాణలో హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్దదైన ఈ ధర్మాస్పత్రి నిర్వహణ రోజు రోజుకూ దిగజారి పోతున్నది.

ఆర్ఎంవోలు ఏరీ?

ఎంజీఎం ఆస్పత్రిలో ఆర్ఎంవోల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఆస్పత్రి నిర్వహణలో ఆర్ఎంవోలే మూల స్థంభాలు. వారే చాలినంతమంది లేకపోవడంతో నిర్వహణ కుంటుపడుతోంది. ఆర్ఎంవో-1 (సివిల్ సర్జన్) రెండేళ్లుగా లేరు. ఆర్ఎంవో-2 (సివిల్ సర్జన్) ఫారన్ సర్వీస్‌పై వెళ్లడంతో ప్రస్తుతం ఈ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలను చూసే దిక్కులేకుండా పోయింది. ఆర్ఎంవో-3 ఉన్నా లేనట్టే. ఆయన సంతకాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలున్నాయి.

సూపరింటెండెంట్ తీరే వేరయా..

ఎంజీఎం ఆస్పత్రి పరిపాలనకు సూపరింటెండెంట్ కీలకం. ఎవరున్నా లేకపోయినా అంతా తానై ఆస్పత్రిని సమర్థవంతంగా నిర్వహించాలి. రోగుల యోగక్షేమాలను నిరంతరం కనిపెట్టుకుంటూ ఉండాలి. డాక్టర్లు సకాలంలో విధులకు హాజరయ్యేట్టు చూడాలి. కానీ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ తీరు ఇందుకు భిన్నంగా ఉన్నట్టు పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ సూపరింటెండెంట్ అయినా వాస్తవంగా రోగుల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఆస్పత్రిలో ఉండాలి. వారికి సరైన వైద్యం అందేలా చూడాలి. కానీ ప్రస్తుత సూపరింటెండెండ్ ప్రతీ రోజు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి ఒక గంటపాటు ఉండి వెళ్లిపోతారని, మళ్లీ సాయంత్రం 4 గంటలకు వచ్చి రాత్రి 9 గంటల వరకు ఉంటాడనే విమర్శలు ఉన్నాయి. కొత్త సూపరింటెండెంట్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆస్పత్రిలోని ఆ యా విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం జరగలేదు. హెచ్‌వోడీలతో సమావేశం నిర్వహించినప్పుడు ఆస్పత్రి సమస్యలపై ఒక అవగాహన, స్పష్టత వస్తుంది.

చుట్టపుచూపుగా డాక్టర్లు

ఎంజీఎంకు డాక్టర్లు చుట్టచూపుగా వస్తున్నారు. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడో వెళతారో.. వారికే తెలియదు. అందరూ కట్టకట్టుకొని ఒకే వాహనంలో ఉదయం 11.30 గంటలకు వచ్చి ఓ గంట సేపు ఉండి ఆ వెంటనే హడావుడిగా వెళ్లిపోతున్నారు. డాక్టర్లలో చాలా మంది హైదరాబాద్ నుంచి వస్తున్నారు. లేదా తమ ప్రైవేటు ప్రాక్టీసు బాగా నడిచే చోటి నుంచి వస్తున్నారు. వాస్తవంగా డాక్టర్లు ఉదయం 8.30 గంటల కల్లా ఆస్పత్రికి వచ్చి మధ్యాహ్నం 1.30 గంటల కు తిరిగి వెళ్లాలి. రోగుల రద్దీ ఎక్కువగా ఉంటే వారందరికీ చికిత్స చేసి గానీ వెళ్లకూడదు. కానీ తమకు తోచినప్పుడు వచ్చి వెళుతున్నారు. దీంతో పని భారం అంతా హౌస్‌సర్జన్లు, పీజీ డాక్టర్లపై పడు తోంది. వారే రోగులకు అన్నిటికీ దిక్కవుతున్నారు. ఆస్పత్రి శానిటేషన్ టెండర్లను ఎప్పుడో పిలిచినా ఇప్పటి వరకు తెరువలేదు. దీంతో ఆస్పత్రిలో పారిశుధ్యం అటకెక్కింది. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండి పోయి కనిపిస్తోంది. పారిశుధ్యం క్షీణించి రోగులకు లేని రోగాలు వచ్చే ప్రమాదం ఏర్పడింది.

ఏసీలు బాగయ్యేదెప్పుడు?

ఎంజీఎం ఆస్పత్రిలో ఏసీలు పాడైనా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎండాకాలం ఉక్కపోతతో రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం ఉన్న ఫ్యాన్లలో సగం పని చేయడం లేదు. ఆస్పత్రిలో 323ఏసీలు ఉన్నాయి. వీటిలో 200ఏసీలు చాలా కాలంగా మూలపడ్డాయి. సకాలంలో మరమ్మ తులు చేయాల్సి ఉండగా, అధికారులు తాత్సారం చేస్తున్నారు. అత్యవసర చికిత్స వార్డుల్లో ఏసీలు పని చేయక రోగులు విలవిలలాడుతున్నారు.

చిన్న సర్జరీలే..

ఆస్పత్రిలో పెద్ద సర్జరీలు చేయడం ఎప్పుడో మానేశారు. సరైన సౌకర్యాలు లేకపోవడం, నిపుణులైన డాక్టర్లు అందుబాటులో ఉండకపోవడం తదితర కారణాల వల్ల చిన్నచిన్న ఆపరేషన్లకే డాక్టర్లు పరిమితమవుతున్నారు. మేజర్ ఆపరేషన్లు అవసరం పడిన రోగులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణ, వైద్యంపై దృష్టి సారించాలని రోగులు, బంధువులు కోరుతున్నారు.


ఆస్పత్రి ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

'మెడికల్ ఆఫీసర్స్'పై విచారణ

- గ్రూప్-1 అధికారి ప్రేమ్‌కుమార్‌కు బాధ్యతలు
- వరంగల్ డీఎంహెచ్‌వో ఆఫీసులో దంత వైద్యుల నుంచి వివరాల సేకరణ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు



వరంగల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న దంత వైద్యులపై విచారణకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 21న 'వరంగల్ డీఎంహెచ్‌వోలో ఇష్టారాజ్యం.. నిబంధనలకు విరుద్ధంగా బీడీఎస్ వైద్యులకు మెడికల్ ఆఫీసర్లుగా పోస్టింగులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన క్రిస్టినా.. గత నెల 26న గ్రూపు-1అధికారి ప్రేమ్‌కుమార్‌కు విచారణ బాధ్యతలు అప్పగించారు. దీంతో మంగళవారం హైదరాబాద్ హెల్త్ కమిషనర్ కార్యాలయం నుంచి వరంగల్ డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకున్న ప్రేమ్ కుమార్ వరంగల్ జిల్లాలో మెడికల్ ఆఫీసర్లుగా పని చేస్తున్న దంత వైద్యులను పిలిచి విచారణ చేపట్టారు. ఎప్పుడు విధుల్లో చేరారు? చేరినప్పుడు ఔట్‌సోర్సింగ్

మిగతా 8వ పేజీలో...


ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు

భూమికి బదులు భూమే కావాలి..

- మంత్రి సురేఖ ఇచ్చిన మాట నిలుపుకోవాలి
- మామునూరులో భూ సర్వేను అడ్డుకున్న రైతులు
- పరిస్థితి ఉద్రిక్తం.. వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు

6

అర్హులైన లబ్ధిదారులనే గుర్తించాలి



- అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు
- ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన లబ్ధిదారులనే గుర్తించాలని ఇందిరమ్మ కమిటీ సభ్యులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన కమిటీ సభ్యులతో సమీక్ష జరిపారు. పశ్చిమ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ క్రమంలో అర్హులనే గుర్తించి న్యాయం చేయాలన్నారు. ఏ విధమైన అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్లలో పర్యటించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరంగా తెలియచేయాలని సూచించారు. పార్టీశ్రేణులు ప్రజలకు సేవ చేయడంలో ఎల్లవేళలా ఉత్సాహం చూపాలన్నారు. కష్టించి పనిచేసిన వారికి పార్టీ గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, మామిండ్ల రాజు, విజయశ్రీ రజాలీ, మానస రాంప్రసాద్, నెక్కొండ కవిత కిషన్‌తో పాటు ఆర్‌టీఏ సభ్యుడు పల్లకొండ సతీశ్, నాయిని లక్ష్మారెడ్డి, అంబేడ్కర్ రాజు, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థీ.. విజయీభవ

నేడు ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వరంగల్ జిల్లాలో 12,321, హనుమకొండలో 39,980 మంది విద్యార్థుల హాజరు


హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్ జిల్లా నుంచి 12,321 మంది, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 39,980 మంది ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ నెల 5న ప్రారంభమవుతున్న పరీక్షలు 25వ తేదీతో ముగియనున్నాయి. వరంగల్‌లో 68, హనుమకొండలో 124 జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఇందు కోసం వరంగల్ జిల్లాలో 26, హనుమకొండ జిల్లాలో 55 పరీక్ష కేంద్రాలను అన్ని వసతులతో ఏర్పాటు చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా, ఈ ఏడాది ఒక్క నిమిషం ఆలస్యాన్ని ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. పరీక్ష సమయానికి 5నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించనున్నట్లు బోర్డు కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరీక్షకు హాజరయ్యేది వీరే..

వరంగల్ జిల్లాలో 68 జూనియర్ కళాశాలల నుంచి 12,321 మంది పరీక్షకు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 4,967 మంది, వొకేషనల్ విభాగంలో 848 మంది కలిపి ఫస్టియర్‌లో మొత్తం 5,815 మంది పరీక్షలు రాస్తున్నారు. ఇక ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 5,739 మంది, వొకేషనల్ విభాగంలో 767 మందితో కలిపి మొత్తం 6,506 మంది పరీక్షకు హాజరవుతున్నారు. పరీక్షల కోసం 26 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 26 మంది సీఎస్‌లు, 26 మంది డీవోలు, 8 మంది అడిషనల్ సీఎస్‌లను నియమించారు. ఇక హనుమకొండ జిల్లాలో 124 జూనియర్ కళాశాలల నుంచి 39,980 మంది పరీక్షకు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 18,397 మంది, వొకేషనల్ విభాగంలో 1,146 మంది కలిపి ఫస్టియర్‌లో మొత్తం 19,543 మంది పరీక్షలు రాస్తున్నారు. ఇక ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 19,480 మంది, వొకేషనల్ విభాగంలో 957 మందితో కలిపి మొత్తం 20,437 మంది పరీక్షకు హాజరవుతుండగా 63మంది గత సంవత్సరం తప్పిన విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల కోసం 55 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 55 మంది సీఎస్‌లు, 55 మంది డీవోలు, 42 మంది అడిషనల్ సీఎస్‌లను నియమించారు. కాగా రెండు జిల్లాల్లో పరీక్షల నిరంతర నిరంతర తనిఖీల కోసం ఒక్కో జిల్లాలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు 4 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు.

ఇంటర్ పరీక్షకేంద్రాల వద్ద 163 సెక్షన్

వరంగల్ క్రైం: ఇంటర్ పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో 163 సెక్షన్ అమలులో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. గుంపులుగా ఉండటం, ర్యాలీలు, సభలు, ధర్నాలు, సమావేశాలు ఏర్పాటు, ఊరేగింపులు చేయడం నిషేధమన్నారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, ఎవరైనా ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. ఈ ఆంక్షలు మార్చి 25 వరకు ఉంటాయన్నారు.

'మిషన్ వాత్సల్య'కు అర్హులను ఎంపిక చేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేయాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మిషన్ వాత్సల్య పతకం అర్హుల ఎంపికపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మిషన్ వాత్సల్య పథకానికి ఎంతమంది ఎంపికయ్యారని, జిల్లాలో ఎన్ని దరఖాస్తులు ఇప్పటి వరకు వచ్చాయనే వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపిక విధానాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి ఈ పథకానికి ఎంపిక చేయాలన్నారు. ఈ పథకానికి తల్లి తండ్రులు లేని బాలబాలికలకు మొదటి ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బాలరక్షా భవన్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ అవంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, సీడబ్ల్యూసీ సభ్యుడు సుధాకర్, ఎఫ్ఎంఎంఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.మౌనిక, శిశుగృహ ఇన్‌చార్జ్ మేనేజర్ ఎ.మాధవి, సోషల్ వర్కర్లు ఎం.శ్రీనివాసులు, జి.సునీత, ఎస్. చైతన్య, ఓఆర్‌డబ్ల్యూ పి. విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మిషన్ వాత్సల్య పథకంపై అధికారుతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కాజీపేట మీదుగా హోలీ స్పెషల్ రైలు

కాజీపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగ రద్దీని పురస్కరించుకుని కాజీపేట మీదుగా (07707, 08) చర్లపల్లి - హజ్రత్ నిజాముద్దీన్‌ల మధ్య హోలీ స్పెషల్ రైలు నడిపిచనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ఈ నెల 6, 12, 16 తేదీలలో రాత్రి 8. 45 నిమిషాలకు చర్లపల్లిలో బయలు దేరి 10. 45 నిమిషాలకు కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. 7వ తేదీని రాత్రి 1 గంటకు హజ్రత్ నిజాముద్దీన్ చేరుకుంటుంది. ఇదే రైలు 8, 14, 18 తేదీలలో హజ్రత్ నిజాముద్దీన్ - చర్లపల్లి మధ్య నడుస్తుంది. ఈ రైలు నిర్ణయించిన తేదీలలో రాత్రి 3.15 నిమిషాలకు బయలుదేరి తరువాత రోజు కాజీపేటకు ఉదయం 7. 30 నిమిషాలకు చేరుకుంటుంది. ఈ రైలు కాజీపేట, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్, చంద్రాపూర్, నాగ్‌పూర్, రాణి, కమలపట్టి, బీన, జాన్సీ, ఆగ్రా, పల్వన్, స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అత్యాచార ఘటనలో నిందితుడి అరెస్టు

గీసుగొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఓ నాలుగేళ్ల పాపపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటనలో నేపాల్ దేశానికి చెందిన రాజుదమై అనే నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ మహేందర్ తెలిపారు. కాగా, కోర్టు నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఆయన చెప్పారు.

పొలం బాట ద్వారా
విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నాం..

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పొలం బాట ద్వారా విద్యుత్ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నామని హనుమకొండ, వరంగల్ ఎస్‌ఈలు మధుసూదన్, గౌతంరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. హనుమకొండ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 277 పొలం బాట కార్యక్రమాలు చేపట్టగా, 238 వరిగిన స్తంభాలు, 703 లూజ్ లైన్‌లు, 1,179 విడిల్ పోల్స్ ఏర్పాటు చేశామన్నారు. 128 ట్రాన్స్‌పార్మర్ల గద్దెలు పెంచామని, 144 డబుల్ ఫీడింగ్, లోలెవల్ లైన్ క్రాసింగ్స్ మార్చామని ఎస్‌ఈ మధుసూదన్ తెలిపారు. వరంగల్ సర్కిల్ పరిధిలో 40 పొలంబాట కార్యక్రమాలు చేపట్టగా 236 వంగిన స్తంభాలు, 739 లూజ్‌లైన్‌లు, 659 విడిల్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. 76 డబుల్ ఫీడింగ్, 134లో లెవల్ లైన్ క్రాసింగ్స్ మార్చామని ఎస్‌ఈ గౌత్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా 1912 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఔషధాల వినియోగం పారదర్శకంగా ఉండాలి
ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్

వరంగల్ మెడికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔషధాల వినియోగం పారదర్శకంగా ఉండాలని ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ బి.ప్రేమ్‌కుమార్ అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని పలు ఆస్పత్రులను మంగళవారం ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్, టాస్క్‌ఫోర్స్ బృందం ప్రధాన అధికారి బి.ప్రేమ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రి నుంచి పీహెచ్‌సీ స్థాయి ఆస్పత్రుల వరకు అవసరం మేరకు వార్షిక ఇండెంట్లను పెట్టుకోవాలన్నారు. సాంకేతికంగా ఇండెంట్లు ఉండాలని, టీబీ ఆస్పత్రిలో తనిఖీల సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌లు, ఫార్మసిస్టులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంజీఎం ఆస్పత్రి, టీబీ ఆస్పత్రి, పోచమ్మ కుంట అర్బన్ హెల్త్ సెంటర్లను టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి వైద్యాధికారులకు, సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, కృష్ణమూర్తి, ఉప్పు భాస్కర్‌రావు, నళిని, రమాదేవి, రమ్య, నిఖిత, వేణు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, మార్చి4(ఆంధ్రజ్యోతి): దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరుగొండలో గంప శ్రీకాంత్ అనే వ్యాపారి నుంచి రూ.1,60,100 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ కేసులో పిన్నవారి స్ట్రీట్‌కు మహేందర్ కుమార్, రాజ్ పురోహిత్ పరారీలో ఉన్నారని తెలిపారు. అదే విధంగా గీసుగొండ పోలీసుస్టేషన్ పరిధిలోని దూపకుంటలో పోశాల ప్రదీప్ అనే వ్యక్తి నుంచి రూ.23,220 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

సంగెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్లారి గూడ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని వారి నుంచి రూ.24,680 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ సంఘటనలో ఇద్దరు పరారయ్యారని, నగదుతో పాటు పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులను స్థానిక పోలీసులకు అప్పగించామని పేర్కొన్నారు.

భూమికి బదులు భూమే కావాలి..

మంత్రి సురేఖ ఇచ్చిన మాట నిలుపుకోవాలి

మామునూరులో భూ సర్వేను అడ్డుకున్న రైతులు

పరిస్థితి ఉద్రిక్తం.. వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు

మామునూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు స్థలం వద్ద రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం భూ సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. మంత్రి కొండా సురేఖ ఇచ్చిన మాట ప్రకారం భూమికి బదులు భూమి ఇస్తేనే సర్వేకు అనుమతి ఇస్తామని, లేదంటే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. నక్కలపల్లి, భట్టుపల్లి, నల్లగుంట, గాడిపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది రైతులు నిరసన చేపట్టారు. భూమి ఇవ్వకుంటే మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని, అంతేగాకుండా తమ ఊరికి ప్రత్యామ్నాయ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. దీంతో దాదాపు రెండుగంటల పాటు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. విధిలేని పరిస్థితిలో రెవెన్యూ అధికారులు సర్వే చేయకుండానే వెనుతిరిగి వెళ్ళిపోయారు.

సేకరించాల్సిన భూమి 253 ఎకరాలు

మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఇటీవలే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికోసం దాదాపు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుంది. ఇప్పటికే 696 ఎకరాల స్థలం ఉండగా, మరో 253 ఎకరాలు అవసరమని అధికారులు నిర్ణయించారు. భూసేకరణకు అవసరమైన నిధులను కూడా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిలీజ్ చేసింది. ఈ నెలలోనే భూసేకరణ చేసి మరో నాలుగైదు నెలల్లో విమానాలు రాకపోకలు సాగించేలా ప్లాన్ చేస్తున్నారు. కాగా, గతంలో భూమి కోల్పోతున్న బాధితులకు భూమికి బదులు భూమిని, ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు ఇస్తామని ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారని, దానికి కట్టుబడి ఉండాలని రైతులు డిమాండ్ చేశారు.



రైతుల ఆందోళన నేపథ్యంలో మోహరించిన పోలీసులు



ఎకరాకు ఐదు కోట్లు ఇవ్వాలి : హన్మంతు, రైతు, నక్కలపల్లి

నాకు రోడ్డుకు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఇక్కడ ఎయిర్ పోర్ట్ నిర్మిస్తామని 15 ఏళ్ల నుంచి అంటున్నారు. ఇందుకుగాను మా భూమికి మార్కెట్ రేటు కటిస్తానని మంత్రి, ఎమ్మెల్యే అప్పట్లో చెప్పారు. ఇప్పుడు మాట మారుస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే చేతనైంది చేసుకో పో.. అంటున్నాడు ఇదేమైనా న్యాయమేనా..? ఎకరాకు రూ.5కోట్ల చొప్పున పరిహారం చెల్లించాలి.



మాకు రోడ్డు కావాలి : వీరభద్రరావు, రైతు, గుంటూరుపల్లి

రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూనే ముఖ్యమంత్రి రైతులకు అన్యాయం చేస్తున్నారు. మా భూమి ఎకరాకు మూడు నుంచి నాలు కోట్ల వరకు ధర పలుకుతుంది. ఈ భూమి తీసుకుని ఎంతో కొంత ఇస్తామంటే దేనికి సరిపోతాయి. ఇన్నాళ్లు ఈ భూమిని నమ్ముకుని జీవిస్తున్నాం. ఇపుడు మోసం చేస్తే ఊరుకోం. మాకు భూమే ఆధారం.. భూమిని నమ్ముకునే జీవిస్తున్నాం. మా బాధను అర్థం చేసుకోవాలి

ప్రశాంతంగా అకూట్ ఎన్నికలు

● 97 శాతం పోలింగ్.. ఇద్దరు గైర్హాజరు ● నేడు కౌంటింగ్.. మధ్యాహ్నం ఫలితాల వెల్లడి

కేయూ క్యాంపస్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకూట్) ఎన్నికలు ప్రశాంతం జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధ్యాపకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేయూ సెనెట్‌హాల్‌తో పాటు కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేయూ క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 63 మంది అధ్యాపకులు అధ్యక్ష, కార్యదర్శి పోస్టులకు ఓటు వేశారు. అలాగే కొత్తగూడెంలోని వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల పోలింగ్ కేంద్రంలో 12మంది అధ్యాపకులకు 11మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నా రు. మొత్తం 77మంది అధ్యాపకులకు 75మంది అధ్యాపకులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 97 శాతం ఓటింగ్ నమోదైంది. నిజామా బాద్‌లోని తెలంగాణ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ మంజుల తన తండ్రి మృతి చెందడంతో ఓటింగ్‌కు హాజరుకాలేదు.

కేయూ అధ్యాపకుల సంఘం (అకూట్) ఎన్నికల ఫలితాలు బుధవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత వెల్లడించనున్నారు. కేయూ సెనెట్ హాల్‌లో మధ్యాహ్నం 2గంటలకు ఎన్నికల కౌంటింగ్ చేపడుతామని ఎన్నికల అధికారి సీహెచ్ ప్రణయ్‌కుమార్ వెల్లడించారు. కౌంటింగ్ అనంతరం వెంటనే ఫలితాలను వెలువ రిస్తామని రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. పోలింగ్ ప్రశాంతం గా జరిగిందని తెలిపారు. పోలింగ్‌లో కేయూ టీచింగ్ విభాగం ఉద్యోగులు, ఏఆర్‌లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఓటు హక్కును వినియోగించుకుంటున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

యూజీసీ నిబంధన మేరకే అడ్మిషన్లు

● అకడమిక్ స్టాండింగ్ కమిటీలో నిర్ణయం

కేయూ క్యాంపస్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో సిఫార్సుల లేఖల పీహెచ్‌డీ అడ్మిషన్లపై పీటముడి బిగుస్తోంది. ఇటీవల కాలంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్‌లతో పాటు ఇతర సంస్థల నుంచి పీహెచ్‌డీ ఆశావహులైన అభ్యర్థులు కేయూలో పీహెచ్‌డీ సూపర్ న్యూమరీ అడ్మిషన్‌లు కల్పించాలని ఫిబ్రవరి 5న మొదటి సిఫార్సు లేఖను తమ పేర్లు, డిపార్టుమెంట్ సెల్‌నెంబర్లతో సహా తెచ్చుకున్నారు. దీంతో సిఫార్సుల లేఖల నేపథ్యంలో ఆశావహులైన అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లపై చర్చించేందుకు వర్సిటీలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంల నేతృత్వంలో ఇటీవల అన్ని విభాగాల డీన్లతో తొలి దఫా సమావేశం నిర్వహించారు. డీన్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు మంగళవారం కేయూ అకడమిక్ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సోషల్ సైన్స్ ఆర్ట్స్ (ఇన్‌చార్జ్), సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్, కామర్స్, లా డీన్లతో పాటు ప్రిన్సిపాల్స్, ఎంపిక చేసిన పాలక మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. వర్సిటీలో పీహెచ్‌డీ సిఫార్సు లేఖలు ఎవరెవరు ఇచ్చారు? అభ్యర్థుల పేర్లు, డిపార్టుమెంట్ల వారిగా సమీక్షించారు. పీహెచ్‌డీ సూపర్ న్యూమరీ సీట్లు కేటాయిస్తే సాంకేతిక సమస్య ఏమిటనే అంశాలపై సుదీర్ఘంగా అకడమిక్ స్టాండింగ్ కమిటీలో చర్చించారు. సిఫార్సు లేఖల్లో మొత్తం 80 మందికి పైగా అభ్యర్థులున్నట్లు నిర్ధారించారు. మొదటి జాబితా రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు పంపగా మిగతా సిఫార్సుల జాబితాలు వివిధ కమిషన్ల అధికారులు వర్సిటీకి ఉన్నతాధికారులకు పంపారు. మెజారిటీ డీన్లు పీహెచ్‌డీ అడ్మిషన్లకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ప్రకటించిన మార్గదర్శకాలను పాటిద్దామని, సిఫార్సుల లేఖ మేరకు సీట్ల కేటాయింపులు చేయలేమని కరాఖండిగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. డీన్ల అభిప్రాయాల మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు ఏ నిబంధనల మేరకు మీరిచ్చిన సిఫార్సు లేఖలకు అనుగుణంగా పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇవ్వాలో స్పష్టత ఇవ్వాలని మళ్లీ తిరిగి వారికి వర్సిటీ తరఫున లేఖ రాయాలని నిర్ణయించినట్లు సమాచారం. పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియలో సిఫార్సుల లేఖల మేరకు అడ్మిషన్లు కల్పించలేమని, ప్రొసీజర్ మేరకే అడ్మిషన్లు కల్పించాలని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. చివరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు తిరిగి లేఖ రాసి.. తామిచ్చిన పీహెచ్‌డీ అడ్మిషన్ల లేఖలపై స్పష్టత కోసం ప్రయత్నించాలని నిర్ణయించారు. వారిచ్చే సమాధానం ఆధారంగా వర్సిటీ పాలక మండలిలో చర్చించి అడ్మిషన్లపై తుది నిర్ణయం తీసుకుందామని డీన్లు, ప్రిన్సిపాళ్లు అకడమిక్ స్టాండిగ్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, గతంలో పీహెచ్‌డీ అడ్మిషన్లపై వర్సిటీలో పెద్ద ఎత్తున నిరసన ఆందోళనలు చోటు చేసుకోవడం రాష్ట్ర ప్రభుత్వం జోక్యంతో కొందరికి అడ్మిషన్లు కల్పించారు. అదే విధంగా తమకు అడ్మిషన్లు ఇవ్వాలనే డిమాండ్లు వర్సిటీలో పెరుగుతున్నాయి.

జిల్లాస్థాయి సృజనా టెక్‌ఫెస్ట్ విజయవంతం



ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వరంగల్ జిల్లాస్థాయి సృజనా టెక్‌ఫెస్ట్ 2024-25 ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ టెక్‌ఫెస్ట్‌లో వివిధ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శిస్తూ, వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. సమాజానికి ఉపయోగకరమైన సమస్యలపై ఆధారపడిన పలు ప్రాజెక్టులను ఈ టెక్‌ఫెస్ట్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎ.కుమార్, జి.మాధవరావు, ఎం.వెంకన్న, ఎస్.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఇంధన తయారీకి
పరిశోధనలు రావాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేశ్‌కుమార్

కేయూక్యాంపస్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ ఇంధనాన్ని తయారు చేసే దిశగా కీలక పరిశోధనలు రావాల్సిన అవస రం ఉందని అస్ట్రియా శాస్త్రవేత్త, కేయూ కెమిస్ట్రీ విభాగం అల్యూమినీ డాక్టర్ సీహెచ్. రమేశ్‌కుమార్ చెప్పారు. మంగళవారం కేయూ కెమిస్ట్రీ విభాగంలో రసాయన శాస్త్ర విభాగం విద్యార్థులకు విస్తృత ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమేశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యామ్నాయ, పునరుత్పాదక ఇంధనాలు, రసాయ నాలకు డిమాండ్‌తో పరిశోధనలకు ఊతం పలికిందన్నారు. పునరు త్పాదక ద్రవ ఇంధనాలు, రసాయనాల ఉత్పత్తి శిలజ ఇంధనాలకు ప్రత్యామ్నాయ, పునరుత్పాదక ఇంధనా లపై ఆధారపడాలని అన్నారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్‌ను శాలువ, జ్ఞాపిక అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సైన్స్ విభాగం డీన్ జి.హన్మంతు, టి.సవితాజ్యోత్స్న, సుంకరి జ్యోతి, మమత పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాల వెల్లడి



ఫలితాలను వెల్లడిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేయూ రెగ్యులర్ డిగ్రీ కోర్సుల 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ మేరకు మంగళవారం కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లు ఫలితాలను వెల్లడించారు. మొదటి సెమిస్టర్‌లో 21 శాతం, మూడో సెమిస్టర్‌లో 28 శాతం, ఐదో సెమిస్టర్‌లో 40 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఫలితాలు కేయూ వెబ్‌సైట్ https:// kakatiya.ac.in/లో చూడాలని పేర్కొన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ వెంకటయ్య, వర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, ఏఆర్ రామా వెంకటేశ్వర్లు, క్యాంప్ ఆఫీసర్ ఎస్.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, రీవాల్యూవేషన్‌కు విద్యార్థులు 15రోజుల్లో దరఖాస్తులు చేసుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్‌కట్ల రాజేందర్ సూచించారు.

రాణా.. జానీ.. డయానా.. మాక్స్.. కైరో..

● వరంగల్ కమిషనరేట్‌కు ఐదు కొత్త జాగిలాలు

● నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర : సీపీ

వరంగల్ క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసు డాగ్‌స్క్వాడ్‌లో కొత్తగా ఐదు జాగిలాలు చేరాయి. మొయినాబాద్‌లోని పోలీసు జాగిలాల శిక్షణ కేంద్రంలో 8 నెలల శిక్షణ పూర్తిచేసుకున్న మూడు బెల్జియన్ మాలినోస్, రెండు గోల్డెన్ రీట్రీవర్ జాతులకు చెందిన రాణా, జానీ, డయానా, మాక్స్ కైరో అనే ఐదు జాగిలాలు విధులు నిర్వహించేందుకు సిద్ధమ య్యాయి. మంగళవారం జాగిలాల పనితీరును సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నేరాలకు పాల్పడిన నిందితు లను పట్టుకోవడంలో పోలీసు జాగిలాలు కీలకంగా పని చేస్తాయ న్నారు. గతంలో ఎన్నో పేలుడు పదార్థాలకు కనిపెట్టడంలో జాగిలా లు విజయం సాధించాయని గుర్తు చేశారు. నూతన జాగిలాలకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను సీపీ ఆదేశించారు. ఈ సందర్భంగా జాగిలాలకు సంబంధించిన పూర్తి వివరాలను హ్యాండర్లు సీపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, హ్యాండర్లు రాజేశ్, కుమార్, వెంకన్న, సురేశ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



జాగిలం తలను నిమురుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాలి

● సీనియర్ సంపాదకుడు డాక్టర్ కె.శ్రీనివాస్ ● కేయూలో ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు 23వ స్మారక ఉపన్యాసం

కేయూ క్యాంపస్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్రం తెలంగాణలో ప్రజల ఆకాంక్షలన్నీ నెరవేరాలని, భవిష్యత్ తెలంగాణకు విలువలతో కూడిన విధాన చట్రం కావాలని సీనియర్ సంపాదకుడు డాక్టర్ కె.శ్రీనివాస్ ఉద్బోధించారు. మంగళవారం కేయూ మ్యాథ్స్ విభాగం సెమినార్ హాల్‌లో ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు 23వ స్మారక ఉపన్యాసం జరిగింది. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ కె.శ్రీనివాస్ 'తెలంగాణ అఫ్టర్ ఏ డికేడ్ : ఎమర్జింగ్ పొలిటికల్ అండ్ సోషల్ సినారియోస్' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్‌రావు తాత్విక సిద్ధాంతకర్త అని, ఆయన సమగ్ర అభివృద్ధితో కూడిన తెలంగాణ రూపకల్పన చేశారని వివరించారు. ఆయన ఊహలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జరగడం లేదన్నారు. రాష్ట్ర డైనమిక్స్ మారుతున్నాయని, మూడో వర్గం ఎమర్జ్ అవుతోందన్నారు. తెలంగాణలో యువత డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్‌యాప్ వ్యసనాలతో నిష్క్రియపరులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇక్కడి ప్రజలు పనిచేయడానికి విముఖత వ్యక్తం చేస్తుండటంతో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వస్తున్నారని విశ్లేషించారు. దీని నివారణకు సాంస్కృక ఉద్యమ రావాలన్నారు. ఉపాధి - అవకాశాలు మధ్య అగాధం పెరుగుతోందన్నారు. చిరు వ్యాపారులలో ఉత్తరాది వారి ప్రాబల్యం పెరుగుతోందన్నారు. దీని నివారణకు జోక్యంతో పాటు భద్రత అవసరమన్నారు. ప్రభుత్వాలు సైతం ఆ దిశగా ఆలోచనలు చేయాలన్నారు. గ్రామీణ దుస్థితి ఉపశమనం పొందేందుకు సంక్షేమ పథకాలు రూపొందించాలని అన్నారు. వ్యవసాయ భూములన్నీ ఇతర రంగాలకు మళ్లుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు రియల్ ఎస్టేట్ పెరుగుతోందన్నారు. ఆహార భద్రత అంటే వరి లభ్యత ఒక్కటే కాదన్నారు. 10 ఏళ్లలో ఏడువేల మంది బలన్మణాలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యరంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. పాలకుల్లో జవాబుదారీతనం పెరగాలన్నారు. పదేళ్లలో నైతికత లేకుండా పోయిందన్నారు. సివిల్ సొసైటీలో చైతన్యం మందగిస్తోందన్నారు. దేశ రాజకీయాలకు భిన్నంగా తెలంగాణ సాగుతోందన్నారు. హింస పెరిగిందన్నారు. అందరి బాగు కోసం, తెలంగాణ భవిష్యత్ కోసం తెలంగాణ ఉద్యమ సమాజం పునరాలోచనలు చేయాలని కె.శ్రీనివాస్ పేర్కొన్నారు.

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు ప్రతిఫలాలు అందరికీ అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో వర్సిటీ మార్గదర్శనం చేస్తోందన్నారు. వర్సిటీలోని తెలంగాణ స్టడీ సెంటర్‌లో రాష్ట్ర అభివృద్ధిని మార్గదర్శనం చేసేలా చర్చలు. వేదికలు నిరంతరం జరగాలని ఆకాంక్షించారు. అందుకు తగిన విధంగా చర్యలు చేపడుతామని వెల్లడించారు. కాగా, సమావేశం ప్రారంభంలో బియ్యాల జనార్దన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, బియ్యాల జనార్దన్‌రావు మెమోరియల్ ఫౌండేషన్ బాధ్యులు ప్రొఫెసర్ ఇరవతి, కె.మురళీమనోహర్, నరేంద్రబాబు, తక్కళ్ళపల్లి బుచ్చిబాబు, కె.సీతారామారావు, క్రిష్టయ్య, మంద వీరస్వామి, సాదు రాజేశ్, శోభారమేశ్, కుర్రా అధ్యక్షకార్యదర్శులు ఎ.సదానందం, వడ్డె రవీందర్, చొక్కయ్య, రామేశ్వరం, డాక్టర్ వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



బియ్యాల జనార్దన్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి తదితరులు



సక్సెస్ స్టోరీ



సత్తాచాటిన శ్రీనివాస్‌యాదవ్

'విలేజ్ రత్నాల' విజయం

సినిమా స్పూఫ్‌లతో మెరుస్తున్న బెగ్లూర్ యువకుడు

అనతికాలంలోనే 2 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు

బృందం నుంచి ఇద్దరికి సినిమాల్లో అవకాశాలు



మహదేవపూర్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో వీడియోలు చేస్తూ వైరల్ అయ్యాడు ఓ యువకుడు. తనకు నచ్చిన, తనకు వచ్చిన ప్రతిభతో వీడియోలు చేస్తూ అనతికాలంలోనే రెండు లక్షల పైచిలుకు సబ్‌స్క్రైబర్లను సంపాదించుకున్నాడు. ఇంకేముందు మంచి ఆదాయంతో పాటు సినిమాల్లోనూ అవకాశాలు వస్తున్నాయి. సినిమా స్పూఫ్ వీడియోలతో విజయం సాధించిన ఆ విలేజ్ రత్నాలు సాధించిన విజయం గురించి ఇప్పుడు అందరూ చర్చించుకుంటున్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామానికి చెందిన ముల్కల శ్రీనివాస్ యాదవ్ 2020లో ఆ ఊరిపేరుతో యూ ట్యూబ్‌లో ఓ ఛానల్ ప్రారంభించారు. రెండు సంవత్సరాల వరకు ఆశించిన స్థాయిలో ఛానల్ వీక్షకులకు చేరకపోవ డంతో.. ఆ ఛానల్ పేరును 'విలేజ్ రత్నాలు06'గా మార్చారు. అప్పటి నుంచి పది నిమిషాల నిడివి ఉన్న వీడియోలతో పాటు షార్ట్ వీడియోలను అప్‌లోడ్ చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే 2022లో బాహుబలి-1లోని చివరి యుద్ధ సన్నివేశాన్ని స్పూఫ్ వీడియోగా చిత్రీకరించి అప్లోడ్ చేయడంతో అది వైరల్ అయ్యింది. యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లోనూ మిలియన్ వ్యూస్ వచ్చాయి. దీనికితోడు నాటి బిగ్‌బాస్-5 విజేత వీజే సన్నీ ఆ వీడియోను తన ఇన్‌స్టా స్టోరీలో పెట్టడంతో వ్యూవర్‌షిప్ క్రమంగా పెరుగుతూ వచ్చింది. అప్పటివరకు వెయ్యి మంది మాత్రమే సబ్‌స్క్రైబర్లు ఉన్న ఆ ఛానల్‌కు ఒక్కసారిగా లక్షకుపైగా సబ్‌స్క్రైబర్లు రావడంతో ఛానల్‌లో వీడియోలు పాపులర్ అయ్యాయి.

స్పూఫ్ వీడియోలే..

ఒక్క షార్ట్ వీడియోతో వైరల్ అయిన విలేజ్ రత్నాలు.. మొత్తం స్పూఫ్ వీడియోలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. టాలీవుడ్, బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన సినిమాల్లోని సన్నివేశాలను స్పూఫ్ వీడియో స్‌గా చిత్రీకరిస్తూ తనదైన శైలిలో యూట్యూబ్‌లో రాణిస్తున్నాడు శ్రీనివాస్ యాదవ్. ప్రధానంగా బాహుబలి, మగధీర, విక్రమార్కుడు, అరుంధతీ, అర్జున్ రెడ్డి, శ్రీమంతుడు లాంటి చిత్రాలతో పాటు బతుకుజట్కా బండి, మాక్ అసెంబ్లీ లాంటి స్పెషల్ స్పూఫ్ వీడియోలే మొదటి వరసలో నిలిచాయి. అలా పలు స్పూఫ్ వీడి యోలతో వైరల్ అయిన శ్రీనివాస్ యూట్యూబ్ సహా అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో తన మార్క్ చాటుకున్నాడు. యూట్యూబ్(ప్రైమరీ) ఛానల్‌లో 2.26లక్షల సబ్‌స్క్రైబర్లు ఉం డగా అనుబంధంగా ఉన్న మరో రెండు చానళ్లకు 40వేల సబ్‌స్క్రైబర్లను సంపాదిం చుకున్నాడు. ఇన్‌స్టాగ్రాంలో 1.80లక్షలు, ఫేస్‌బుక్‌లో 1.10లక్షలు, మోజ్‌లో 1.20లక్షల ఫాలోవర్లు ఉన్నారు.

సినిమా అవకాశాలు.. స్వయం ఉపాధి..

యూట్యూబర్ శ్రీనివాస్‌కు విలేజ్ రత్నాలు ఛానల్‌ను ఓ స్వయం ఉపాధిగా మలుచుకున్నాడు. షెడ్యూల్ వారీగా వీడియోలను విడుదల చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఛానల్ ద్వారా మంచి ఆదాయాన్ని అర్జించడమే కాకుండా మరికొంత మందికి ఆసరాగా నిలుస్తున్నాడు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు, చిన్నారుల్లో ఉన్న ప్రతిభను ప్రపంచానికి చూపెడుతూనే వారికి అండగా నిలుస్తున్నారు. చానల్‌లో నటించిన ఇద్దరు చిన్నారులకు పాన్‌ఇండియా సినిమా 'ప్రవాహం'లో నటించే అవకాశం వచ్చిం ది. వైజయంతి మూవీస్ ద్వారా వచ్చే సినిమాల్లోనూ నటించేందుకు ఆడిషన్స్ అవకాశం వచ్చింది. సినిమా లతో పాటు ప్రముఖ యూట్యూబ్ ఛానల్లలోనూ ఇంటర్వ్యూలకు హాజరవుతూ ప్రజల్లో నిలుస్తున్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు



కాటారం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలం లోని గుండ్రాత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మల్లారంలో నిర్మించిన అభయా ంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాప నోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమ య్యాయి గ్రామస్థులు, పలువురు దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించగా అభయాం జనేయస్వామితో పాటు ఇతర విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవచ నం, అగ్ని ప్రతిష్ఠాహోమం, విగ్రహాల జలాధివాసం తదితర కార్యక్రమాలు జరిగాయి.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే

- పరీక్షల వేళ మితాహారం మేలు
- సానుకూల దృక్పథంతో పరీక్షలకు హాజరవ్వాలి
- నేటి నుంచే ఇంటర్ పరీక్షలు



వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇది పరీక్షల కాలం.. విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతూ ఒత్తిడిని జయిస్తే విజయతీరాలకు చేరుతారని మనోవికాస, విషయనిపుణులు, వైద్యులు సూచిస్తున్నారు. బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రశాంతమైన చింతనతో పరీక్షలకు హాజరుకావాలని సూచిస్తున్నారు. ఇక పరీక్షల వేళ సులువుగా జీర్ణమయ్యే ఆహారంతో పాటు సుఖవం తమైన నిద్ర అవసరమని వారు చెబుతున్నారు. ఎండలు మండు తున్న నేపథ్యంలో విద్యార్థులు నీటితో పాటు పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల నీరసం రా కుండా హుషారుగా పరీక్షలు రాస్తారని చెబుతున్నారు. ఇక పరీక్షల సమ యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పరీక్షల కాలంలో పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి మనోస్థైర్యాన్ని నింపాలని సూచిస్తున్నారు.

సానుకూల దృక్పథంతో హాజరవ్వాలి

పరీక్షల వేళ విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రతీ విషయంలో సానుకూ ల దృక్పథం తో ముందుకు సాగాలి. ఒత్తిడి లేకుండా విషయాలను పూర్తి స్థాయిలో అవగతం చేసుకునేం దుకు ప్రయత్నించాలి. పాఠ్యాంశాల్లో అనుమానాలు ఉంటే సబ్జెక్టు టీచర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. పాఠ్యాంశాలపట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ప్రశ్నా పత్రాలను చూసిన వెంటనే హైరానా పడకుండా ఒక సారి పూర్తిగా చదుకొని ప్రశ్నలను అర్థం చేసుకోవాలి. అనంతరమే అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు మంచి చేతిరాతతో రాయాలి. పరీక్షల్లో ప్రతీ ప్రశ్నకు సమాధానం రాసేందుకు ప్రయత్నించాలి. ఎలాంటి ఆలోచనలు లేకుండా పూర్తిగా చదువుకొని పరీక్షలు రాసేందుకు సిద్ధపడాలి.

తల్లిదండ్రులు పిల్లల్లో ధైర్యం పెంచాలి..

పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఎలాంటి ఒత్తిడులు వారి దరిచేరకుండా చూసుకోవాలి. పరీక్షలకు సిద్ధమయ్యేలా మంచి వాతావరణాన్ని కల్పించి ప్రోత్సహించాలి. పరీక్షల సమయాల్లో టీవీలు, ఫోన్లు చూడటం లాంటివి పూర్తిగా మానేయాలి. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయాలి. పిల్లలు కంటి నిండా నిద్రపోయేలా ఏర్పాట్లు చేయాలి. విద్యార్థులను చదవాలని ఒత్తిడి చేయకుండా వారికి సానుకూల వాతావరణాన్ని ఇంట్లో ఏర్పాటు చేయాలి.

ప్రతీ రోజు వారు రాస్తున్న పరీక్షల వివరాలను తెలుసుకుంటూ వారిలో ఆత్మస్థైర్యం పెంపొందే మాటలు చెప్పాలి. పరీక్ష కేంద్రాలకు ముందుగానే తీసుకెళ్లి వారిని దగ్గరుండి కేంద్రంలోకి పంపించి రావాలి.

నిమిషం నిబంధనను ఎత్తేసిన ఇంటర్ బోర్డు

- ఐదు నిమిషాల వరకు అనుమతికి అవకాశం

ఇంటర్ విద్యార్థులకు కాస్త ఊరటనిస్తూ ఇంటర్ బోర్డు ఓ నిర్ణయం తీసుకుంది. గతంలో పరీక్ష సమయానికంటే ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా విద్యార్థులకు పరీక్షకు అనుమతించేవారు కాదు. పలు కారణాలతో ఆలస్యమైందంటూ పిల్లలు, వారి తల్లిదండ్రులు అక్కడి అధికారులు, పోలీసులను బతిమిలాడేవారు. అయినా అనుమతికి నిరాకరించడంతో ఆరోజు పరీక్ష రాయకుండా ఏడుస్తూ ఇంటి దారి పట్టే వారు. తీవ్ర మనోవేదనకు గురయ్యేవారు. ఈ పరిస్థితులను అర్థం చేసుకున్న ఇంటర్ బోర్డు ఈ ఏడాది నిమిషం నిబంధనకు పలికింది. పరీక్ష సమయానికి అయిదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని బోర్డు సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది విద్యార్థులకు ఊరటనిచ్చే అంశం కాగా.. ఐదు నిమిషాల తర్వాత వచ్చిన వారికి ప్రవేశం ఉండదు. అందుకే విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవడం మంచిది.

సులువుగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి..

రవీందర్‌రెడ్డి, ఎంజీఎం డైటీషియన్

పరీక్షల వేళ విద్యార్థులు సులువుగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యార్థులు నీటితో కూడి ఆహార పదార్థాలతో పాటు పండ్లు, పండ్ల రసాలు తదితరా లను ఆహారంగా తీసుకోవాలి. దోసకాయ, పుచ్చకాయ, ద్రాక్ష తదితర పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. నూనె పదార్థాలను పూర్తిగా విస్మరించాలి. చిరుతిండ్లు, వేపుడు పదార్థాలు, బిర్యానీలు, మసాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోకూడదు. ఫాస్ట్ ఫుడ్‌ను పూర్తిగా మానివేయాలి. మజ్జిగ, పెరుగు తదితర చలువ పదార్థాలను మాత్రమే ఆహారపదార్థాలుగా తీసుకోవాలి.

ఒత్తిడి జయిస్తే విజయం మీదే..

బరుపాటి గోపి, మనోవికాస నిపుణులు



ఇంటర్ విద్యార్థులు పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా రాయాలి. అందుకు తల్లిదండ్రులు సహాయసహకారాలు అందించాలి. విద్యార్థులు పరీక్షల సమయంలో అనవసరమైన ఆందోళన చెందకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి ఆహారం అందజేస్తూ వారిని పరీక్షలకు సానుకూల దృక్పథంతో ముందుకు సాగేలా కృషి చేయాలి. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష హాల్లో ఒత్తిడికి గురికావద్దు. ప్రశ్నా పత్రం ఇవ్వగానే తొందరపడకుండా ప్రశ్నా పత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకున్నాకే జవాబులు రాయడం ప్రారంభించాలి. పరీక్షకు ప్రశాంతమైన మనస్సుతో హాజరుకావాలి.

ఘాటులోనే గాఢ నిద్ర

మిర్చి బస్తాలపై ఆదమర్చిన అలసటతో అన్నదాతలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చిన పలువురు రైతులు అలసటతో ఘాటైన మిర్చి బస్తాలపైనే ఆదమరచి నిద్రిస్తుండడం మంగళవారం కేసముద్రం మార్కెట్లో కనిపించింది. 'ఆకలి రుచిఎరుగదు, నిద్ర సుఖమెరగదు' సామెతకు నిదర్శనం ఈ ఫొటోలు. ఓ వైపు మిర్చి ఘాటుతో యార్డులో దగ్గులు, తుమ్ములతో అక్కడ ఉండలేని పరిస్థితి ఉండగా కొందరు రైతులు మాత్రం అలసటతో ఘాటులోనే గాఢనిద్రలోకి జారుకున్నారు. నిద్ర వచ్చేవారికి మెత్తని పరుపులు అవసరం లేదని, కటిక నేలైనా ఘాటైన మిర్చి బస్తాలైనా ఒక్కటే అన్నట్లుగా ఉంది కదూ..

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి



కేసముద్రం మార్కెట్ మిర్చియార్డులో బస్తాలపైనే ఆదమరిచి నిద్రిస్తున్న రైతులు



మట్టి బాటిల్ ఎంతో మంచిదయా!

ఓ వైపు ఎండలు తీవ్రమవుతున్నాయి. దీంతో ప్రజలు చల్లచల్లని పానీయాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యానికి హాని కలగకుండా ఉండేలా.. సహజసిద్ధంగా మట్టి తయారైన బాటిళ్లు మార్కెట్లోకి వచ్చాయి. ప్రస్తుతం రంజన్లకు డిమాండ్ ఉన్న క్రమంలో.. ఇదిగో ఇలా మట్టితయారు చేసిన తక్కువ బరువున్న వాటర్‌బాటిల్ కొనేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం ఆరోగ్యానికి అంతగా మంచిది కాదని నిపుణులు చెబుతున్న నేపథ్యంలో ఇలాంటి మట్టిబాటిళ్లకు గిరాకీ పెరిగింది. సాధారణ ప్లాస్టిక్ బాటిళ్ల లాగానే ఇవి బరువు తక్కువగా ఉంటాయని, తేలికగా ఎటంటే అటు తీసుకెళ్లవచ్చని చెబుతున్నారు. హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో ఇలా మట్టిబాటిళ్లు కొనేందుకు జనం ఆసక్తి చూపుతుండగా.. వ్యాపారులు ఒక్కోబాటిల్‌ను రూ.100చొప్పున విక్రయిస్తున్నారు.

ఫొటో: 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

మహిమాన్వితుడు.. కొమ్మాల నరసింహుడు

- రాజగోపురంతో ఆలయానికి ప్రత్యేక శోభ
- వందల ఏళ్ల నాటి స్వామివారి రథం మరో ఆకర్షణ
- ఏటా జరిగే జాతరకు లక్షలాది మంది భక్తుల రాక
- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 10న కల్యాణం , 14న జాతర, 18న రథోత్సవం

ఆధ్యాత్మికం





తూర్పు రాజగోపురంతో ఆలయగుట్ట, స్వామివారి మూలవిరాట్

గీసుగొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఎంతో మహిమ గల కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి.. భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్నాడు. వరంగల్ మహానగరానికి 15కిలోమీటర్ల దూరంలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిలో కొమ్మాల సమీపంలో ఉండే ఈ ఆలయం ఆధ్యాత్మిక ప్రాధాన్యంతో పాటు చారిత్రక విశిష్టతనూ కలిగి ఉంది. 50అడుగులు గల రాతి గుట్టపై వందల ఏళ్ల నాడు ఇక్కడ లక్ష్మీనరసింహుడు స్వయంగా వెలియటం వల్ల స్వయంభూ దేవాలయంగా విరాజిల్లుతోంది. అంతేకాకుండా ఇక్కడి స్వామివారిని పాండవులు ఇలవేల్పుగా కొలిచినట్లు స్థలపురాణం చెబుతోంది. కాకతీయ రాజ్యాన్ని పాలించిన రుద్రమదేవి కూడా స్వామివారి కల్యాణోత్సవానికి వచ్చేదని ప్రతీతి. ఆలయగుట్టకు సమీపంలోనే పాండవులు సంచరించినట్టు ప్రచారంలో ఉన్న చిన్నగుట్టకూడా ఇప్పటికీ ఉంది. ఎంతో మహిమ గల లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ ప్రాంగణంలో తూర్పు వైపున వెంకటగిరి అనే భక్తుడు రూ.80లక్షల విరాళాలతో నిర్మించిన రాజగోపురం ఆలయానికి ప్రత్యేక శోభనిస్తుంది. యేటా జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి రెండు లక్షలకు పైగా భక్తులు తరలొస్తుంటారు.

ఆలయ స్థలపురాణం

కొమ్మాల ఆలయానికి సంబంధించి స్థల పురాణం చెబుతున్న అంశాలు చూస్తే ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఓ రైతు మొక్కజొన్న పంటను కోస్తూ అలసిపోయి చెట్టునీడన కూర్చుంటాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఓ బాలుడు పంటచేనును తాను కోసిపెడతానని, తనకు కొడవలి, తాగడానికి దూపబుడ్డి కావాలని చెబుతాడు. ఆ రైతు బాలుడికి కొడవలి ఇచ్చి దూపబుడ్డి కోసం వెళ్లి.. తిరిగి వచ్చే సరికి చేను మొత్తం కోసి ఉండడం, బాలుడు కనిపించకపోవడంతో ఆశ్చర్యపోతాడు. ఇక అదే రోజు రాత్రి ఆ రైతు కలలోకి ఆ బాలుడు వచ్చి తాను నరసింహస్వామినని ఇక్కడ ఉన్న గుట్టపై వెలుస్తున్నానని ఆలయాన్ని కట్టించాలని కోరతాడు. ఈ విధంగా ఆలయ నిర్మాణం జరిగిందని స్థానికులు చెబుతారు. 50అడుగుల ఎత్తులో ఉన్న గుట్టపై గల రాతిగుహలో స్వామివారు వెలియగా దాదాపు 700 సంవత్సరాల నుంచి కొమ్మాల జాతర కొనసాగుతోంది.

500 ఏళ్ల నాటి ఐదంతస్థుల రథం

ఎంతో ప్రాశస్త్యం ఉన్న కొమ్మాల లక్ష్మీనర్సింహుడి ఆలయంలోని.. 500 ఏళ్లనాడు రాతి చక్రాలతో నిర్మించిన ఐదు అంతస్థుల రథం ఆలయ ప్రాచీన వైభవానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆలయ ప్రాంగణంలో ఈ రథాన్ని నిలిపేందుకు ఎత్తుగా ప్రత్యేక భవనాన్ని కూడా నిర్మించారు. ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవంలో ఈ రథంపైనే ఉత్సవమూర్తులను అశ్వ, హనుమ, సింహ, ఏనుగు, శేషవాహనాలపై కూర్చొబెట్టి ఆలయగుట్ట చుట్టు ప్రదక్షణలు చేయిస్తారు. ఉత్సవమూర్తులు ఆసీనులైన ఈ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడి తన్మయత్వం పొందుతారు. రథోత్సవం కనుల పండువగా తెల్లవార్లు సాగుతుంది.

మైదాన ప్రాంత గిరిజనుల జాతరగా ప్రసిద్ధి


మైదాన ప్రాంత గిరిజనులు ఈ జాతరకు ఎక్కువ సంఖ్యలో తరిలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో కొమ్మాల జాతరకు గిరిజన జాతరగా కూడా పేరుండేది. ఈ ప్రాంతంలో పుట్టిన గిరిజనులు ఎక్కడ ఉన్న ఈ జాతరకు కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు

స్వామివారికి10ఎకరాల మాన్యాలు

ఇక్కడి లక్ష్మీనరసింహుడికి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ప్రసిద్ధ దేవాలయాలకు ఉన్నట్లుగానే దేవుడి మాన్యాల కింద పదెకరాలు ఉంది. విశ్వనాధపురం గ్రామ పంచాయతీ శివారులో వరంగల్ - నర్సంపేట ప్రధాన రహదారి పక్కన ఈ భూములున్నాయి. ఏటా ఈ భూములను కౌలుకు ఇస్తారు. పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పరిచేందుకు ఈ భూములు కూడా ఎంతో ఉపయోగపడతాయని స్థానికులు అంటున్నారు. అలాంటి కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు. ప్రధాన ద్వారం నుంచి ఆలయ గుట్ట వరకు సెంట్రల్ లైటింగ్‌తో డివైడర్లను ఏర్పాటు చేసి రోడ్డును విస్తరించాలని భక్తులు కోరుతున్నారు. అలాగే కాటేజీలు నిర్మించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..

గురువారం నుంచి 20వ తేదీ వరకు కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు, ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ ట్రస్టీ చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. 6న అధ్యయనోత్సవం, 7న తీర్థబిందె, ప్రాభోధకి, 8న నిత్యవిధి, పరమపదోత్సవం, 9న అంకురారోపణం, అగ్నిప్రతిష్ఠ, రక్షాబంధనం 10న ధ్వజారోహణం, దేవాతాహ్వానం, ఎదురుకోళ్లు, రాత్రి కల్యాణోత్సవం, 11న హనుమత్‌సేవ, వాహనసేవ, 12న నిత్యహోమం, సింహవాహన సేవ, 13న గరుడవాహన సేవా, 14న శకటయానోత్సవం, జాతర (ఆలయ గుట్టచుట్టూ బండ్లు తిరగడం), 15 నుంచి 17 వరకు మొక్కుబడులు, సేవలు, అర్చనలు, 18న రథోత్సవం, 19న పారువేట, పుష్పయాగం, నాగవెల్లి 20న శతఘటాభిషేకం, పండిత సన్మాన కార్యక్రమాలుఉంటాయని వివరించారు.



విశిష్టత గల రథం

9న కేయూలో అలూమ్నీ హాల్ ప్రారంభం

కేయూ క్యాంపస్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర పూర్వ విద్యార్థుల విరాళాలతో నిర్మించిన అలూమ్నీ హాల్‌ను మార్చి 9న ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామని విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం చేతుల మీదుగా అలూమ్నీ హాల్ ప్రారంభ ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ.. రాజనీతిశాస్త్ర పూర్వ విద్యార్థుల విరాళాలతో డిపార్టు మెంట్‌లో తరగతి గదిని కాన్ఫరెన్స్ హాల్‌ను తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. 2024 ఆగస్టు 27న అలూమ్నీ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు నిధు లను సమీకరించినట్లు పేర్కొన్నారు. డిపార్టుమెంట్ విద్యార్థులకు, స్కాల ర్లకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో బీవోఎస్ ఛైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపల్లి నాగరాజు, స్కాలర్స్ కల్లెపల్లి ప్రశాంత్, అంకిళ్ల శంకర్, కేతపాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజస్థాన్‌లో టెక్నో స్టాళ్లను పరిశీలిస్తున్న మేయర్‌సుధారాణి

టెక్నో స్టాళ్లను సందర్శించిన మేయర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ నగరంలో కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ ఎఫైర్స్ పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌ఆర్ జాతీయ సదస్సులో 'రియలైజింగ్ సర్క్యులర్ సొసైటీస్ టై వర్క్స్ ఎచీవింగ్ సస్టనబుల్ డెవలప్‌మెంట్ గోల్డ్ (ఎస్‌డీజీఎస్)' అనే అంశంపై 12వ రీజినల్ ఆర్‌ఆర్‌ఆర్ సర్క్యులర్ ఎకానమీ ఫోరమ్ ఇన్ ఏషియా పసిఫిక్ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు కార్యక్రమాలలో మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. మంగళవారం కేంద్ర మంత్రులతో పాటు మేయర్ అక్కడి టెక్నో స్టాల్స్‌ను సందర్శించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

హసన్‌పర్తి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని యూపీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ అధ్యక్షతన ఆశా డే వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుత కార్పొరేట్ వైద్య సంస్థలకు దీటుగా ప్రభుత్వ వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఎంతో మంది పేదలు కార్పొరేట్ వైద్యం చేయించుకోలేకి ప్రభుత్వ ఆస్పత్రులపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారికి సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. జాతీయ కార్యక్రమాలైన ఎన్‌సీడీ, టీబీ, లెప్రసీతో పాటు వ్యాధి నిరోధక టీకా కార్యక్ర మాలను నూటికి నూరుశాతం విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో 30 ఏళ్లకు పైబడిన వారికి నూరు శాతం స్క్రీనిం గ్ చేయాలని, బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు కృతిక, డాక్టర్ సురేష్, పీహెచ్‌ఎన్ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్‌లు లచ్చులు, రుతమ్మ, ఫార్మ సిస్టు అజిత, స్టాఫ్‌నర్సు విజయకుమారి, హెల్త్ అసిస్టెంట్లు ఇంద్రారెడ్డి, కందు కూరి సంతోష్, మోసిన్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కేడీసీలో ఉచిత కంటి పరీక్షలు

కేయూ క్యాంపస్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అగర్వాల్ కంటి ఆస్పత్రి, కళాశాల ఎన్ఎస్ఎస్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలపై అవగాహనతో నడుచుకోవాలని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు హరికృష్ణ, విజయ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, రవి, కళాశాల అధ్యాపకులు గణ్‌సింగ్, సంధ్యారాణి, వినోదర్‌రావు, రోహిణి, శ్రీనాథ్, రవికుమార్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల పురోగతి ఆశాజనకంగా లేదు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- అధికారుల తీరుపై మండిపాటు.. లక్ష్యం చేరని వారికి నోటీసులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర పాలక సంస్థ అధికారులు పన్నుల వసూళ్లు చేస్తున్న తీరు ఆశాజనకంగా లేదని, ఇదే పద్ధతి కొనసాగితే ఉద్యోగపరంగా చర్యలు తీసుకుంటామని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను హెచ్చరించారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో ఆర్ఐలు, వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఒక్కో అధికారిని లేపి మరీ వ్యక్తిగతంగా మాట్లాడారు. కొందరు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇదే పద్ధతి కొనసాగితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పని చేయని అధికారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని, అదే విధంగా సర్వీస్ బుక్‌లో రిమార్కు రాయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ యేడు ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడుతున్నా.. కొందరు సిబ్బంది ఇంకా లక్ష్యాన్ని చేరలేదని అసంతృప్తి వక్తం చేశారు. పన్ను వసూళ్ల పురోగతిలో మార్పు లేకుండా కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరెడ్డి, రవీందర్, రాజేశ్వర్, ఆర్‌వోలు యూసుఫ్, షజజాదీబేగంతో పాటు ఆర్ఐలు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచండి

బల్దియా పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌ల దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన చాలా బాగుందని అధికారులను, సిబ్బందిని ప్రశంసించారు. వార్డు ఆఫీసర్లు ప్రతీ రోజు 30 దరఖాస్తులు మాత్రమే పరిశీలించారని, ఇకపై ప్రతీ రోజు 50కి పెంచాలని సూచించారు. విధుల్లో జాప్యం చేస్తే లక్ష్యాన్ని చేరుకోలేమని, పనిలో వేగం పెంచాలని అన్నారు. కిందిస్థాయి సిబ్బంది పనితీరును టీపీఎస్‌లు పర్యవేక్షించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు సమయ పాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరెడ్డి, రవీందర్, ఏసీపీలు ఖలీల్ అమ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, ఇర్షాద్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఇందిరా మహిళా క్యాంటీన్‌ల ఏర్పాటు వేగవంతం చేయండి

బల్దియా పరిధిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటును వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కమ్యూనిటీ ఆర్గనైజర్లను సూచించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మెప్మా అధికారులు, సిబ్బందితో కలిసి సమీక్ష ఏర్పాటు చేసి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ సీవో 7 గ్రూపు యూనిట్లు 20 వ్యక్తిగత యూనిట్లను తయారు చేయాలని సూచించారు. వ్యక్తిగత యూనిట్లకు రూ.20లక్షల అందించే విధంగా సీవోలు చొరవ చూపాలని అన్నారు. సీవోలు వారికి సూచించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్‌లో ఎస్‌హెచ్‌జీలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, టీఎంసీ కంజర్ల రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు రమేష్, శ్రీలత, రజిత తదితరులు పాల్గొన్నారు.

యూడీజీ పనులపై సమీక్ష

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం బల్దియా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బల్దియా ఇంజనీరింగ్ అధికారులు, కన్సల్టెంట్ అధికారులతో కలిసి కమిషనర్ మాట్లాడారు. అండర్ గ్రౌండ్ నిర్మాణానికి సంబంధించి త్వరగా డీపీఆర్‌లు సిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు మహేందర్, శ్రీనివాస్, సంతోష్‌బాబు, మాధవి, డీఈల రాజ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, ఏఈలు, కన్సల్టెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వంతోనే సమాజ అభివృద్ధి

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అవాంతరాలు లేకుండా స్త్రీ, పురుష సమానత్వంతోనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో 'యాక్సిలరేట్ యాక్షన్' అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రావీణ్య హాజరై మాట్లాడారు. గతంలో బాలబాలికల నిష్పత్తితో పాటు విద్యలోనూ వ్యత్యాసం ఉండేదని, కానీ నేడు తగ్గిపోతూ వస్తోందన్నారు. విద్య, ఉద్యోగం, ఏ రంగంలోనైనా మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు అనేక విధాలుగా హింసలు, అవమానాలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ.. విభిన్న రంగాలలో మహిళలు రాణించినప్పుడే సమాజం ఎదుగుతుందన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ.. బాలబాలికలకు సమాన గౌరవం ఉండాలన్నారు. బాలికలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఈసీ మెంబర్ కె.అనితారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ఉమెన్స్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీధర్ కుమార్‌లోథ్, తిరునహరి శేషు, మహిళ అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యపరంగా శ్రద్ధ వహించాలి

మహిళ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రీడల పోటీలను హనుమకొండ కలెక్టరేట్, టీజీవో భవన్‌లో కలెక్టర్ ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిరంతరం కుటుంబ సభ్యుల క్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఒత్తిడిని జయించడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, అధికారులు రాంరెడ్డి, ఫణికుమార్, అనురాధ, నీరజ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రాజేష్‌కుమార్, మాధవి, శ్రీలక్ష్మీ, శ్రీప్రియ, చేతన హేమలత, కిరణ్మయి, హేమలత, తన్మయి, అరుణ, పవిత్ర, జయంతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలి

సంక్షేమ పథకాల అమలుకు ఉద్యోగులు కృషి చేసి, జిల్లాను అగ్ర భాగాన నిలపాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో టీఎన్జీవో డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న ప్రావీణ్యకు ఈ సందర్భంగా టీఎన్జీవో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ సిటీ క్యాలెండర్, పంచాయతీ కార్యదర్శుల క్యాలెండర్‌లను సైతం కలెక్టర్ ఆవిష్కరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు రామునాయక్, మొయిజ్, లక్ష్మీ ప్రసాద్, హనుమకొండ సిటీ యూనిట్ అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి పృథ్వీ, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి నరేష్, జిల్లా నేతలు రాజమౌళి, సురేష్‌ఖన్నా, రాజ్యలక్ష్మి, సింధూరాణి, పావని, శ్రీలత, గోపి, కిషోర్, రమేష్, రాజీవ్, అశ్విని, శ్రీనివాస్, సుధాకర్, రజిత, నిఖిల్, రఫీ, వెంకన్న పాల్గొన్నారు.



ఘటనాస్థలంలో రవి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

హసన్‌పర్తి/మడికొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన మంగళవారం హసన్‌పర్తి పోలీసు స్టేషన్ పరిధి సుబ్బయ్యపల్లి-ఉనికిచర్ల గ్రామాల మధ్య చోటు చేసుకున్నట్లు హసన్‌పర్తి అడ్మిన్ ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కాజీపేట మండలం టెకులగూడెంకు చెందిన రైతు తొడుగుల రవి (41) వ్యవసాయ ఎరువుల కోసం మంగళవారం ద్విచక్రవాహనంపై సుబ్బయ్యపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో సుబ్బయ్యపల్లి-ఉనికిచర్ల గ్రామాల మధ్య హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఒక కుమారుడు. కూతురు ఉన్నారు. మృతుడి భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ఎమ్మెల్యే నాగరాజు జన్మదిన వేడుకలు



మడికొండలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వడ్డెపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. 56వ డివిజన్‌లోని భంజార కాలనీ వద్ద గల సాయిసేవా ట్రస్టులో 55, 56 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శివరాం, కొంకా హరిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగరాజు జన్మదిన వేడుకలను అనాథ పిల్లలు, వృద్ధులతో కలిసి జరిపారు. కేకు కట్ చేసి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు సోదరుడు కే.ఆర్ కృష్ణమూర్తి, నాగరాజు యువసేన జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి సంపత్, కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు. హనుమకొండ వడ్డెపల్లి ప్రాంతంలోని సహృదయ వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కేకు కట్ చేసి, వృద్ధులు, అనాధలకు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు యాకూబీ చోటు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

● మడికొండ : మడికొండ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు పెనుకుల వినయ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు జరుపుకున్నారు. మెట్టుగుట్ట ఛైర్మన్ పైడిపాల రఘుచందర్, పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: మండలంలోని పలు గ్రామాలలో, డివిజన్‌లలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎర్రగట్టు దేవస్థానంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, గడ్డం శివరాం పాల్గొన్నారు.

హనుమకొండ సిటీ: వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. మంగళవారం సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ కడియం కావ్య, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు కలిసి పూల మొక్కను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

కన్నుల పండువగా రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో శేషభారతి, ఛైర్మన్ రఘు, ధర్మకర్తలు, భక్తులు

మడికొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై తొమ్మిది రోజుల పాటు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం దేవస్థానం ఈవో శేషభారతి, ఛైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో మెట్టురామలింగేశ్వరస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈవో, ఛైర్మన్ స్వామి వారి రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేకంగా అలంకరించిన రథంపైకి చేర్చారు. అనంతరం ఛైర్మన్ రఘుచందర్, ఈవో శేషభారతి మహిళలతో కలిసి కోలాటం ఆడి ఉత్సాహపరిచారు. ఈసందర్భంగా మహిళల కోలాటాలు, పోతరాజుల విన్యాసాలు, చిందు కళాకారుల వేశధారణలు, ఒగ్గు కళాకారుల డప్పుల వాయిద్యాల హోరులో పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు కన్నులపండువగా జరిగింది.

ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఎదురేగి స్వామి వారికి స్వాగతం పలికారు. భక్తి శ్రద్ధలతో కొలిచి ముందుకు సాగనంపారు. అనంతరం దేవస్థానం వారు భక్తులకు ప్రసాద వితరణ గావించారు. రథోత్సవంలో కార్పొరేటర్లు ఆవాల రాధికారెడ్డి, మునిగాల సరోజన, ధర్మకర్తలు బైరి రాజు, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, నాయకులు పొనగోటి వెంకట్రావు, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, గడ్డం మహేందర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. శివపార్వతులు ఊరేగింపు సందర్భంగా స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

'మెడికల్ ఆఫీసర్స్'పై విచారణ

(5వ పేజీ తరువాయి)

విధానంలో చేరారా? ఎవరు రిక్రూట్ చేసుకున్నారు? ఏ ప్రతిపాదికన బీడీఎస్ చేసిన వారిని మెడికల్ ఆఫీసర్‌లుగా తీసుకున్నారు? పర్మినెంట్ చేసే సమయంలో వారి విద్యార్హతలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? లాంటి పలు అంశాలపై ఆరా తీశారు. నిబంధనల ప్రకారం మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంబీబీఎస్‌లు లేదంటే బీఏఎంఎస్‌లు అర్హులు. కానీ, నిబంధనలకు విరుద్ధంగా బీడీ ఎస్ పూర్తి చేసిన దంత వైద్యులను ఎలా మెడికల్ ఆఫీసర్లుగా తీసుకున్నారని ప్రేమ్‌కుమార్ ప్రశ్నించారు. వారితో పాటు హనుమకొండ జిల్లాలో ఎవరెవరు ఎక్కడెక్కడెక్కడ పని చేస్తున్నారని ఆరా తీసినట్లుగా సమాచారం. అయితే 2018కి ముందు హైదరాబాద్ సహ పలు జిల్లాల్లో బీడీఎస్ వైద్యులను మెడికల్ ఆఫీసర్లుగా తీసుకున్నా.. ఆ తరువాత వారందరినీ తొలగించారని, పర్మినెంట్ కూడా ఎక్కడ చేయలేదని విచారణలో పాల్గొన్న మరికొందరు వైద్యులు ప్రేమ్‌కుమార్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఈ విధానం ఉందని తెలిపారు. ఫోకల్ టు నాన్ ఫోకల్, నాన్‌ఫోకల్ టు ఫోకల్ బదిలీల్లో జ రిగిన అవకతవకల గురించి కొందరు వైద్యులు విచారణ అధికారి దృష్టికి తీసు కెళ్లినట్టు తెలుస్తోంది. వీటిపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు వైద్యులకు ప్రేమ్ కుమార్ తెలిపారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోను నియమించిన కలెక్టర్

'ఆంధ్రజ్యోతి' కథనంతో వరంగల్ కలెక్టర్ సత్యశారద కూడా స్పందించారు. గత నెల 21, 22 తేదీల్లో వరుసగా వచ్చిన కథనాలపై స్పందించిన ఆమె.. మెడికల్ ఆఫీసర్లుగా బీడీఎస్‌ల నియామకంపై విచారణకు డిప్యూటీ డీఎంహెచ్‌వో (నర్సంపేట) డాక్టర్ ప్రకాష్ నియమించారు. అయితే డీఎంహెచ్‌వో సాంబశివరావు సెలవులో ఉండటంతో నియామక ఆర్డర్ డాక్టర్ ప్రకాష్‌కు అందలేదని సమాచారం. ఈ నెల 7వ తేదీ వరకు డీఎంహెచ్‌వో సెలవులో ఉన్నారు. డాక్టర్ సాంబశివరావు విధుల్లో చేరిన తరువాతే కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది. దంత వైద్యులను మెడికల్ ఆఫీసర్లుగా నియమించడంతో పాటు ఫోకల్, నాన్‌ఫోకల్ బదిలీల్లో జరిగిన అవకతవకలపై కూడా విచారణ చేయనున్నారు.

ఉన్నతులను స్ఫూర్తిగా తీసుకోవాలి..

హసన్‌పర్తి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి గొప్పగా ఎదిగిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభు త్వ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు ఎన్నంశెట్టి సుమాదేవి అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మండల విద్యాశాఖ అధికారి ఇ.రాజిరెడ్డి, బాలుర ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునితరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాల ఘన చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో బోధనబోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కేయూ ప్లేస్‌మెంట్ కేరీర్ కౌన్సెలింగ్ సెల్ డైరెక్టర్‌గా రాజు

కేయూక్యాంపస్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ప్లేస్‌మెంట్, కేరీర్ కౌన్సెలింగ్ సెల్ కొత్త డైరెక్టర్‌గా డాక్టర్ చిర్రా రాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం రాజుకు నియామక పత్రాన్ని అందచేశారు. చిర్ర రాజు కేయూ తెలుగు విభాగంలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా, కేయూ పాలక మండలి సభ్యుడిగా పనిచేస్తున్నారు. ఏడాది పాటు ప్లేస్‌మెంట్, కేరీర్ కౌన్సెలింగ్ సెల్ డైరెక్టర్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

మడికొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు టీచర్లుగా తరగతుల్లో పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా వర్షిత్, ఉపాధ్యాయులుగా శరణ్య, అద్విత, వైష్ణవి, వసంత, సాద్విక, వేరోనిక, రక్షిత, సన, ప్రణయశ్రీ తమ పాత్రలను పోషించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఆ కదలికలన్నీ హీల్స్‌తోనే వస్తాయి!

ప్రస్తుతం సినిమా ప్రేమికులందరి దృష్టి ఐదు ఆస్కార్లు గెలుచుకున్న అనోరా చిత్రంపైనే ఉంది. ఈ చిత్రంలో ల్యాప్ డ్యాన్సర్ అయిన వేశ్య పాత్ర పోషించిన మైకీ మాడిసన్‌కు ఉత్తమ నటి అవార్డు కూడా దక్కింది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి మాడిసన్ ఒక పత్రికకు ఇచ్చిన ఆసక్తికరమైన ఇంటర్వ్యూ ఇది..



"డ్యాన్సర్లకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉంటుంది. దీనిని పట్టుకుంటేనే పాత్రకు న్యాయం చేయగలుగుతాం. అందుకే ఈ పాత్ర చిత్రీకరణ ముందే నేను అనేక క్లబ్‌లకు వెళ్లాను. అనేక మంది డ్యాన్సర్లను కలిశాను. చాలా మంది డ్యాన్సర్ల నగ్నత్వం గురించి మాట్లాడుతూ ఉంటారు. కానీ నా దృష్టిలో వారికి ఆ నగ్నత్వమే ఒక డ్రెస్సు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు నగ్నంగా నటించాల్సి వచ్చింది. ఆ సీన్లలో ఎంతగా లీనమయిపోయానంటే.. నాకు ఎప్పుడూ నగ్నంగా ఉన్నట్లు అనిపించలేదు. చివరిలో ఒక సన్నివేశం ఉంటుంది. అందులో పూర్తిగా డ్రెస్సు వేసుకొని ఉంటా. అప్పుడు నగ్నంగా ఉన్నట్లు అనిపించింది. ఇక్కడ కాళ్లకు వేసుకొనే హీల్స్ గురించి కూడా చెప్పాలి. డ్యాన్సర్ల జీవితాల్లో ఇవి చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే వారి కదలికలన్నీ ఆ హీల్స్ ద్వారానే వస్తాయి. అంతే కాదు ఈ హీల్స్ వల్ల వారి నడకలో కూడా తేడా వస్తుంది. నాకు ఎప్పటి నుంచో అలాంటి హీల్స్ వేసుకోవాలనిపించేది. ఈ చిత్రం వల్ల నాకు ఆ కోరిక తీరింది.

తక్కువ సినిమాలే..

ఇప్పటి దాకా నేను చాలా తక్కువ సినిమాలు చేశాను. ఎక్కువగా టెలివిజన్ సీరియల్స్‌లో నటించాను. అయితే ఆ సమయంలో కూడా నాకు సినిమాల్లో నటించాలని ఉండేది. ఆ సమయంలో ఒక హారర్ సినిమాలో నటించాను. ఆ సినిమా చూసిన తర్వాత 'అనోరా' చిత్రం నిర్మాతలు నన్ను సంప్రదించారు. కథ వినిపించారు. నా పాత్ర చిత్రీకరణకు రెండున్నర నెలలు పట్టింది. ఈ సినిమాలో అర్మేనియాకు.. రష్యాకు చెందిన అనేక మంది నటీనటులు ఉన్నారు. నాకు ఈ రెండు భాషలు రావు. వారు ఆ భాషల్లో మాట్లాడుతున్నప్పుడు అర్థమయినట్లు నటించేదాన్ని. కొన్ని సీన్లలో నా కళ్ల నుంచి నీళ్లు కారాలి. నాకు చిన్నప్పటి నుంచి ఏడిస్తే ఒక కంటిలో నుంచే నీళ్లు ఎక్కువగా వచ్చేవి. రెండో కంటిలో నుంచి తక్కువగా వచ్చేవి. ఈ సినిమా డైరక్టర్ సీన్ నాకు సన్నివేశం చెప్పి కెమెరా వెనక్కి వెళ్లిపోయేవారు. చిత్రీకరణ మొదలయిన వెంటనే కట్ చెప్పి... 'రెండో కంటిలో నీళ్లు రావటంలేదు" అనేవారు. నాకు రెండో కంటి నుంచి నీళ్లు రావంటే మొదట తను నమ్మలేదు.

ఆ తర్వాత ఆయనకు కూడా అసలు విషయం అర్థమయింది. ఇక సినిమా పూర్తయిన తర్వాత దీనిని అనేక సినిమా ఫెస్టివల్స్‌లో ప్రదర్శించారు. దీనిలో కాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. కాన్స్ ఫెస్టివల్‌లో ఒక నటిగా పాల్గొనాలనేది నా చిన్ననాటి కోరిక. ఆ కోరిక ఈ చిత్రంతో తీరింది. థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి చూడటం.. వాళ్లు చప్పట్లు కొడుతుంటే ఆనందించటం.. మరపురాని అనుభవాలు.

మృదువైన చేతుల కోసం...

మహిళలు నిత్యం ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు. దీనివల్ల వారి చేతులు గరుకుగా మారుతుంటాయి. ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించి చేతులను మృదువుగా మార్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- రోజూ రాత్రి పడుకునేముందు చేతులకు మాయిశ్చరైజర్ రాసుకుంటూ ఉండాలి. షియా బటర్, కొబ్బరినూనె, ఇ విటమిన్ నూనెల్లో ఒకటి ఉన్న మాయిశ్చరైజర్ అయితే ప్రభావవంతంగా పనిచేస్తుంది.
- వెడల్పాటి గిన్నెలో మూడు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు పోసి అందులో రెండు చెంచాలు ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి. ఈ నీళ్లలో పావుగంటసేపు చేతులు నాననివ్వాలి. తరవాత చేతులను ఒకదానితో మరోదానిని రుద్ది మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే చేతుల గరుకుదనం పోతుంది.
- చేతులను నీటితో తడిపి వాటిపై కొద్దిగా పంచదార లేదా కాఫీ పొడి వేసి బాగా రుద్దితే మృతకణాలన్నీ తొలగిపోతాయి. ఇలా రాళ్ల ఉప్పుతో చేసినా మంచి ఫలితం ఉంటుంది.




- పాత్రలు తోమడానికి, బట్టలు ఉతకడానికి ఉపయోగించే లిక్విడ్ సోప్‌లు, డిష్‌వాష్ బార్‌లు, ఇతర డిటర్జెంట్‌ల వల్ల చేతులకు హాని కలుగుతుంది. కాబట్టి ఆ పనులు చేసేటప్పుడు చేతులకు గ్లోవ్స్ వేసుకోవడం మంచిది.
- నీటి శాతం ఎక్కువగా ఉన్న తాజా పండ్లను తింటూ తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి. దీనివల్ల చర్మం తేమతో నిండి చేతులు మృదువుగా మారతాయి.

బాల్కనీలో మొక్కలు కనువిందుగా...

కొంతమంది ఇళ్లలో బాల్కనీ చాలా చిన్నగా ఉంటుంది. అయినప్పటికీ ఉన్న స్థలంలోనే వీలైనన్ని ఎక్కువ మొక్కలను ఎలా పెంచాలో తెలుసుకుందాం.

- బాల్కనీలో గోడవారగా స్టాండ్లను ఒకదానిపై మరోటి ఏర్పాటు చేసి వాటి మీద చిన్న కుండీలను అమర్చి వర్టికల్ గార్డెన్‌ని పెంచవచ్చు. ఇది చూడడానికి చాలా అందంగా కనిపిస్తుంది.
- బాల్కనీలో వేలాడే కుండీలను ఏర్పాటు చేసుకున్నా అహ్లాదకరంగా అనిపిస్తుంది. బరువు తక్కువగా ఉండే కుండీలను ఎంచుకుని వాటిలో తేలికపాటి పూల మొక్కలు పెంచితే బాల్కనీ ఆకర్షణీయంగా ఉంటుంది.
- బాల్కనీలో ఉన్న స్థలాన్ని పరిగణనలోకి తీసుకుంటూ కుండీల సైజుని నిర్ణయించుకోవాలి. వంకాయ, కాకర, దొండ, బీర, టమాటా, చిక్కుడు, దోస లాంటి కూరగాయలతోపాటు పచ్చిమిర్చి, కరివేపాకు, ఆయుర్వేద మొక్కలను సైతం కుండీల్లో సులభంగా పెంచవచ్చు.



- ఇంట్లో వాడకుండా పక్కన పెట్టిన స్టూల్, బెంచీ, చిన్న టేబుల్ లాంటివాటిని బాల్కనీలో అందంగా అమర్చి వాటిపై కుండీలను పెడితే బాగుంటుంది.
- చిన్న కుండీల్లో తక్కువ మట్టి ఉన్నప్పటికీ విరివిగా పెరిగే మొక్కలను ఎంచుకుంటే బాల్కనీ చిన్న తోటలా కనిపిస్తుంది.
- రంగు రంగుల పూలు, ఆకు కూరలు, తీగలాగా పాకే కూరగాయల మొక్కలను పెంచితే బాల్కనీ కనువిందుగా ఉంటుంది.

సంకల్పం



సైన్స్ అంటే చిన్నప్పటి నుంచి ఆసక్తి. అందుకే... ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు వచ్చినా... కోరిమరీ వాతావరణ శాఖను ఎంచుకున్నారు. సీనియర్ అబ్జర్వర్‌గా ప్రస్థానం మొదలుపెట్టి... నేడు ఆ శాఖ దక్షిణభారత కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మేనేజర్ (డీడీజీఎం) స్థాయికి ఎదిగారు. ఈ పదవిని అలంకరించిన తొలి మహిళగా రికార్డులుకెక్కారు. మూడు దశాబ్దాలకు పైగా వాతావరణ శాఖలో సేవలు అందిస్తూ... డీడీజీఎంగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సైంటిస్ట్-ఎఫ్, డాక్టర్ బి.అముదను 'నవ్య' పలుకరించింది.

అది పెద్ద సవాలు

"మాది తెలుగు వ్యవసాయ కుటుంబం. మా ముత్తాతల మూలాలు ఆంధ్రాలో ఉన్నాయి. అమ్మ సరస్వతి, నాన్న భక్తవత్సలు. మేం ముగ్గురం సంతానం. నాన్న మొదట్లో వేలూరు జిల్లా పల్లికొండలో టీచర్‌గా, ఆ తరువాత 1971లో చెన్నైలోని పచ్చయప్పాస్ కళాశాల ప్రొఫెసర్‌గా పని చేశారు. దాంతో నా బాల్యం, విద్యాభ్యాసం అంతా ఇక్కడే గడిచిపోయాయి. నేను 'క్వీన్ మేరీస్ కళాశాల'లో బీఎస్సీ, ఎంఎస్సీ ఫిజిక్స్ చేశాను. ఎంఎస్సీలో గోల్డ్ మెడలిస్ట్‌ను. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనేది నాన్న ఆకాంక్ష. అందుకు అనుగుణంగానే నా బీఎస్సీ కాగానే ప్రభుత్వ ఉద్యోగం కోసం రకరకాల పరీక్షలు రాయించేవారు. ఇన్‌కంట్యాక్స్, ఎల్ఐసీ, వాతావరణశాఖ, ఇంకా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు వచ్చాయి.

వాతావరణశాఖనే ఎంచుకున్నా...

నేను చేసింది బీఎస్సీ ఫిజిక్స్ కాబట్టి అందుకు తగిన ఉద్యోగం వాతావరణ శాఖలో ఉంటుందని, భవిష్యత్తు కూడా బాగుంటుందని పెద్దలు చెప్పారు. అందుకే వాతావరణ శాఖను ఎంచుకున్నాను. 1991 ఏప్రిల్‌లో సీనియర్ అబ్జర్వర్‌గా ఉద్యోగంలో చేరాను. ఎంఎస్సీ అయ్యాక డిపార్ట్‌మెంటల్ పరీక్ష రాశాను. అందులో ఆలిండియా మొదటి ర్యాంకు వచ్చింది. దాంతో 1997లో సైంటిఫిక్ అసిస్టెంట్‌ను అయ్యాను. కొన్నాళ్లకు యూపీఎస్సీ రాసి, మెట్ గ్రేడ్-2 అయ్యాను. ఏడాది ట్రెయినింగ్ పూర్తయ్యాక పుణేలో పోస్టింగ్ ఇచ్చారు. అక్కడే ఐదున్నరేళ్లపాటు పని చేశాను. అయితే సొంతూరుపై ఉన్న అభిమానం, అమ్మానాన్నలకు దగ్గరగా ఉండాలన్న ఉద్దేశంతో బదిలీపై చెన్నైకి వచ్చాను. అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తున్నాను. 2020 కొవిడ్ కాలంలో ఏవియేషన్ హెడ్‌గా పని చేశాను. ఆ సమయంలో మిషనరీని ఆధునీకరించడంతో పాటు అప్‌గ్రేడ్ చేసే అవకాశం వచ్చింది.

డాక్టరేట్ నా కల...

పీహెచ్‌డీ చేయాలనేది నా కల. పుణేలో ఉన్నప్పుడే ఆ ప్రయత్నం చేశాను. కానీ చెన్నై వచ్చాక కానీ అది ఫలించలేదు. 2018లో పీహెచ్‌డీ పూర్తి చేశాను. యాభయ్యేళ్ల ప్రాయంలో డాక్టరేట్ అందుకున్నాను. 1999లో బీఎల్ పట్టా పొందాను. 19 జర్నల్స్‌లో నా పరిశోధనా పత్రాలు ముద్రితమయ్యాయి. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నాను.

2008లో పుణెలో ఉండగా 'ఎక్సలెన్స్ ఫర్ ఔట్‌స్టాండింగ్ పెర్ఫామెన్స్' అవార్డు, 2011లో ఐఎండీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గ్రూప్1 ఆఫీసర్స్ విభాగంలో ఉత్తమ ఉద్యోగిగా అవార్డు, 2016లో ప్రపంచ వాతావరణ సంస్థ నుంచి 'ప్రొఫెసర్ విల్హో వైశాల' అవార్డు వచ్చాయి. 'అల్టర్‌నేటివ్స్ ఫర్ డేంజరస్ అండ్ అబ్సలేట్ ఇన్‌స్ట్రుమెంట్స్' (ప్రమాదకరమైన మరియు వాడుకలో లేని పరికరాలకు ప్రత్యామ్నాయాలు) అనే అంశంపై నేను చేసిన కృషికి గుర్తుగా ప్రొఫెసర్ విల్హో వైశాల అవార్డు ప్రదానం చేశారు. దేశంలోనే వాతావరణ శాఖలో ఈ అవార్డు స్వీకరించిన తొలి సైంటిస్ట్‌ని నేనే. 2003-2008 కాలంలో పుణే రీజన్‌లో ఉండగా 550 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల కమిషన్‌కు ప్రాజెక్టు డైరెక్టర్‌గా వ్యవహరించడం సవాలుతో కూడుకున్నది.

> **ప్రపంచ వాతావరణ సంస్థలో...**
>
> ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) నిపుణుల బృందంలో సభ్యురాలిగా నాకు మూడు అసైన్‌మెంట్లు అప్పగించారు. విధుల్లో భాగంగా ఓ ప్రాజెక్టు కోసం 2006 అమెరికాలోని వర్జీనియాకు, 2013లో కెన్యాకు, 'ప్రొఫెసర్ విల్హో వైశాల' అవార్డు స్వీకరణకు 2016లో స్పెయిన్‌కు వెళ్లాను.

ధైర్యంగా రావచ్చు...

వాతావరణశాఖలోకి మహిళలు ధైర్యంగా రావచ్చు. ఈ శాఖలో మాకన్నా ముందు ఉద్యోగాల్లో చేరిన వారు రోస్టర్ డ్యూటీలు కూడా చేసేవారు. 1970ల నుంచే మహిళలు విమానాశ్రయాల్లోని కార్యాలయాల్లో నైట్ డ్యూటీలు కూడా చేసేవారు. అయితే ఇప్పుడు మహిళలకు జనరల్ డ్యూటీలు వేస్తున్నారు. మా విభాగంలో మహిళలకు ఎంతో ప్రోత్సాహం ఉంటుంది. సంస్థ తరుపున అంటార్కిటికా వెళ్లేందుకు చాలామంది మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అక్కడ ఏడాది పాటు విధులు నిర్వర్తించాలి. అలాగే పలు దీవుల్లో పని చేసేందుకు కూడా ఇప్పుడు మహిళా ఉద్యోగులు ముందుకు వస్తున్నారు. ఇది శుభ పరిణామం.

సవాళ్లు ఎదురైనా...

నేను ఇన్‌స్టలేషన్, ఏవియేషన్ విభాగాల్లో కూడా పని చేశాను. విమానాలు ల్యాండ్ అవ్వాలన్నా, టేకాఫ్ అవ్వాలన్నా ముందుగా వాతావరణ శాఖ నుంచి క్లియరెన్స్ అడుగుతారు. మనం ఏమాత్రం పొరపాటుగా నివేదిక ఇచ్చినా, కోట్లాది రూపాయలతో పాటు ఎంతో ప్రాణనష్టం జరుగుతుంది. అక్కడ బాధ్యతలు నిర్వర్తించడం సవాలుతో కూడుకున్నది. అలాంటి ఏవియేషన్‌కు నేను మూడేళ్లపాటు నేతృత్వం వహించాను. నాకు అప్పగించిన ఏ పని అయినా, ప్రాజెక్టు అయినా కష్టంగా భావించలేదు. అదంతా ఒక శిక్షణలా అనుకున్నాను.

ప్రకృతిని అంచనా వేయడం కష్టం...

సైక్లోన్ మూమెంట్‌ని బట్టి ఫలానా చోట తీరం దాటుతుందని సాంకేతికత సాయంతో ఇప్పటి వరకూ చెబుతున్నాం. రాడార్, శాటిలైట్ల సాయంతో సైక్లోన్‌ను అంచనా వేసి, ఆ సమాచారాన్ని ప్రజలకు చేరవేయగలుగుతున్నాం. సముద్రంలో జరిగే పరిణామాలు, మార్పులను అంచనా వేయడం పెద్ద సవాలు. ఒక్కోసారి తుఫాను సముద్రంలో రాత్రిపూట వేగంగా పయనిస్తుంది. ఒక్కోసారి ఆరు గంటల పాటు ఒకేచోట ఆగిపోతుంది. లేదంటే నెమ్మదిగా పయనిస్తుంది. ఎందుకిలా జరుగుతుందన్నదానిని అంచనా వేయడానికి రకరకాలుగా ప్రయత్నిస్తున్నాం. మన దేశంలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. అందువల్ల వాటిని అంచనా వేయడం క్లిష్టతరమైన పని. అందుకే కొన్నిసార్లు అంచనాలు తలకిందులవుతాయి. దేశ వ్యాప్తంగా 39 రాడార్లు ఉన్నాయి. ఒక్కో రాడార్ ఏర్పాటుకు రూ.25 కోట్లు ఖర్చవుతుంది. రాడార్ల సంకేతాలను అంచనా వేసి కచ్చితమైన సమాచారం అందించేందుకు వాతావరణశాఖ శాయాశక్తులా ప్రయత్నిస్తోంది. చాలామంది విదేశాల్లో అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారని అడుగుతుంటారు. కానీ అక్కడా తుఫానులను అంచనా వేయడంలో సవాళ్లు ఉంటాయి. వాతావరణ స్థితిగతుల్లో వారికి, మనకు చాలా వ్యత్యాసం ఉంది.

ఎప్పుడూ అనుకోలేదు...

ఎంతో ఘన చరిత్ర గల చెన్నైలోని వాతావరణ కేంద్రం దక్షిణ భారత డీడీజీఎం అవడం, అందులోనూ ఈ పదివిని చేపట్టిన తొలి మహిళను నేనే కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పదవి నన్ను వరిస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. నాకు అప్పగించిన బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాను. అంతేకాదు... నా సాధారణ విధులతో పాటు 'ఆర్ఎంసీ చెన్నై' హెడ్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నాను. ఏదిఏమైనా ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసి ఎంతోమంది ప్రాణాలను రక్షించే వాతావరణ శాఖలో పని చేయడం నాకు ఎంతో గర్వంగా ఉంది."

• డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటో: కర్రి శ్రీనివాస్

విజయానికి మార్గం

ఏ పనిలోనైనా విజయం సాధించాలనే ప్రతిఒక్కరూ కోరుకుంటారు. క్రమశిక్షణతోపాటు ఆరోగ్యకరమైన దినచర్యను పాటిస్తూ ఉంటే విజయం వెన్నంటి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

- ఉదయం నిద్రలేచింది మొదలు ప్రతి నిమిషాన్నీ సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. పోషకాహారం తీసుకుంటూ మంచి అలవాట్లు అలవరచుకుంటే మెదడు సరైన రీతిలో పనిచేసి విజయపథం వైపు నడిపిస్తుంది.
- ఏ రోజు చేయాల్సిన పనిని ఆ రోజే పూర్తిచేస్తే మనసు ఉత్సాహంగా ఉంటుంది. ప్రతి పనికీ ఒక ప్రణాళికను రూపొందించుకోవడం మంచిది.
- తక్షణమే పూర్తిచేయాల్సిన ముఖ్యమైన పనులకు ముందుగా సమయం కేటాయించాలి. మిగిలినవాటి గురించి అతిగా ఆలోచించాల్సిన పని లేదు.
- నిరంతరం కొత్త అంశాల గురించి తెలుసుకుంటూ ఉండాలి. తోటివారితో సంభాషిస్తూ ఎప్పటికప్పుడు పరిచయాలు పెంచుకుంటూ ఉంటే కొత్త అవకాశాలు తలుపుతడతాయి.
- కేవలం కష్టపడే మనస్తత్వం ఉంటే చాలదు. సమయపాలన పాటిస్తూ ముందుచూపుతో మసలుకుంటే విజయం చేతికందుతుంది.



- శారీరక-మానసిక విశ్రాంతి, వ్యాయామం, ప్రశాంతంగా ఆలోచించడం వల్ల కూడా విజయం సిద్ధిస్తుంది. ఉద్యోగవ్యాపారాలను, జీవితాన్ని సమతూకంలో నిర్వహించగలగాలి.
- చాలామందికి సవాళ్లను స్వీకరించడం ఇష్టం ఉండదు. అవి ఎదురైనప్పుడు వెనకడుగు వేస్తుంటారు. అలాకాకుండా సమస్యలకు ఎదురు వెళ్లి వాటిని పరిష్కరించగలిగే సామర్థ్యాన్ని పెంచుకుంటే విజయం దక్కుతుంది.
- మానసిక ఉద్వేగాలను నియంత్రించుకోవడంతోపాటు చుట్టూ ఉన్న పరిస్థితులను అవగాహన చేసుకుంటూ, జాగరూకతతో వ్యవహరిస్తూ ముందుకు సాగగల్గితే విజయం సాధించడం ఏమంత కష్టం కాదు.

ఫ్యాషన్



ఫ్రగ్స్‌తో కొత్త లుక్

'ఎప్పుడూ అవే కుర్తీలు, అవే లెహంగాలు, అవే చీరలు. కొత్తదనమే లేదా?' అని కంగారు పడిపోవలసిన అవసరం లేదు. ఎలాంటి దుస్తులు ధరించినా, వాటికి కొత్త ఆకర్షణ చేకూరాలంటే, అదనంగా 'ష్రగ్స్' ఎంచుకోవాలి. వాటినెలా ధరించాలో, ఎలా మ్యాచ్ చేయాలో తెలుసుకుందాం!

రోజు వేసుకునే దుస్తులైనా, వేడుకల కోసం ధరించే దుస్తులైనా అదనపు హంగులు జోడించడం కోసం ష్రగ్స్‌ను ఎంచుకోవచ్చు. ఎలాంటి దుస్తులకైనా ఆధునిక సొబగును అద్దే ఒకప్పటి ష్రగ్స్ ఫ్యాషన్ మళ్లీ ఊపందుకుంది. వైవిధ్యభరితంగా కనిపించడంతో పాటు అన్ని వయసులవారికీ, అన్ని రకాల దుస్తులకు నప్పడం ష్రగ్స్ ప్రత్యేకత. కాబట్టే వీటి పట్ల సర్వత్రా ఆదరణ పెరుగుతోంది.

మ్యాచింగ్ ఇలా...

పొడవాటి ష్రగ్స్‌ను జీన్స్, టీషర్ట్‌కు జతగా ధరించవచ్చు. లాంగ్‌ఫ్రాక్‌తో మ్యాచ్ చేయవచ్చు. గౌన్స్, ఫ్రాక్స్‌తో కలిపి కూడా వేసుకోవచ్చు. అయితే ఆ రెండు రకాల దుస్తుల రంగులూ మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి. పూర్తి భిన్నమైన రంగుల్లో ఉండకుండా, రంగు, డిజైన్ల పరంగా, రెండూ దగ్గరి పోలికలు కలిగి ఉండేలా చూసుకోవాలి. హైహీల్స్, స్లింగ్ బ్యాగ్ లాంటి అదనపు హంగులు కూడా జోడిస్తే ష్రగ్స్‌లో, రెట్టింపు స్టైల్‌తో అదరగొట్టేయవచ్చు.


ఇలా ఎంచుకోవాలి

ష్రగ్‌ను ఎంచుకునేటప్పుడు సమయం, సందర్భం దృష్టిలో పెట్టుకోవాలి. సరదాగా షికారుకెళ్లేటప్పుడు వేసుకునే ష్రగ్స్‌కూ, సాయంకాలను వేడుకల్లో ధరించే ష్రగ్స్‌కూ వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. అందుకోసం సాదాసీదా కాటన్ ష్రగ్స్ మొదలు సెక్విన్స్‌తో మెరుపులు చిందించే భారీ ష్రగ్స్ అందుబాటులో ఉంటున్నాయి. వాటిలో నప్పే ష్రగ్ ఎంచుకోవాలి. అలాగే శాటిన్, స్పన్‌తో తయారయ్యే ష్రగ్స్ పార్టీలకూ, కాటన్, రెయాన్‌లతో తయారయ్యే ష్రగ్స్ డైలీ వేర్‌కూ బాగుంటాయి.



రిలయన్స్‌కు డబుల్ షాక్

- కంపెనీకి ప్రభుత్వం 2 నోటీసులు జారీ
- ఓఎన్‌జీసీ గ్యాస్‌ను తరలించుకున్నందుకు రూ.24,500 కోట్లు కట్టాలని ఆదేశాలు
- నిర్దేశిత గడువులోగా బ్యాటరీ సెల్ ప్లాంట్ ఏర్పాటు చేయనందుకు రూ.3 కోట్ల పెనాల్టీ



న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)కు ఒకేసారి రెండు షాక్‌లు తగిలాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కేజీ బేసిన్‌లో ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి చెందిన క్షేత్రాల నుంచి అక్రమంగా గ్యాస్ (సహజవాయువు) ఉత్పత్తి చేసుకున్నందుకు గాను 281 కోట్ల డాలర్లు (దాదాపు రూ.24,500 కోట్లు) చెల్లించాలని రిలయన్స్‌కు మోదీ సర్కారు డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేకాదు, నిర్దేశిత గడువులోగా బ్యాటరీ సెల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయలేకపోయినందుకు గాను ఆర్ఐఎల్ అనుబంధ విభాగమైన రిలయన్స్ న్యూ ఎనర్జీ బ్యాటరీ స్టోరేజ్ లిమిటెడ్‌పై భారీ పెనాల్టీని సైతం విధించింది. కేజీ బేసిన్ డీ6 బ్లాక్‌లో రిలయన్స్, దాని భాగస్వామి బీపీ సహజవాయువు, ఇంధన నిక్షేపాల క్షేత్రాలను కలిగి ఉన్న విషయం తెలిసిందే. రిలయన్స్ తన నిల్వలకు పక్కనే ఉన్న ఓఎన్‌జీసీ క్షేత్రాల నుంచి కూడా గ్యాస్‌ను అక్రమంగా తరలించుకోవడంతో పాటు వెలికి తీసి, విక్రయించుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంది. కాగా, ఈ కేసులో రిలయన్స్‌కు అనుకూలంగా అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు (ఆర్బిట్రేషనల్ ట్రైబ్యునల్) ఇచ్చిన తీర్పును ఢిల్లీ హైకోర్టు గత నెల 14న తోసిపుచ్చింది. దాంతో రిలయన్స్‌తో పాటు దాని భాగస్వాములైన బీపీ, నికో లిమిటెడ్‌కు పెట్రోలియం మంత్రిత్వ శాఖ నష్టపరిహారం చెల్లించాలంటూ తాజాగా డిమాండ్ నోటీసు జారీ చేసింది.

అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ విభాగం కోసం ప్రకటించిన ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకంలో భాగంగా 5 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్ మొదటి మైలురాయిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయలేకపోయినందుకు గాను పెనాల్టీ విధిస్తున్నట్లు రిలయన్స్ న్యూ ఎనర్జీకి భారీ పరిశ్రమల శాఖ ఈ నెల 3న నోటీసు పంపింది. ఈ జనవరి 1 నుంచి ఆలస్యమైన ప్రతి రోజుకు రూ.50 కోట్ల పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీలో రోజుకు 0.1 శాతం చొప్పున జరిమానా విధిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇప్పటివరకు పెనాల్టీ మొత్తం రూ.3.1 కోట్లకు చేరుకుంది.

తయారీ, ఎగుమతుల ప్రోత్సాహానికి

రెండు కొత్త కార్యక్రమాలు

పారిశ్రామికవేత్తలతో ప్రధాని మోదీ



ముంబై/న్యూఢిల్లీ: ప్రపంచం యావత్తు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ వైపు ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో ప్రపంచ స్థాయిలో అందుబాటులోకి వస్తున్న అవకాశాలు అందిపుచ్చుకునేందుకు సంసిద్ధం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పారిశ్రామిక రంగానికి పిలుపు ఇచ్చారు. తయారీ, ఎగుమతి రంగాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రెండు కొత్త మిషన్లు (కార్యక్రమాలు) ప్రారంభించబోతున్నట్టు ఆయన చెప్పారు. పారిశ్రామిక రంగ ప్రతినిధులతో బడ్జెట్ అనంతర వెబినార్‌లో నియంత్రణలు, పెట్టుబడులు, వ్యాపార సరళీకరణ సంస్కరణలపై ప్రధాని మాట్లాడారు. మెరుగైన టెక్నాలజీ, ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ప్రపంచ డిమాండుకు దీటుగా వారికి అవసరమైన కొత్త ఉత్పత్తులను గుర్తించాలని పరిశ్రమకు ఆయన సూచించారు. నూతన ప్రపంచ డిమాండును తీర్చగల సామర్థ్యం భారత పరిశ్రమకున్నదని ఆయన అన్నారు. ఎన్నో సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి నిలిచి భారత్ నేడు ప్రపంచ వృద్ధికి చోదకశక్తిగా మారిందని ఆయన పేర్కొన్నారు. నేడు ప్రతి దేశం భారత్‌తో ఆర్థిక భాగస్వామ్యం పటిష్ఠం చేసుకోవాలనుకుంటున్న కారణంగా ఆ అవకాశాన్ని చక్కగా వినియోగించుకోవాలని పారిశ్రామిక రంగానికి సూచించారు. స్థిరమైన విధానాలు, సంస్కరణల పట్ల చిత్తశుద్ధి కారణంగా పరిశ్రమకు ప్రభుత్వంపై కొత్త విశ్వాసం ఏర్పడిందని చెప్పారు.

ఎంఎస్ఎంఈలకు కొత్త రుణ విధానాలు: దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రలకు (ఎంఎస్ఎంఈ) తక్కువ వడ్డీపై సకాలంలో రుణాలందించేందుకు కొత్త విధానాలు అందుబాటులోకి రావలసిన అవసరం ఉన్నదని ప్రధాని నొక్కి చెప్పారు. తొలిసారిగా పారిశ్రామికవేత్తలవుతున్న మహిళలు, ఎస్‌సీ, ఎస్‌టీ ఆంత్రపెన్యూర్లకు రూ.2 కోట్ల వరకు రుణాలు అందించనున్నట్టు తెలిపారు. ఎంఎస్ఎంఈలకు రుణాలందించినంత మాత్రాన చాలదని, చక్కని మార్గదర్శకత్వం కూడా కావాలని పేర్కొంటూ వారికి అవసరం అయిన మెంటార్‌షిప్ కార్యక్రమాలు రూపొందించాల్సిందిగా పారిశ్రామిక రంగ ప్రతినిధులకు పిలుపు ఇచ్చారు. తాము జన్‌విశ్వాస్ 2.0 బిల్లును ప్రవేశపెట్టనున్నామంటూ ఆర్థికేతర నియంత్రణలపై సమీక్షకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు ప్రధాని చెప్పారు. నియంత్రణలేవైనా ఆధునికం, అనుసరణీయంగాను, విశ్వసనీయత పెంచేవిగాను ఉండాలని వ్యాఖ్యానించారు.

రాష్ట్రాలు కూడా సంస్కరణలు చేపట్టాలి: రాష్ట్రాలు కూడా వ్యాపార సరళీకరణకు సంస్కరణలు చేపట్టాలని, అప్పుడు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ప్రధాని సూచించారు. రాష్ట్రాలు పరస్పర పోటీ సామర్థ్యం పెంచుకుని ప్రగతిశీలక విధానాలతో ముందుకు వచ్చినట్టయితే పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రాలుగా కంపెనీలు వాటిని ఎంచుకుంటాయని అన్నారు.

సకాలంలోనే వేతన పెంపు

కాగ్నిజెంట్

న్యూఢిల్లీ: న్యూజెర్సీ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న కాగ్నిజెంట్ ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా సకాలంలోనే మెరిట్ ఆధారంగా అర్హులైన ఉద్యోగులకు వేతనాల పెంపు ఉంటుందని ప్రకటించింది. ఈ ఏడాది కంపెనీలో వేతనాల పెంపు జాప్యం అవుతుందంటూ వచ్చిన వార్తలను కంపెనీ ఖండించింది. గత ఆగస్టులో తాము వేతనాలు పెంచామని, సరిగ్గా ఏడాది కాలానికి అంటే వచ్చే ఆగస్టులో వేతనాల పెంపు ఉంటుందని తెలిపింది. అలాగే మార్చి నెల మధ్యలో అర్హులైన వారందరికీ బోనస్ కూడా చెల్లిస్తామని ప్రకటించింది. ఇందుకు భిన్నంగా ఎవరు ఎలాంటి ప్రచారం చేసినా అందులో ఇసుమంత వాస్తవం కూడా ఉండదని స్పష్టం చేసింది.

అయాన్ బీమ్‌తో అపోలో జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): క్యాన్సర్ చికిత్సకు ప్రోటాన్ బీమ్ థెరపీ సొల్యూషన్లు అందించేందుకు అయాన్ బీమ్ అప్లికేషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు అపోలో హాస్పిటల్స్ ప్రకటించింది. దీని కింద దేశంలో ప్రోటియస్ వన్ సిస్టమ్‌ను ప్రవేశపెడతారు. దీనివల్ల ప్రోటాన్ థెరపీలో తమ స్థానం మరింత సుస్థిరం అవుతుందని తెలిపింది.

నిఫ్టీకి నష్టాల దశమి

- 1996లో ప్రారంభమైన సూచీకి అత్యంత సుదీర్ఘ వరుస నష్టమిదే..
- 73,000 దిగువ స్థాయికి సెన్సెక్స్

ముంబై: సుంకాల యుద్ధం మరింత తీవ్రతరం కావడంతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ కారణంగా స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం మరింత నష్టపోయాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 452 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్. చివరికి 96.01 పాయింట్ల నష్టంతో 72,989.93 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ నష్టపోవడం వరుసగా ఇది మూడో రోజు. ఆరంభ ట్రేడింగ్‌లోనే 22,000 దిగువ స్థాయికి పడిపోయిన నిఫ్టీ.. మళ్లీ కాస్త కుదురుకుని, చివరికి 36.65 పాయింట్ల నష్టంతో 22,082.65 వద్ద ముగిసింది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది పదో రోజు.

అంతేకాదు, 1996లో ప్రారంభమైన అయిన నిఫ్టీకి దాదాపు మూడు దశాబ్దాల్లో ఇదే అత్యంత సుదీర్ఘ వరుస నష్టం కూడా. గడిచిన 10 ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 4 శాతం క్షీణించింది. గత ఏడాది సెప్టెంబరులో నమోదైన ఆల్‌టైం రికార్డు స్థాయితో పోలిస్తే 16 శాతం పతనమైంది.

నిఫ్టీ 50 డెరివేటివ్స్ మంత్లీ ఎక్స్‌పైరీ సోమవారానికి మార్పు

ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ)లో ట్రేడింగ్ నిర్వహించే వారికి గమనిక. నిఫ్టీ 50 మంత్లీ డెరివేటివ్ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ రోజును నెలలో చివరి గురువారం నుంచి చివరి సోమవారానికి మారుస్తున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) వెల్లడించింది. ఏప్రిల్ 4 నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది.

యూఎస్ మార్కెట్లు విలవిల

అమెరికా, దాని కీలక వాణిజ్య భాగస్వాముల మధ్య పరస్పర సుంకాల పోరు మరింత తీవ్రమవడంతో యూఎస్ స్టాక్ మార్కెట్లు విలవిల్లాడుతున్నాయి. మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో డౌజోన్స్ 700 పాయింట్లకు పైగా నష్టపోగా.. ఎస్ అండ్ పీ, నాస్‌డాక్ 1.75 శాతం వరకు క్షీణించాయి.

2 నెలల్లో ఎల్ఐసీకి రూ.1.50 లక్షల కోట్ల నష్టం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ.. దేశంలోనే అతిపెద్ద సంస్థాగత ఇన్వెస్టర్ కూడా. పాలసీదారుల నుంచి ప్రీమియం రూపంలో సేకరించిన సొమ్ములో కొంత భాగాన్ని కంపెనీ స్టాక్ మార్కెట్లోనూ పెట్టుబడిగా పెడుతుంది. మార్కెట్ పతనం కారణంగా ఈ ఏడాదిలో గడిచిన రెండు నెలల్లో ఎల్ఐసీకి ఏకంగా రూ.1.45 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. గత ఏడాది డిసెంబరు చివరి నాటికి, ఎల్ఐసీ ఈక్విటీ పెట్టుబడుల మొత్తం విలువ రూ.14.9 లక్షల కోట్లు కాగా.. ఈ ఫిబ్రవరి చివరినాటికి రూ.13.4 లక్షల కోట్లకు తగ్గింది.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ



హైదరాబాద్	410	విజయవాడ	430
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	463	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	101
వరంగల్	100	గుంటూరు	101
కరీంనగర్	100	ఒంగోలు	101
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	94
కర్నూలు	100	నెల్లూరు	99
విశాఖపట్నం	100	అనంతపురం	99
గోదావరి	101		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,380 ▲	80,100 ▲	1,07,000 ▲
విజయవాడ	89,400 ▲	84,000 ▲	98,000 ▲
విశాఖపట్నం	86,460 ▲	79,260 ▲	96,570 ▲
రాజమండ్రి	87,700 ▲	80,100 ▲	97,700 ▲
ప్రొద్దుటూరు	87,800 ▲	81,300 ▲	97,500 ▲
ముంబై	86,432 ▲	79,172 ▲	95,293 ▲

మసాలాల తయారీలోకి

జెమినీ ఎడిబుల్స్

శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్‌తో జేవీ ఏర్పాటు

చెన్నై: ఫ్రీడమ్ బ్రాండ్ నేమ్‌తో వంట నూనెలు విక్రయిస్తున్న హైదరాబాద్ కంపెనీ 'జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా' తాజాగా మసాలా ఉత్పత్తుల తయారీ, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇందుకోసం కోయంబత్తూరుకు చెందిన శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్‌తో కలిసి జీఈఎఫ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో జాయింట్ వెంచర్ (జేవీ)ను ఏర్పాటు చేసినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ జేవీలో ఇప్పటికే రూ.70 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్లు జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి తెలిపారు. ఈ జేవీ ద్వారా భవిష్యత్‌లో ప్లాంట్ ఏర్పాటు కోసం వచ్చే రెండేళ్లలో మరో రూ.50 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఈ భాగస్వామ్య సంస్థ తొలి ఏడాదిలోనే రూ.100 కోట్ల ఆదాయాన్ని చేరుకోగలదని భావిస్తున్నామని అన్నారు. వచ్చే ఐదేళ్లలో రెవెన్యూను రూ.1,000 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తమిళనాడుకు పరిమితమైన అన్నపూర్ణ మసాలా ఉత్పత్తులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ మార్కెట్లకు సైతం విస్తరించనున్నట్లు వెల్లడించారు.

ఏపీలో మసాలా తయారీ ప్లాంట్: రోజుకు వంద టన్నుల తయారీ సామర్థ్యంతో కూడిన ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ విజయ్ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం కంపెనీ కోయంబత్తూరులో రోజుకు 30 టన్నుల తయారీ సామర్థ్యంతో కూడిన ప్లాంట్‌ను కలిగి ఉంది.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల స్మార్ట్ ఏసీల విక్రయం

- మార్కెట్లోకి 150 కొత్త మోడళ్ల విడుదల
- బ్లూస్టార్ ఇండియా ఎండీ త్యాగరాజన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్లూస్టార్ లిమిటెడ్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 5 లక్షల స్మార్ట్ ఏసీలను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశవ్యాప్తంగా స్మార్ట్ ఏసీలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని, అందుకు తగ్గట్టుగానే కొత్త ఫీచర్లతో మార్కెట్లోకి సరికొత్త ఎయిర్ కండీషనర్స్ (ఏసీ)ను తీసుకువస్తున్నట్లు బ్లూస్టార్ ఎండీ బీ త్యాగరాజన్ వెల్లడించారు. మంగళవారం నాడిక్కడ మార్కెట్లోకి 150 కొత్త రూమ్ ఏసీ మోడళ్లను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్మార్ట్ ఏసీల విక్రయాలు లక్ష యూనిట్ల వరకు ఉండనున్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఏసీల విక్రయాలు 15 లక్షల యూనిట్లుగా ఉంటాయని భావిస్తున్నామన్నారు. అయితే 2025-26లో విక్రయాలు 20 లక్షల యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు.

2028 నాటికి శ్రీసిటీ రెండో యూనిట్ రెడీ: కాగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో 40 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న రెండో ఏసీ తయారీ యూనిట్ 2028 నాటికల్లా అందుబాటులో వస్తుందని త్యాగరాజన్ చెప్పారు. కాగా బ్లూస్టార్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో 15 శాతం వాటా ఉందని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

యాభై రోజులు పూర్తి



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా, ఈ సినిమా 92 సెంటర్లలో 50 రోజులను పూర్తి చేసుకున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదలైన ఈ సినిమా దాదాపు రూ.300 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. అత్యధిక వసూళ్లను సాధించిన తెలుగు రీజనల్ సినిమాగా ఘనత దక్కించుకుంది. దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు.

గుర్తుండిపోయే పాత్ర



'నేను పరిశ్రమకు వచ్చి 48 ఏళ్లు అయింది. 'రాబిన్ హుడ్' లాంటి కథాబలమున్న చిత్రంలో అవకాశం దక్కడం అరుదు. నటుడిగా నాకు సంతృప్తినిచ్చిన చిత్రమిది' అన్నారు రాజేంద్రప్రసాద్. నితిన్ హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్'లో ఆయన కీలకపాత్ర పోషించారు. ఈ నెల 28న విడుదలవుతున్న సందర్భంగా రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ 'సినిమాలో నితిన్ నా టైమింగ్ ఫాలో అవ్వాలి. నేను అతని టైమింగ్ ఫాలో అవ్వాలి. మా ఇద్దరి క్యారెక్టర్స్ అలా డిజైన్ చేశారు. ఇలాంటి వినోదాత్మక చిత్రం చేసి చాలా కాలమైంది. దర్శకుడు వెంకీ స్పెషల్‌గా నా కోసం రాసుకున్న పాత్ర ఇది. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'నాన్నకు ప్రేమతో', 'శ్రీమంతుడు', 'ఓ బేబీ, 'ఎఫ్ 2' చిత్రాల తరహాలో 'రాబిన్‌హుడ్'లోనూ ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా నా పాత్ర ఉంటుంది' అన్నారు.

సికందర్‌తో స్టెప్పులు



బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సికందర్'. ఏఆర్ మురుగదాస్ దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. రంజాన్ సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని యూనిట్ మంగళవారం విడుదల చేసింది. జోహ్రజబీన్ అంటూ సాగే ఈ గీతంలో బీట్‌కు అనుగుణంగా సల్మాన్, రష్మిక హుషారైన స్టెప్పులతో అలరించారు. ఈ పాటకు సమీర్, డానిష్ సాహిత్యం అందించగా, ప్రీతమ్ స్వరాలందించారు. నకాష్ అజీజ్, దేవ్ నేగి ఆలపించారు. సాజిద్ నడియాడ్‌వాలా ఈ చిత్రాన్ని నిర్మించారు.



మంచి అనుభూతిని అందిస్తుంది

జీవీ ప్రకాశ్ కుమార్, దివ్యభారతి జంటగా కమల్ ప్రకాశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కింగ్‌స్టన్'. జీవీ ప్రకాశ్ నటించడంతో పాటు నిర్మాతగా, సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ఈనెల 7న విడులవుతోంది. గంగ ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత మహేశ్వర్ రెడ్డి తెలుగులో సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో నితిన్ మాట్లాడుతూ 'ట్రైలరే ఇంత గొప్పగా ఉంటే, సినిమా ఏ స్థాయిలో ఉంటుందో అనే ఆసక్తిని పెంచింది' అని అన్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుంది' అని అన్నారు. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'ఇలాంటి అద్భుతమైన సినిమాని థియేటర్లలోనే చూడాలి' అని అన్నారు.


విజయ్‌తో విడిపోయారా?





నటి తమన్నా భాటియా, బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ రిలేషన్‌షిప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. త్వరలోనే వీరు పెళ్లి కూడా చేసుకుంటున్నట్లు వార్తలు షికారు చేశాయి. అయితే, ఈ జంట ప్రస్తుతం విడిపోయినట్లు తెలుస్తోంది. తమ సోషల్‌మీడియా ఖాతాలలోనూ వారిద్దరూ కలసి ఉన్న ఫొటోలను తొలగించడంతో పాటు ఒకర్నొకరు అన్‌ఫాలో అయ్యారట. దీంతో వీరిద్దరి అనుబంధానికి బ్రేక్‌లు పడ్డాయని భావిస్తున్నారు. పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్న వారు.. భవిష్యత్తులోనూ మంచి స్నేహితులుగా కొనసాగుదామని అనుకుంటున్నారట. కాగా, 'లస్ట్ స్టోరీస్-2' వెబ్‌సిరీస్ చిత్రీకరణలో తొలిసారి వీరి మధ్య పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది.

ప్రసాద్ అనే నేను..



సప్తగిరి ప్రధాన పాత్రలో అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. కె.వై.బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మాతలు. ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈనెల 21న చిత్రాన్ని విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నటుడు ప్రభాస్ చిత్రం టీజర్‌ని లాంచ్ చేశారు. 'ప్రసాద్ అనే నేను... కట్నం శాసనాల గ్రంథంలో ఉన్న రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌కు గౌరవం ఇస్తూ తరతరాలుగా కట్నం విషయంలో మా తాతముత్తాతలు ఫాలో అవుతున్న షరతులకు కట్టుబడి ఉంటానని మా తాతముత్తాతల మీద ప్రమాణం చేస్తున్నా' అంటూ సప్తగిరి చెప్పే డైలాగ్స్‌తో ప్రారంభమైన టీజర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా సాగింది.

చిన్న సాయం సంతోషాన్నిచ్చింది

- వరలక్ష్మీ శరత్‌కుమార్



"నా పుట్టినరోజున ఈ చిన్నారులను కలవడం చాలా సంతోషాన్నిస్తోంది. మా వంతుగా వారికి డొనేషన్ ఇచ్చాం. ఇది చిన్న సాయమే. కానీ ఆ చిన్నారులకు పెద్ద సంతోషాన్ని అందిస్తుంది. మీరు కూడా చిన్నారులకు సాయం చేయండి" అని వరలక్ష్మీ శరత్‌కుమార్ కోరారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా లెప్రా సొసైటీలోని అనాథ‌శ్రయంలోని చిన్నారులను కలిశారు. భర్త నికోలయ్ సచ్‌దేవ్‌తో కలసి బాలలకు బహుమతులు అందజేశారు.

ప్రేమలో కొత్త కోణం



తమిళ నటుడు మిథున్ చక్రవర్తి హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న తెలుగు-తమిళ ద్విభాషా చిత్రం 'లవ్ స్టోరీ బిగిన్స్'. వర్ష, శ్వేత కథానాయికలు. హీరో హీరోయిన్లపై తెరకెక్కించిన రొమాంటిక్ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. 'వస్తావా ప్రియా' అంటూ సాగే ఈ గీతానికి అమర్‌గీత్ స్వరాలందించగా, శివమణి సాహిత్యమందించారు. ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిదని మిథున్ చక్రవర్తి తెలిపారు.

చిన్న సినిమా

ప్రయోగం చేశాం.. ఆదరించండి



ఆర్టిస్టులను చూపించకుండా కేవలం కథ, కథనాల మీద ఆధార పడి తీసిన సినిమా 'రా రాజా'. బి.శివప్రసాద్ దర్శకుడు. ఈ నెల 7 న విడుదలవుతోంది. మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'నిర్మాతగా సినిమాలు చేస్తున్న టైమ్‌లో నా మైండ్‌లోకి వచ్చిన పాయింట్‌ను కథగా మార్చి, అనుకోకుండా నేనే దర్శకుడినయ్యా. సినిమా బాగా వచ్చింది' అన్నారు. ఈ సినిమాకు మంచి సంగీతం ఇచ్చే అవకాశం లభించిందని సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర, సినిమా బాగా వచ్చిందని ఛాయాగ్రాహకుడు రాహుల్ శ్రీవాత్సవ్ చెప్పారు.

మ్యూజికల్ ఎంటర్‌టైనర్



వైవిధ్యమైన ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న చిత్రం 'టుక్ టుక్'. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, నిహాల్ కోదాటి ముఖ్య పాత్రలు పోషించారు. ఈ నెల 21న విడుదల కానుంది. సుప్రీత్ కృష్ణ దర్శకుడు. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాములు రెడ్డి, సుప్రీత్ కృష్ణ నిర్మాతలు. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. శాన్వీ మేఘన మాట్లాడుతూ 'సినిమా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. థియేటర్‌కి వచ్చి చూడండి' అని కోరారు. 'ముగ్గురు యువకుల ప్రయాణం ఇది. అనుకోని అవాంతరాలను వారు ఎలా అధిగమించారనేది ఆసక్తికరం' అన్నారు రోషన్. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ కాన్సెప్ట్. త్వరలో ఓ బిగ్గెస్ట్ సర్‌ప్రైజ్ రాబోతోంది' అని చెప్పారు.

తెలుగు ప్రేక్షకులకు థాంక్స్

- ప్రదీప్ రంగనాథన్



దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన ఏజీఎస్ ఎంటైర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన తాజా చిత్రం 'ఎంటర్ ద డ్రాగన్'. ప్రదీప్ రంగనాథన్ హీరోగా అశ్వత మారిముత్తు రూపొందించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై విజయం సాధించడంతో సోమవారం సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ 'థియేటర్లలో మా సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూసి దర్శకుడు అశ్వత్ ఎమోషనల్ అయ్యారు. తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమకు మేం ముగ్ధులమయ్యాం. వారికి థాంక్స్' అన్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ 'రాజమౌళి నాకు స్ఫూర్తి. సినిమాలో ఎమోషన్ కనెక్ట్ అయితే అన్ని ప్రాంతాల వారికీ కనెక్ట్ అవుతుందని ఆయన నిరూపించారు. తమిళంలో మా సినిమా పెద్ద హిట్. తెలుగులో కూడా బాగా ఆదరిస్తున్నారు' అన్నారు. వినోదంతో పాటు అంతర్లీనంగా మంచి సందేశం అందించారనీ, ఫ్యామిలీతో కలసి చూడాల్సిన చిత్రం ఇదని మైత్రీ మూవీస్ రవిశంకర్ చెప్పారు. తమ సినిమాను ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు అర్చనా కల్పాతి ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● బుధవారం 5 మార్చి 2025

ఒత్తిడికి లోను కాలేదు

ఈ పిచ్‌పై స్ట్రయిక్ రొటేట్ చేస్తూ భాగస్వామ్యాలను నెలకొల్పడం ముఖ్యం. సెమీస్ ఒత్తిడితో కూడిన మ్యాచ్. ఓపిగ్గా చివరి వరకు నిలబడితే ప్రత్యర్థి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. అందుకే నేను భారీ షాట్లకు వెళ్లకుండా ఎక్కువగా సింగిల్స్‌పై దృష్టి సారించాను. ఓ దశలో రన్‌రేట్ ఆరు వరకు వెళ్లినా ఆందోళన పడలేదు. వన్డే ఫార్మాట్‌లో అత్యుత్తమ స్థాయిలో ఉన్నానా? అంటే నేను చెప్పలేను. అలాంటి విషయాలపై దృష్టి సారించను. సెంచరీ చేసుంటే బావుండేది కానీ జట్టు విజయం అన్నింటికన్నా ముఖ్యం. - విరాట్ కోహ్లీ

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: హెడ్ (సి) గిల్ (బి) వరుణ్ 39; కూపర్ (సి) రాహుల్ (బి) షమి 0; స్మిత్ (బి) షమి 73; లబుషేన్ (ఎల్బీ) జడేజా 29; ఇన్‌గ్లిస్ (సి) విరాట్ (బి) జడేజా 11; క్యారీ (రనౌట్) 61; మ్యాక్స్‌వెల్ (బి) అక్షర్ 7; ద్వార్షిస్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 19; జంపా (బి) హార్దిక్ 7; ఎల్లిస్ (సి) విరాట్ (బి) 10; తన్వీర్ సంఘా (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు 7; మొత్తం: 49.3 ఓవర్లలో 264 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-4, 2-54, 3-110, 4-144, 5-198, 6-205, 7-239, 8-249, 9-262, 10-264; **బౌలింగ్:** షమి 10-0-48-3; హార్దిక్ 5.3-0-40-1; కుల్దీప్ 8-0-44-0; వరుణ్ 10-0-49-2; అక్షర్ 8-1-43-1; జడేజా 8-1-40-2.

భారత్: రోహిత్ (ఎల్బీ) కూపర్ 28; గిల్ (బి) ద్వార్షిస్ 8; విరాట్ (సి) ద్వార్షిస్ (బి) జంపా 84; శ్రేయాస్ (బి) జంపా 45; అక్షర్ (బి) ఎల్లిస్ 27; రాహుల్ (నాటౌట్) 42; హార్దిక్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) ఎల్లిస్ 28; జడేజా (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 48.1 ఓవర్లలో 267/6. వికెట్ల పతనం:** 1-30, 2-43, 3-134, 4-178, 5-225, 6-259; **బౌలింగ్:** ద్వార్షిస్ 7-0-39-1; ఎల్లిస్ 10-0-49-2; కూపర్ 8-0-37-1; జంపా 10-0-60-2; తన్వీర్ 6-0-41-0; మ్యాక్స్‌వెల్ 6.1-0-35-0; హెడ్ 1-0-6-0.


కోహ్లి (84)

చాంపియన్స్ ట్రోఫీ


శ్రేయాస్ (45)

హమ్మయ్య.. ఈసారి మనదే పైచేయి. ఐసీసీ నాకౌట్ టోర్నీల్లో ఎదురుపడిన ప్రతీసారి కోట్లాది భారత హృదయాలను భగ్నం చేసే ఆస్ట్రేలియాకు రివర్స్ పంచ్ పడింది. తాజా టోర్నీలో నిలకడగా ఆడుతున్న టీమిండియా కీలక సెమీస్‌లోనూ ఎలాంటి తడబాటుకు లోనుకాలేదు. ముందున్నది ప్రమాదకర ఆసీస్ అయినా.. తమ శక్తిసామర్థ్యాలను నమ్ముకుని బరిలోకి దిగింది. స్పిన్ పవర్‌ను చూపిస్తూ ఆ జట్టును ఓ మాదిరి స్కోరుకే కట్టడి చేసింది. ఇక ఛేజింగ్‌లో రారాజు.. అందునా ఆసీస్‌పై చెలరేగే విరాట్ కోహ్లీ మరోసారి కదం తొక్కాడు. శ్రేయాస్, రాహుల్ సైతం ఆసీస్ అనుభవలేమి బౌలింగ్‌పై ఆధిపత్యం చూపి జట్టును ఫైనల్‌కు చేర్చారు. ఇక 2011 వన్డే వరల్డ్‌కప్ తర్వాత ఐసీసీ నాకౌట్‌లో ఆసీస్‌పై భారత్ గెలవడం ఇదే తొలిసారి.

కంగారు 'పోయింది' ఇక టైటిల్ మిగిలింది!

- ఐదోసారి ఫైనల్ చేరిన భారత్
- అదరగొట్టిన విరాట్ కోహ్లీ
- సెమీస్‌లో ఆస్ట్రేలియా చిత్తు

దుబాయ్: ఏడాదిన్నర కిందట వన్డే వరల్డ్‌కప్ టైటిల్‌ను దూరం చేసిన ఆస్ట్రేలియాపై భారత్ బదులు తీర్చుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (84) మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్‌తో మంగళవారం జరిగిన సెమీఫైనల్లో కంగారూలను 4 వికెట్ల తేడాతో ఓడించింది. ఫలితంగా టీమిండియా వరుసగా మూడోసారి చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో అడుగు పెట్టింది. ఈనెల 9న దుబాయ్‌లో ఫైనల్ జరుగుతుంది. నేడు న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా మధ్య జరిగే మ్యాచ్ విజేత భారత్ ప్రత్యర్థి కానుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (73), అలెక్స్ క్యారీ (61) అర్ధసెంచరీలతో రాణించారు. పేసర్ షమికి మూడు, స్పిన్నర్లు జడేజా, వరుణ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 48.1 ఓవర్లలో 6 వికెట్లకు 267 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ (45), రాహుల్ (42 నాటౌట్), హార్దిక్ (28), రోహిత్ (28), అక్షర్ (27) విజయంలో భాగమయ్యారు. ఎల్లిస్, జంపాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు.

విరాట్ నిలకడ

ఓ మాదిరి ఛేదనను భారత్ ప్రశాంతంగా ముగించింది. గిల్ మినహా క్రీజులోకి దిగిన ప్రతీ బ్యాటరూ కీలక ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ఆఖర్లో బంతికో పరుగు చొప్పున చేయాల్సి వచ్చినప్పుడు హార్దిక్ ధనాధన్ ఆటతీరుతో తేలికపరిచాడు. ఇక విరాట్-శ్రేయాస్ జోడీ మధ్య ఓవర్లలో ఆసీస్ బౌలర్లను ఆడేసుకుంది. దీనికి తోడు ఫీల్డింగ్ వైఫల్యం కూడా భారత్‌కు కలిసివచ్చింది. ఆరంభంలో రోహిత్ ఇచ్చిన రెండు క్యాచ్‌లను కూపర్, లబుషేన్ వదిలేశారు. గిల్ (8) విఫలం కాగా ఉన్న కాసేపు రోహిత్ దూకుడుగా ఆడాడు. బంతికో పరుగు చొప్పున సాధించిన అతడిని 8వ ఓవర్‌లో కూపర్ అవుట్ చేశాడు. కానీ ఆ తర్వాత మరో వికెట్ తీసేందుకు ఆసీస్ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. భారీ షాట్లకు వెళ్లకుండా ఎక్కువగా సింగిల్స్‌పై దృష్టి సారించిన విరాట్-శ్రేయాస్ మూడో వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. కోహ్లీ 53 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అదే ఫీట్‌కు సమీపంలో ఉన్న శ్రేయాస్‌ను 27వ ఓవర్‌లో జంపా బౌల్డ్ చేసి ఆసీస్‌కు ఊరటనిచ్చాడు. అనంతరం అక్షర్ (27)తో కలిసి నాలుగో వికెట్‌కు విరాట్ 44 రన్స్ జోడించాడు. 40వ ఓవర్‌లో జట్టు 200 రన్స్ సాధించింది. అయితే సమీకరణం బంతికో పరుగు చొప్పున మారిన వేళ విరాట్ అనవసరంగా భారీ షాట్‌కు వెళ్లి జంపా గూగ్లీకి వెనుదిరిగాడు. అప్పటికి రాహుల్‌తో కలిసి ఐదో వికెట్‌కు 47 పరుగులు జత చేరాయి. ఇక హార్దిక్ (28) లాంగాఫ్‌లో రెండు భారీ సిక్సర్లు, ఓ ఫోర్‌తో ఒత్తిడి పూర్తిగా తగ్గింది. మరో 13 బంతుల్లో ఆరు పరుగులు కావాల్సిన వేళ హార్దిక్ వెనుదిరిగినా ఇబ్బంది లేకపోయింది. రాహుల్ సిక్సర్‌తో 11 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.


రాహుల్ (42)

స్మిత్, క్యారీ హాఫ్ సెంచరీలు

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్‌కు దిగగా, భారత బౌలర్లు ఎప్పటిలాగే ప్రత్యర్థిని కట్టడి చేశారు. అయితే ఆరంభంలో హెడ్ వణికించగా.. మధ్య ఓవర్లలో స్మిత్, క్యారీ నిలకడ ప్రదర్శనతో 260+ స్కోరు వరకు రాగలిగింది. కెప్టెన్ రోహిత్ సరైన సమయంలో బౌలర్లను మారుస్తూ ఫలితం రాబట్టాడు. ఇక ఎప్పటిలాగే స్పిన్నర్లు ఆధిపత్యం చూపి 5 వికెట్లు పడగొట్టారు. ఆసీస్ ఆరంభం కాస్త నిదానంగానే సాగింది. ఓపెనర్ కూపర్‌ను షమి డకౌట్ చేయగా తొలి మూడు ఓవర్లలో చేసింది 4 పరుగులే. కానీ భారత్‌తో మ్యాచ్ అంటే ఊపు మీదుండే హెడ్ మరోసారి బెదరగొట్టాడు. తనదైన శైలిలో బౌలర్లపై ఎదురుదాడికి దిగడంతో పరుగుల వేగం పెరిగింది. అతడి 39 పరుగుల్లో బౌండరీల రూపంలోనే 32 రన్స్ రావడం విశేషం. అయితే బంతి వరుణ్ చేతికివ్వడంతో హెడ్ ఆట ముగిసింది. దీంతో ఆటగాళ్లతో పాటు ఫ్యాన్స్ కూడా ఊపిరిపీల్చుకున్నారు. రెండో వికెట్‌కు స్మిత్‌తో కలిసి హెడ్ 32 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం అందించాడు. అనంతరం స్మిత్ ఓపిగ్గా క్రీజులో నిలిచి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. 14వ ఓవర్ (అక్షర్)లో బంతి వికెట్లను తాకినా బెయిల్స్ కిందపడక స్మిత్ బతికిపోయాడు. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ తను లబుషేన్ (29)తో కలిసి మూడో వికెట్‌కు 56 పరుగులు, నాలుగో వికెట్‌కు ఇన్‌గ్లిస్ (11)తో 34 పరుగులు, క్యారీతో కలిసి ఐదో వికెట్‌కు మరో 54 పరుగులు జత చేశాడు. అర్ధసెంచరీతో ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న స్మిత్‌ను చివరకు 37వ ఓవర్‌లో షమి బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత బాధ్యతను క్యారీ తీసుకోవడంతో చివర్లో పరుగులు వేగంగా వచ్చాయి. 48 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన క్యారీ రనౌట్‌గా వెనుదిరిగాడు. మ్యాక్స్‌వెల్ (7)ను అక్షర్ బౌల్డ్ చేయగా.. ద్వార్షిస్ (19), ఎల్లిస్ (10) వేగంగా ఆడే క్రమంలో వికెట్లు కోల్పోయారు. ఆఖరి ఓవర్‌లో జంపా (7)ను హార్దిక్ అవుట్ చేయడంతో ఆసీస్ ఆట ముగిసింది.


రోహిత్, షమి (3/48

తొలి కెప్టెన్‌గా..

కెప్టెన్ రోహిత్ శర్మ అన్ని ఐసీసీ టోర్నీల్లో భారత జట్టును ఫైనల్‌కు చేర్చిన ఘనత సాధించాడు. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (2023), వన్డే వరల్డ్ కప్ (2023), టీ20 వరల్డ్‌కప్ (2024), చాంపియన్స్ ట్రోఫీ (2025)ల్లో అతడి నాయకత్వంలో జట్టు తుది పోరుకు చేరగలిగింది.

నల్ల రిబ్బన్లతో బరిలోకి..



ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో భారత క్రికెటర్లు తమ భుజాలకు నల్ల రిబ్బన్లు ధరించి ఆడారు. ముంబై మాజీ స్పిన్నర్ పద్మాకర్ శివాల్కర్ సోమవారం మృతి చెందాడు. దీంతో ఆయనకు నివాళిగా ఆటగాళ్లంతా ఇలా నల్లటి రిబ్బన్లు ధరించారు.

1 ఐసీసీ వన్డే టోర్నీలో అత్యధిక సిక్సర్లు (65) బాదిన ప్లేయర్‌గా రోహిత్. క్రిస్ గేల్ (64)ను అధిగమించాడు.

వన్డేల్లో వరుస టాస్‌లు (11) కోల్పోయిన రెండో కెప్టెన్‌గా రోహిత్. పీటర్ బోరెన్ సరసన నిలిచాడు. లారా (12) ముందున్నాడు.

వన్డేల్లో ఎక్కువ క్యాచ్‌లు (161) అందుకున్న రెండో ఫీల్డర్‌గా విరాట్ కోహ్లీ. జయవర్దనె (218) ముందున్నాడు. అలాగే అంతర్జాతీయ క్రికెట్‌లో 335 క్యాచ్‌లు పట్టిన తొలి భారత క్రికెటర్‌గా నిలిచి ద్రవిడ్ (334)ను అధిగమించాడు.

2 వన్డే ఛేజింగ్‌ల్లో ఎక్కువ పరుగులు (8062) చేసిన రెండో బ్యాటర్‌గా విరాట్. సచిన్ (8720) టాప్‌లో ఉన్నాడు.

1 ఐసీసీ వన్డే నాకౌట్ మ్యాచ్‌ల్లో ఆసీస్‌పై అత్యధిక ఛేదన (265) చేసిన జట్టుగా భారత్

కుల్దీప్‌పై ఎడా..పెడా



ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ కుల్దీప్‌పై విరాట్, కెప్టెన్ రోహిత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 32వ ఓవర్‌లో స్మిత్ ఫ్లిక్ చేసిన బంతిని విరాట్ మిడ్ వికెట్ నుంచి నేరుగా కుల్దీప్ వైపు విసిరాడు. అయితే వికెట్ల దగ్గర ఉన్న కుల్దీప్ దాన్ని అందుకోకుండా వదిలేయడంతో కవర్స్‌లో ఉన్న రోహిత్ పట్టుకోవాల్సి వచ్చింది. కానీ అటు విరాట్.. ఇటు రోహిత్ ఇద్దరూ కుల్దీప్ చేసిన పనికి కోపంతో ఊగిపోతూ 'బంతి పట్టుకోవడం చేతకాదా?' అంటూ బూతులతో దుర్భాషలాడడం కనిపించింది.

నాజూకైన వాళ్లే కావాలంటే మోడల్స్‌ను తెచ్చుకోండి!

- శరీరాకృతి కాదు..ఆట ముఖ్యం
- రోహిత్‌కు గవాస్కర్ మద్దతు

దుబాయ్: కెప్టెన్ రోహిత్ శర్మ శరీరాకృతినుద్దేశించి కాంగ్రెస్ మహిళా నేత షమా మహ్మద్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో హిట్‌మ్యాన్‌కు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ మద్దతుగా నిలిచాడు. క్రికెట్‌లో మానసిక బలమే ప్రధానమన్నాడు. నాజూగ్గా ఉండేవాళ్లు కావాలనుకొంటే.. మోడలింగ్ పోటీలకు వెళ్లి..అక్కడినుంచి మోడల్స్‌ను తెచ్చుకోండి' అని చురకలంటించాడు. 'క్రికెట్‌లో రాణించడమే ముఖ్యం. మిగతావన్నీ తర్వాతే. గతంలో సర్ఫరాజ్‌ను కూడా ఇలాగే లావుగా ఉన్నాడని హేళన చేశారు. కానీ, అతడు టెస్ట్ మ్యాచ్‌లో 150+ స్కోరు చేశాడు. రెండు మూడు అర్ధ శతకాలు కూడా బాదాడు. ఇక సమస్య ఏముంది? క్రికెట్‌లో శరీరాకృతి ఎలా ఉందన్నది అనవసరం. మానసికంగా ఎంత బలంగా ఉన్నాడనేది ముఖ్యం. అలాగే సుదీర్ఘంగా క్రీజులో ఉండి పరుగులు చేయగలిగితే చాలు' అని గవాస్కర్ చెప్పాడు. రోహిత్ ఊబకాయంపై షమా ఎక్స్‌లో చేసిన పోస్టు దుమారాన్ని రేపింది. కెప్టెన్సీ కూడా ఏమంత ఆకట్టుకోవడం లేదని విమర్శించింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో.. షమా ఆ పోస్టును తొలగించింది.

బాబర్, రిజ్వాన్ అవుట్


అకిబ్ జావెద్ సల్మాన్ ఆఘా

సల్మాన్‌కు పాక్ టీ20 పగ్గాలు
న్యూజిలాండ్‌తో సిరీస్

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య పాకిస్థాన్ అనూహ్యంగా గ్రూప్ దశలోనే నిష్క్రమించడంతో ఆ జట్టులోని కీలక ఆటగాళ్లపై వేటు పడింది. ఏకంగా కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌లను పాక్ టీ20 జట్టు నుంచి తొలగించారు. త్వరలో న్యూజిలాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు ప్రకటించిన పాక్ జట్టులో వీళ్లిద్దరికీ చోటు దక్కలేదు. రిజ్వాన్ స్థానంలో జట్టు కెప్టెన్‌గా సల్మాన్ అలీ ఆఘాను నియమించారు. ఆల్‌రౌండర్ షాబాద్ ఖాన్‌ను జట్టులోకి తీసుకోవడంతో పాటు అతనికి వైస్ కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. అయితే, టీ20 జట్టు కెప్టెన్‌గా, ఆటగాడిగా చోటు కోల్పోయిన రిజ్వాన్.. వన్డే సారథ్య బాధ్యతలను నిలబెట్టుకున్నాడు. వైస్ కెప్టెన్‌గా సల్మాన్‌ను ఎంపిక చేశారు. బాబర్ కూడా వన్డే జట్టులో స్థానం పదిలం చేసుకున్నాడు. సౌద్ షకీల్, కమ్రాన్ గులామ్‌లకు వన్డే జట్టు నుంచి ఉద్వాసన పలికారు. న్యూజిలాండ్ వేదికగా పాక్ ఈనెల 16 నుంచి ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది. కాగా, చాంపియన్స్ ట్రోఫీలో విఫలమైనప్పటికీ జట్టు చీఫ్ కోచ్‌గా అకిబ్ జావెద్‌ను కొనసాగించారు. న్యూజిలాండ్ పర్యటనలో చీఫ్ కోచ్‌గా అకిబ్ ఉంటాడని పాక్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. గతేడాది ఆరు నుంచి ఎనిమిది నెలల్లోపే గిలెస్పీ, కిర్‌స్టెన్‌లు చీఫ్ కోచ్‌లుగా రాజీనామా చేయడంతో జావెద్ తాత్కాలిక కోచ్‌గా నియమితుడయ్యాడు.

పాక్ టీ20 జట్టు

సల్మాన్ ఆఘా (కెప్టెన్), షాబాద్ ఖాన్ (వైస్ కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, హారిస్ రౌఫ్, హసన్ నవాజ్, జహాన్‌దాద్ ఖాన్, ఖుష్‌దిల్ షా, మహ్మద్ అబ్బాస్ అఫ్రీది, మహ్మద్ అలీ, మహ్మద్ హారిస్, మహ్మద్ ఇర్ఫాన్ ఖాన్, ఒమర్ బిన యూసుఫ్, షహీన్ షా అఫ్రీది, సుఫ్యాన్ ముఖీమ్, ఉస్మాన్ ఖాన్.

భారత్ ప్రత్యర్థి ఎవరో?

మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

న్యూజిలాండ్ X దక్షిణాఫ్రికా సెమీస్ నేడు



లాహోర్: సమవుజ్జీలుగా భావించే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు.. బుధవారం జరిగే రెండో సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇరుజట్లలో ప్రతిభావంతులైన ఆటగాళ్లున్నా.. ఐసీసీ ట్రోఫీ విషయానికొచ్చేసరికి ఎప్పుడూ అండర్ డాగ్స్‌గానే పరిగణిస్తుంటారు. 1998లో సౌతాఫ్రికా, 2000లో కివీస్ చాంపియన్స్ ట్రోఫీ విజేతలుగా నిలిచాయి. కానీ, అప్పుడు నాకౌట్ ట్రోఫీగా వ్యవహరించడంతో.. ఇప్పుడున్నంత ప్రాధాన్యం లేదు. ఒత్తిడికి చిత్తవుతారన్న ముద్రను పోగొట్టుకోవాలని సఫారీలు భావిస్తుండగా.. ఐసీసీ పరిమిత ఓవర్ల ట్రోఫీని సాధించాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. ఇరుజట్లు బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో సమంగా కనిపిస్తున్నా.. స్పిన్నర్లు ఏమేరకు రాణిస్తారనే దానిపైనే జట్ల విజయావకాశాలు ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. గ్రూప్-బి టాపర్‌గా నాకౌట్‌కు చేరుకొన్న సౌతాఫ్రికా జట్టులో స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఒక్కడే ఉన్నా.. బౌలింగ్ విభాగం ప్రత్యర్థితో పోల్చితే మెరుగ్గా ఉంది. బ్యాటింగ్ లో కెప్టెన్ బవుమా, రికెల్టన్, డుస్సెన్ ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు గ్రూప్-ఎలో రెండో స్థానంతో సెమీస్‌కు చేరుకొన్న న్యూజిలాండ్ జట్టులో కెప్టెన్ శాంట్నర్, బ్రేస్‌వెల్ తమ మాయాజాలంతో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సమర్థులు. యంగ్, విలియమ్సన్, రచిన్ రవీంద్ర, మిచెల్‌తో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. ఇటీవలే ఇక్కడ జరిగిన ముక్కోణపు సిరీస్‌లో 305 స్కోరును ఛేదించిన కివీస్.. ఫైనల్లో పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకొంది. అయితే, ఈ టోర్నీలో అజేయంగా నిలిచిన సఫారీలు కూడా ఆత్మవిశ్వాసంతో ఉండడంతో.. మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. వికెట్ మందకొడిగా ఉన్నా.. బ్యాటింగ్‌కు అనుకూలం. వాతావరణం సాధారణంగా, పొడిగా ఉండనుంది.

డ్రెస్సింగ్ రూమ్‌లోకి కుటుంబ సభ్యులకు నో ఎంట్రీ!

▸▸ ఐపీఎల్‌లో కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: ఆటగాళ్ల కుటుంబ సభ్యుల విషయంలో నిబంధనలను భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) మరింత కఠినతరం చేసింది. ఐపీఎల్‌లో అమలు చేయనున్న కొత్త రూల్స్‌ను ఆయా ఫ్రాంచైజీలకు బోర్డు ఈ-మెయిల్ చేసింది. ఈ నిబంధనలను ప్రతిఒక్కరూ తు.చ. తప్పకుండా పాటించాలని ఆదేశించింది. ప్లేయర్ల సంబంధీకులు ఎవరికీ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లోకి అనుమతి లేదని తెలిపింది. ప్రాక్టీస్ రోజుల్లో కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఇక, క్రికెటర్లు టీమ్ బస్సులోనే ప్రయాణించాలని పేర్కొంది. మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగే బహుమతి ప్రదాన కార్యక్రమంలో స్లీవ్‌లెస్ జెర్సీలను ధరించరాదు. అక్రిడిటేషన్ లేనిదే ప్లేయర్లు, మ్యాచ్ అఫీషియల్స్ ఉండే ఏరియా (పీఎంఓఏ)లోకి ఎవరినీ అనుమతించే ప్రసక్తేలేదని తెలిపింది. ఎవరైనా ఆటగాళ్లు రూల్స్ ఉల్లంఘనకు పాల్పడితే.. తొలుత హెచ్చరిక, పునరావృతం చేస్తే జరిమానా విధించనున్నట్టు బీసీసీఐ పేర్కొంది. కొత్త నిబంధనలను సోదాహరణంగా వివరించడానికి ఈనెల 20న ముంబైలో ఆయా జట్ల కెప్టెన్లతో సమావేశం నిర్వహించనుంది.



భారత్-ఆసీస్ మ్యాచ్‌ను తిలకిస్తున్న విరాట్ కోహ్లీ భార్య అనుష్క

తెలుగుతెరపై వార్నర్ సందడి



హైదరాబాద్: మైదానంలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబరచే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ వెండితెరపై సందడి చేయనున్నాడు. అదీ ఓ తెలుగు సినిమాతో తెరంగేట్రం చేస్తున్నాడు. నితిన్, శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటిస్తున్న రాబిన్‌హుడ్ సినిమాలో వార్నర్ అతిథి పాత్రలో మెరిశాడు. ఈ విషయాన్ని సినిమా నిర్మాత రవి శంకర్ వెల్లడించాడు. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈనెలాఖరులో విడుదల కానుంది. ఇప్పటిదాకా సినిమాల్లో నటించకపోయినా వార్నర్‌కు టాలీవుడ్‌తో మంచి అనుబంధమే ఉంది. తెలుగు సినిమా హీరోల స్టయిల్స్‌ను అనుకరిస్తూ వార్నర్ చేసిన వీడియోలు ఇదివరకే సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందాయి.

రెజ్లర్ సుశీల్‌కు బెయిల్



న్యూఢిల్లీ: హత్య కేసులో నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న వెటరన్ రెజ్లర్ సుశీల్ కుమార్‌కు బెయిల్ లభించింది. ఈ కేసు విచారణలో భాగంగా మూడేళ్లుగా జైలు జీవితం గడుపుతున్న సుశీల్‌కి ఎట్టకేలకు బెయిల్ దొరికింది. ఢిల్లీలోని ఛత్రశాల్ స్టేడియంలో రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో గ్రీకో రోమన్ రెజ్లర్ సాగర్ ధనకర్ (27) మృతి చెందాడు. సాగర్‌ను సుశీల్ వర్గం కొడుతున్న వీడియోలో అతడు కూడా ఉండడంతో పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది జూలైలో ట్రయల్ కోర్టు సుశీల్‌కు బెయిల్‌ను నిరాకరించడం తెలిసిందే. సుశీల్‌తో పాటు మొత్తం 17 మంది ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

28న బాక్సింగ్ సమాఖ్య ఎన్నికలు

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ)కు కొత్త కార్యవర్గం ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. బీఎఫ్ఐ ఎన్నికలు ఈనెల 28న జరగనున్నాయి. ఈ మేరకు బీఎఫ్ఐ మంగళవారం ఎన్నికల తేదీని ప్రకటించింది. సకాలంలో కార్యవర్గ ఎన్నికలను నిర్వహించడంలో విఫలమవడంతో బీఎఫ్ఐపై ఇటీవల భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే.

భూముల అమ్మకానికి సర్కార్ పన్నాగం

- అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన రేవంత్, పొంగులేటి
- తిరోగమన బాటలో తెలంగాణ: హరీశ్ రావు



హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల అమ్మకానికి కాంగ్రెస్ సర్కార్ పన్నాగం వేసిందని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. భూములు అమ్మే ప్రసక్తే లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే ఇంచు భూమిని కూడా అమ్మబోమని ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి.. ఇప్పుడు రూ.వేల కోట్ల విలువైన భూములను వేలం వేసేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియామకానికి గత నెల 28న టెండర్లు పిలవడం సర్కారు దిగజారుడు తనానికి పరాకాష్ఠ అన్నారు. తెలంగాణ దేశానికి రోల్‌మోడల్ అయిందని టెండర్ నోట్‌లో ప్రస్తావించారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో అద్భుతమైన ప్రగతిని సాధించిన తెలంగాణను కాంగ్రెస్ 14 నెలల పాలనలో తిరోగమనం బాట పట్టించారని మంగళవారం ఎక్స్ వేదికగా హరీశ్‌రావు విమర్శించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి

- కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని నిరూపించుకోండి
- రాహుల్‌ను ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా కేటీఆర్ వ్యాఖ్యలు
- సీసీఐని తుక్కుగా అమ్మడం ప్రజలను వంచించడమేనని ధ్వజం



హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ప్రజా తీర్పు కోరాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వారితో రాజీనామాలు చేయించి.. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. అలా చేయని పక్షంలో పార్టీ ఫిరాయింపుల గురించి, పార్టీ మారిన వెంటనే అనర్హులను చేసేలా రాజ్యాంగ సవరణ చేస్తామన్న ప్రచారాన్ని మానేయడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన వ్యాఖ్యానించారు. కాగా, ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీని తుక్కు కింద అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడడం దుర్మార్గమని, ఇది ఆదిలాబాద్ ప్రజలను వంచించడమేనని విమర్శించారు. బీజేపీ అంటే నమ్మకం కాదు... అమ్మకం అని ఆరోపించారు. కాగా, ఎండిపోతున్న పంటలకు సాగు నీరు విడుదల చేయకపోతే మంత్రి ఉత్తమ్ కార్యాలయం ముట్టడిస్తామన్న తమ హెచ్చరికలతో ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించిందని కేటీఆర్ తెలిపారు. మిడ్‌మానేర్ నుంచి మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటి విడుదలకు చర్యలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

కార్మికులను వేధించడం వల్లే సమ్మె నోటీసు

- ఆర్టీసీ జేఏసీ నేతలు.. జీడిమెట్లడిపో వద్ద నిరసన

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులను యాజమాన్యం వేధించడంతో పాటు చిన్నచూపు చూస్తూ, హక్కులను కాలరాస్తున్నందుకే సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా తెలిపారు. సమ్మె సన్నాహాల్లో భాగంగా జీడిమెట్ల డిపో ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ.. జీడిమెట్ల డిపో మేనేజర్ చట్టవిరుద్ధంగా అధిక పనిగంటలు డ్యూటీలు చేయిస్తూ కార్మికులను కట్టుబానిసలుగా చూస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలకు స్వస్తి పలికి కార్మిక చట్టాల మేరకు డ్యూటీ చార్టులు వేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి.. జేఏసీ నేతలను చర్చలకు పిలిచి సామరస్య పూర్వకంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి: కాంగ్రెస్ లీగల్ సెల్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను రూపొందించి ఆమోదించాలని పేర్కొంటూ టీపీసీసీ లీగల్ సెల్ ఛైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. పేద బలహీన వర్గాలకు చెందిన న్యాయవాదులకు ఆర్థిక భద్రత కల్పించేలా రూ.5 లక్షల వైద్య బీమా, జూనియర్ న్యాయవాదులకు స్టైపెండ్ అందించే హామీలను అమలు చేయాలని ఆయన సీఎంను కోరారు.

రాజీవ్ స్వగృహ ఇళ్లు నిర్మించండి:ఎఫ్‌జీజీ

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ పథకంలో ఇంకా నిర్మాణాలు చేపట్టని గృహాలు, ఫ్లాట్లకు నిధులు కేటాయించి, నిర్మాణాలు చేపట్టాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 2007లో ప్రారంభించిన రాజీవ్ స్వగృహ పథకం కింద 2013 వరకు అపార్టుమెంటుల్లో 3,716 ఫ్లాట్లు, మరో 556 ఇండిపెండెంట్ గృహాలను నిర్మించాలని నిర్ణయించారని ఆయన పేర్కొన్నారు. 3,716 ఫ్లాట్లలో 2,956 ఫ్లాట్లను నిర్మించి, లబ్ధిదారులకు కేటాయించారని పేర్కొన్నారు. 556 ఇండిపెండెంట్ ఇళ్లలో 195 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి, సగం ఇళ్లను మాత్రమే పూర్తి చేశారని తెలిపారు. ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించిన ఫ్లాట్లకు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని పద్మనాభరెడ్డి సీఎంను కోరారు.

విద్యార్థి గాయపడిన ఘటనపై నివేదిక ఇవ్వండి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు బీసీ కమిషన్ ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా కొత్తగడి సాంఘిక సంక్షేమ వసతిగృహంలో టీచర్ల వేధింపులతో పాఠశాల భవనంపై నుంచి దూకి తబిత అనే పదో తరగతి విద్యార్థిని గాయపడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి పది రోజుల్లో నివేదిక సమర్పించాలని తెలంగాణ బీసీ కమిషన్ ఆ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో తరచుగా ఇలాంటి ఘటనలు జరగడం, టీచర్లు వేధిస్తున్నారని విద్యార్థులు ఆత్మహత్యాయత్నం చేయడంపై బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని నిరంజన్ వికారాబాద్ కలెక్టర్‌తో పాటు తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణిలకు రాసిన లేఖలో కోరారు.

ప్రాజెక్టుల నిర్వహణకు నిధులేవీ..?

- ఆర్థిక శాఖలో రూ.160 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి కాంట్రాక్టర్లు చేసిన పనులకు నిధులు విడుదల కావడం లేదు. దీంతో ప్రాజెక్టుల నిర్వహణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద రూ.160 కోట్లకుపైగా బిల్లులు టోకెన్ నంబర్లు జారీ అయి.. ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు ఎప్పుడిస్తారో తెలియక కాంట్రాక్టర్లు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. దేవాదుల ఎత్తిపోతల పంపుహౌస్‌ల నిర్వహణకు పనులు దక్కించుకున్న సంస్థకు ప్రస్తుతం రూ.9 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ జీతాలు చెల్లించలేదు. దీంతో కార్మికులు పంప్‌హౌస్‌కు తాళం వేశారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.480 కోట్లను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం)కు కేటాయించారు. అయితే, ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో నాలుగు వారాలు మాత్రమే ఉండగా.. ఇప్పటిదాకా బడ్జెట్ రిలీజ్ ఆర్డర్(బీఆర్‌ఓ) ఇవ్వలేదు. ఓ అండ్ ఎం పనులు సరిగ్గా జరగకపోవడంతో గత వరదలకు చాలా ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. పెద్దవాగు కొట్టుకుపోయింది. కడెం ప్రాజెక్టుకు ఏమవుతుందోననే భయాలు నెలకొన్నాయి. నాగార్జున సాగర్ ఎడమ కాలువకు పలు చోట్ల గండ్లు పడగా.. దాదాపు 550కి పైగా చెరువులు/కాలువలు దెబ్బతిన్నాయి.

పోలవరం-బనకచర్లతో ఎవరికీ నష్టం లేదు!



గోదావరి వృథా నీటినే కరువు ప్రాంతాలకు తరలిస్తున్నాం.. దీన్ని కూడా ఓ పార్టీ రాజకీయం చేస్తోంది

- ఈ తరలింపుపై తెలంగాణ బాధపడాల్సిన అవసరం లేదు
- కాళేశ్వరం ప్రాజెక్టును నేను ఎన్నడూ వ్యతిరేకించలేదు
- గోదావరి ఒక్కటే తెలుగు ప్రజలకు శ్రీరామరక్ష
- ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం ఉండదని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు సంబరాలను మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు గోదావరి జలాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేయడంపై స్పందించారు. సముద్రంలోకి వృథాగా పోయే జలాలను కరవు ప్రాంతాలకు తరలిస్తానంటే కొందరు అనవసరంగా రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "తెలంగాణలో ఉండేవారితోపాటు తెలుగు ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. గోదావరి జలాలను బనకచర్లకు తీసుకెళ్లడం వల్ల ఎవరికీ నష్టం జరగదు. వృథాగా వెళ్లే నీటినే తరలిస్తున్నాం. దీన్ని కూడా ఓ పార్టీ రాజకీయం చేస్తోంది. ఒకరు మాట్లాడితే తాము వెనకబడిపోతామని మరికొందరు మాట్లాడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నేను ఏనాడూ వ్యతిరేకించలేదు. గోదావరి ఒక్కటే తెలుగు ప్రజలకు శ్రీరామరక్ష. గోదావరిపై ప్రాజెక్టులు కట్టండి. తెలంగాణలోని కరువు ప్రాంతాలకూ నీటిని తరలించుకోవచ్చు. ఏపీ ప్రాంతానికి తరలించే నీటిపై తెలంగాణ బాధపడాల్సిన అవసరం లేదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చివరి ప్రాంతంలో ఉన్న రాజమహేంద్రవరం దాటితే గోదావరి నీరు సముద్రంలోనే కలుస్తుందని గుర్తుచేశారు. చివరి ప్రాంతాలకు మిగులు జలాలను తీసుకునే అధికారం ఉందని స్పష్టం చేశారు. గోదావరి నికర జలాల వాటా తేల్చాల్సిందేనని తెలంగాణ సీఎం రేవంత్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో బాబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో.. బీజేపీ ముందంజ

(మొదటిపేజీ తరువాయి)

అంజిరెడ్డికి 45,401 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 38,470 ఓట్లు లభించాయి. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 31,481 ఓట్లు వచ్చాయి. కాగా, మరికొందరు ఇతరులు, స్వతంత్రులు స్వల్ప ఓట్లతోనే కొనసాగుతున్నారు. ముగ్గురు అభ్యర్థుల మధ్య హోరాహోరీ కొనసాగుతుండడంతో మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరూ కోటా ఓట్లను సాధించే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు తప్పనిసరి అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



కరీంనగర్‌లోని కౌంటింగ్ హాల్‌లో కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ

కాంగ్రెస్ ధీమాతో ఉన్నా..

కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో విజయం తనదేనని కాంగ్రెస్ మొదటి నుంచి ధీమాతో ఉంది. కానీ, కాంగ్రెస్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి వరుసగా ఐదు రౌండ్లలో ఆధిక్యం సాధించారు. కాంగ్రెస్ నేతలు ఈ పరిస్థితిని ఊహించలేదు. బీసీ వాదం బలంగా వీచినా తానే మొదటి స్థానంలో నిలుస్తానని భావించిన కాంగ్రెస్ అభ్యర్థి.. ఐదు రౌండ్లలోనూ రెండో స్థానానికే పరిమితం కావలసి వచ్చింది. రెండో ప్రాధాన్య ఓట్లు ఎక్కువగా లభించాయని ప్రచారం జరిగిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు ఆ ఓట్లు పెద్దగా లాభించే పరిస్థితి లేకుండా పోయింది. మెజారిటీ ఓట్లు మొదటి ముగ్గురు అభ్యర్థులకే లభిస్తున్న నేపథ్యంలో ఆయనకు రెండో ప్రాధాన్య ఓట్లు గెలుపునకు అవసరమైన మేరకు రాకపోవచ్చని, ఆయనకు అనుకూలంగా వచ్చిన రెండో ప్రాధాన్య ఓట్లు మొదటి ఇద్దరు అభ్యర్థుల వద్దే ఉండడంతో అవి నిరుపయోగమే అవుతాయని భావిస్తున్నారు. ఇక్కడ చెల్లని ఓట్ల వ్యవహారం పెద్ద ప్రహసనంలా మారింది. సాధారణంగా పోలైన ఓట్లలో చెల్లని ఓట్లను గుర్తించి వాటిని తొలగించిన తర్వాత చెల్లిన ఓట్ల ఆధారంగా కోటా ఓటు నిర్ధారిస్తారు. అయితే ఈ నియోజకవర్గంలో చెల్లని ఓట్లను గుర్తించడానికి ఒక రోజంతా సమయం తీసుకున్నా కోటా ఓటును అధికారికంగా ప్రకటించలేకపోయారు. చెల్లని ఓట్ల విషయంలో అభ్యంతరాలు రావడంతో మంగళవారం వాటిని మళ్లీ పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు కొన్ని ఓట్ల విషయంలో అభ్యంతరం తెలిపితే వాటిని తిరిగి పరిశీలిస్తున్నారని సమాచారం. దీనితో మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు కోటా ఓటు ఎంతో ప్రకటించే అవకాశం లేదని తెలుస్తోంది.

బీసీ నేతలకు నిరాశ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశాభంగం

నేతల్లో ఐక్యత కొరవడినందునే!

వరంగల్/నల్లగొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీసీ వాదం బలంగా వినిపించారు. బీసీ సంఘాల నేతలూ అంతా ఒక్కతాటిపైకి వచ్చినట్లు కనిపించారు. రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు సహా, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కూడా బీసీ అభ్యర్థులనే గెలిపించాలని పిలుపునిచ్చారు. కానీ, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు మాత్రం అందుకు విరుద్ధంగా వచ్చాయి. ప్రత్యేకించి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించిన వరంగల్-ఖమ్మం-నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో బీసీ వాదంతో బరిలో నిలిచిన అభ్యర్థులు 4వ, 6వ స్థానాలకు పరిమితం కావటం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 20వేల వరకు బీసీ ఓటర్లున్నారని నేతలు ప్రకటించినా.. బీసీ అభ్యర్థులకు మాత్రం ఆ ఓట్లు రాలేదు. బీసీ నినాదం, వాదంతో బరిలో దిగిన మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌కు 3,992 ఓట్లు రాగా ఆయన నాలుగో స్థానంలో నిలిచారు. కుడా మాజీ ఛైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ 2,141 ఓట్లతో ఆరో స్థానానికి పరిమితమయ్యారు. ఇందుకు కారణం.. కీలకమైన బీసీ నేతలు తలోదారిలో వెళ్లడమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీసీలు ఐక్యంగా ఒకే అభ్యర్థిని బరిలో దించి, నేతలంతా ఐక్యతగా ప్రచారం చేస్తే ఫలితం మరోలా ఉండేదని అంటున్నారు. కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం బీజేపీ అభ్యర్థి కొముయ్యకు బీసీ నేతలు మద్దతు ప్రకటించినా.. ఆ గెలుపు కమలం పార్టీ ఖాతాలోనే పడిందనే చర్చ ఉంది. ఇక కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో బీసీ సంఘాలు మద్దతు ప్రకటించిన ప్రసన్న హరికృష్ణ కూడా మూడోస్థానంలో కొనసాగుతున్నారు. దీంతో బీసీ నేతలు ఇకపై పటిష్ఠమైన భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవాలనే అభిప్రాయాలు బీసీల నుంచి వినిపిస్తున్నాయి.



కరీంనగర్‌లో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

317జీవోపై బీజేపీ పోరాటాన్ని టీచర్లు మరువలేదు

- మోదీపై నమ్మకంతోనే బీజేపీ ఎమ్మెల్సీని గెలిపించారు: బండి సంజయ్

భగత్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 317 జీవోకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటాన్ని ఉపాధ్యాయులు మరిచిపోలేదని, ప్రధాని మోదీపై నమ్మకంతో బీజేపీ మద్దతిచ్చిన ఎమ్మెల్సీని గెలిపించారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. టీచర్ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ర్యాలీ నిర్వహించి, కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను మినహాయింపును ఎప్పటికీ మరవబోమని ప్రచారంలోనే ఉపాధ్యాయులు స్పష్టం చేశారని గుర్తు చేశారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అనేక కుట్రలు చేశాయన్నారు. ఆ రెండు పార్టీలు లోపాయికారి ఒప్పందంతో కోట్ల రూపాయలు పంచినా ఉపాధ్యాయులు వారికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ విధానాలనే అవలంబిస్తే కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుందని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నాయకత్వం, దిశా నిర్దేశంలో ఇది మూడో విజయమని పేర్కొన్నారు.

త్వరలో దేశవ్యాప్త జనగణన

- ఆ తర్వాతే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్
- వారంలో రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు: లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా త్వరలో జనగణన ప్రారంభమయ్యే అవకాశం ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. ఏడాదిలో ఈ ప్రక్రియ పూర్తవుతుందని, దీని తర్వాతే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అమలు ఉంటాయని చెప్పారు. త్రిభాషా విధానం అమలుతో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం నిర్మాణానికి 90 శాతం భూ సేకరణ జరిగిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన అబద్ధమన్నారు. మామునూరు విమానాశ్రయాన్ని తామే తెచ్చామంటూ కాంగ్రెస్ నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని లక్ష్మణ్ విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రేవంత్ ప్రభుత్వ పతనానికి నాంది కాబోతున్నాయని, ఉత్తర తెలంగాణ బీజేపీకి కంచుకోటగా మారిందని అన్నారు. ఇక వారం రోజుల్లో తెలంగాణకు బీజేపీ కొత్త అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉందని లక్ష్మణ్ చెప్పారు.

మజ్లిస్ ఎటు!?




సిటింగ్ సీటును తమకే ఇవ్వాలంటున్న మజ్లిస్

- స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్దతిస్తామంటున్న కాంగ్రెస్
- సిటింగ్ సీటుకు మద్దతు ఇస్తామంటూ మజ్లిస్‌కు ఆఫరిచ్చి రెండో అభ్యర్థినీ బరిలోకి దించే యోచనలో బీఆర్ఎస్
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పై ఉత్కంఠ

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పోలింగ్ వరకూ వెళుతుందా!? కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమకున్న ఎమ్మెల్యేల సంఖ్యాబలానికే పరిమితమై ఏకగ్రీవం చేసుకుంటాయా!? ఈ ఎన్నికల్లో ఎంఐఎం పాత్రేంటి? ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం జోరుగా జరుగుతున్న చర్చ ఇది. ప్రస్తుతం ఐదు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా.. వాటిలో 4 బీఆర్ఎస్ సిటింగ్ సీట్లు కాగా.. ఒకటి మజ్లిస్ సిటింగ్ సీటు. ఎన్నికల ప్రక్రియలో 119 మంది ఎమ్మెల్యేలూ ఓటింగ్‌లో పాల్గొంటే.. బీఆర్ఎస్‌కు నికరంగా ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి ఆ పార్టీకి వచ్చేది ఒక్క సీటే. ఎన్నికల ప్రక్రియలో ఎమ్మెల్యేలంతా పాల్గొంటే.. ఒక్కో సీటులో గెలుపునకు దాదాపు 20 మంది ఎమ్మెల్యేల బలం అవసరం. బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలే ఉండడంతో అభ్యర్థిని నిలబెట్టేందుకు అవసరమైన సంఖ్యాబలం ఆ పార్టీకి లేదు. ఈ నేపథ్యంలో, ఎన్నికల ప్రక్రియకు బీజేపీ దూరంగా ఉంటే.. ఓట్ల లెక్కింపు సూత్రం ప్రకారం ఒక్కో అభ్యర్థి గెలవడానికి 19 ఓట్లు సరిపోతాయి. అంటే, బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలూ ఆ పార్టీలోనే ఉంటే కచ్చితంగా రెండు సీట్లు దక్కి ఉండేవి. కానీ, పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరుకున్న నేపథ్యంలో ఆ పార్టీకి ప్రస్తుతం నికరంగా 28 మంది ఎమ్మెల్యేల బలమే ఉంది. తద్వారా, ఒక అభ్యర్థిని గెలిపించుకున్న తర్వాత 9 ఓట్లు మిగిలి ఉంటాయి. అయితే, గతంలో బీఆర్ఎస్ సహకారంతోనే సీటును దక్కించుకున్న మజ్లిస్.. సిటింగ్ సీటును కాపాడుకునేందుకు ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీ సహకారం కోరుతోంది. అయితే, ఎమ్మెల్సీ సీట్ల కోసం కాంగ్రెస్ నేతల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్న నేపథ్యంలో.. ఈ ఎన్నికల్లో తమకు సహకరించాలని, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము సహకరిస్తామని మజ్లిస్ నేతలకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ప్రతిపాదిస్తోంది. ఈ నేపథ్యంలోనే, సిటింగ్ సీటును మజ్లిస్‌కే ఆఫర్ చేసి.. కాంగ్రెస్ గూటికి చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో కొంతమందిని తిరిగి తమ వైపునకు తిప్పుకొని రెండో సీటునూ దక్కించుకోవాలని బీఆర్ఎస్ పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, అధికార పార్టీతో సఖ్యతను వదిలేసుకుని ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో మజ్లిస్ చేతులు కలపడం ప్రశ్నార్థకమేనని అంటున్నారు. సీపీఐతో కలిసి సభలో ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీకి 66 మంది సభ్యుల బలం ఉంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలతో కలిసి ఇది 76కు చేరుకుంటుంది. సిటింగ్ సీటును తమకే కేటాయించాలన్న డిమాండ్‌ను పక్కన పెట్టి మజ్లిస్ సహకరిస్తే కాంగ్రెస్‌కు మద్దతుదారులైన ఎమ్మెల్యేల సంఖ్య 83కు చేరుకుంటుంది. అప్పుడు బీజేపీ ఓటింగ్‌లో పాల్గొన్నా.. పాల్గొనకపోయినా కాంగ్రెస్ నాలుగు సీట్లు గెలుచుకుంటుంది. అయితే, మజ్లిస్‌కు సీటు ఆఫర్ చేసి.. కాంగ్రెస్‌లో చేరిన తమ ఎమ్మెల్యేల్లో కొందరిని తిరిగి ఆకర్షించి కాంగ్రెస్ నాలుగో అభ్యర్థిని ఓడించాలని బీఆర్ఎస్ పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రహస్య బ్యాలెట్ ఓటింగ్ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ జరిగినా అనర్హత వేటు పడే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో, ఎన్నికల్లో బీజేపీ, మజ్లిస్, తిరుగుబాటు ఎమ్మెల్యేల పాత్ర కీలకంగా మారనుంది.

రాజ్యసభకు నాగబాబు?

జనసేన ప్రతిపాదన.. ఆమోదించిన సీఎం చంద్రబాబు



అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోదరుడు కె.నాగబాబుకు శాసన మండలి సభ్యత్వం కాకుండా రాజ్యసభ సీటు ఇవ్వనున్నారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ప్రకటించారు. దరిమిలా ఆయనకు తొలుత ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తారని నిన్నటివరకు అంతా భావించారు. అనూహ్యంగా ఇప్పుడు ఎమ్మెల్సీ కాకుండా రాజ్యసభ సీటు ఇవ్వాలన్న ప్రతిపాదన జనసేన నుంచే రావడంతో టీడీపీ అధినేత అందుకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. వాటిలో ఒక స్థానం నాగబాబుకు ఖాయమని తొలుత అనుకున్నారు. కానీ ఆయన రాజ్యసభ వైపు మొగ్గు చూపడంతో ఆ ఎమ్మెల్సీ స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారన్నది ఆసక్తిగా మారింది. కాగా.. వైసీపీ నేత విజయసాయిరెడ్డి రాజీనామా చేయగా ఖాళీ అయిన స్థానానికి జరిగే ఉప ఎన్నికలో నాగబాబును నిలపాలని పవన్ కల్యాణ్, చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఆ స్థానంలో బీజేపీ తన అభ్యర్థిని నిలుపుతుందన్న ప్రచారం ఉంది. ఒకవేళ ఆ సీటును నాగబాబుకు ఇచ్చేపక్షంలో.. ఆయనకు కేటాయిద్దామనుకున్న ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ అడిగే అవకాశాలు ఉన్నాయి..

ఏపీలో కూటమి విజయం

2 పట్టభద్ర ఎమ్మెల్సీలూ అధికారపక్షానివే!

గుంటూరు/ఏలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కూటమి సంపూర్ణ విజయం సాధించింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తిరుగులేని ఆధిక్యంతో ఘనంగా గెలువగా.. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలో గ్రాడ్యుయేట్లు తొలిసారి తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే విజయం సొంతం చేసుకున్నారు. పోలైన ఓట్లలో 26,909 ఓట్లు చెల్లుబాటు కాలేదు. దాంతో మిగిలిన 2,14,865 ఓట్లను లెక్కించారు. వీటిల్లో కోటా ప్రకారం 1,07,433 తొలి ప్రాధాన్య ఓట్లు వస్తే ఆ అభ్యర్థి విజేతగా నిలుస్తారు. మొదటి ప్రాధాన్య ఓట్లు లెక్కింపు పూర్తయ్యేసరికి 82,320 ఓట్ల మెజారిటీతో ఆలపాటి విజయం సాధించారు. ఆయనకు మొత్తం 1,45,057 ఓట్లు వచ్చాయి. ఉభయగోదావరి పట్టభద్రుల స్థానంలో టీడీపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి పోలైన 2,18,997 ఓట్లలో 1,24,702 ఓట్లు లభించాయి. మరో రౌండ్ ఉండగానే విజయానికి అవసరమైన మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించారు. దీంతో రాజశేఖరం 77,461 ఓట్ల ఆధిక్యంతో విజయం పొందినట్లు అధికారులు ప్రకటించారు.

క్యూఆర్ కోడ్‌తో రేషన్‌కార్డు

- లేత నీలం రంగులో.. పోస్టుకార్డు సైజులో
- కొత్తవారికి, పాతవారికి కూడా..త్వరలోనే కోటి మందికి జారీ!

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డు.. లేత నీలం రంగులో పోస్టు కార్డు కంటే కాస్త తక్కువ సైజులో ఉంటుంది! దానిపై ఎప్పట్లాగే కుటుంబ సభ్యుల వివరాలు ఫొటోలతో సహా ఉంటాయి! ఇప్పుడు అదనంగా ఓ క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది! దానిని స్కాన్ చేశారనుకోండి..! కుటుంబ సభ్యుల వివరాలు ఫొటోలతో సహా వచ్చేస్తాయి! ఈ మేరకు కార్డుల జారీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపినట్లు సమాచారం. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికే కాదు.. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుదారులకూ ఈ కొత్త కార్డులను జారీ చేయనున్నారు. ఈ దిశగా పౌర సరఫరాల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89,95,282 రేషన్ కార్డులు ఉన్నాయి. కొత్త కార్డులు, కొత్తగా సభ్యులను చేర్చడానికి మరో 18 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే వీటి పరిశీలన పూర్తయింది. పాతవి, కొత్తవి కలిపి మొత్తం కోటి రేషన్ కార్డులను ప్రభుత్వం కొత్తగా అందించనుంది.

ఒక్కో కార్డు ధర రూ.3

బోగస్, నకిలీ కార్డులను అడ్డుకోవడమే ధ్యేయంగా క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రేషన్ షాపు దగ్గరకు వెళ్లినప్పుడు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసినా లేదా కుటుంబంలోని ఏ వ్యక్తి వేలిముద్ర వేసినా రేషన్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా, ఆ కార్డులోని వ్యక్తులే రేషన్ తీసుకునేందుకు అవకాశం ఉంటుందని, ఇతరులు తీసుకునేందుకు ఆస్కారం ఉండదని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే, రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునేందుకు 'పోర్టబిలిటీ'కీ దీని ద్వారా అవకాశం ఉంది. ఒక్కో క్యూఆర్ కోడ్ కార్డుకు రూ.3 ఖర్చవుతుందని తెలిసింది. నిజానికి, 'చిప్ కార్డు'ను జారీ చేయాలని తొలుత భావించారు. దీని ధర ఒక్కో కార్డుకు రూ.31 వరకు ఉండడంతోపాటు ఎప్పుడైనా మార్పుచేర్పులు చేయడానికి, సాంకేతికంగా పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు సూచించడంతో చిప్ కార్డు ఆలోచనను విరమించుకున్నట్లు సమాచారం. క్యూఆర్ కోడ్ కార్డు అయితే మార్పుచేర్పులకూ పెద్దగా ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. కాగా, కొత్త కార్డులపై సీఎం రేవంత్‌తోపాటు సంబంధిత మంత్రి ఉత్తమ్ ఫొటోలు ఉంచాలా, లేదంటే ఎవరి ఫొటోలు లేకుండానే జారీ చేస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ లోగో మాత్రం కార్డుపై ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈసారి అందించబోయే కొత్త కార్డులను ఇంటి మహిళ పేరు మీద అందించనున్నట్లు సమాచారం.

నీళ్లు ఇవ్వరు.. ప్రాజెక్టులూ కట్టుకోనివ్వరా?

» కేంద్రం తీరుపై మంత్రి తుమ్మల మండిపాటు



హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో నీటి కేటాయింపులు చేయకుండా.. గోదావరిలో ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వకుండా తెలంగాణను కేంద్రం ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. నీటి కేటాయింపుల్లో అన్యాయానికి వ్యతిరేకంగానే తెలంగాణ ఏర్పడిందని.. అలాంటి రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపడం తగదన్నారు. రాష్ట్రంలో రాజీవ్‌సాగర్/ఇందిరాసాగర్ ప్రతిపాదించిన చోటే సీతారామ ఎత్తిపోతల పథకం పనులు చేపట్టారని, ఇప్పటిదాకా రూ.11వేల కోట్ల దాకా వ్యయం చేశారని తెలిపారు. 36 టీఎంసీల నిల్వతో బ్యారేజీ కట్టుకోవడానికి, 240మెగావాట్ల దాకా జలవిద్యుత్ ఉత్పత్తి చేసుకోవడానికి అనుకూలత ఉందన్నారు. ఎన్‌జీటీ ఆదేశాల వల్ల పదేళ్లుగా దీని నిర్మాణం ముందు కెళ్లలేదని గుర్తు చేశారు. తెలంగాణ నీటిపారుదల శాఖలో ఉన్న సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో)కు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) గుర్తింపు ఏందని, సీడీవో డిజైన్లు తయారుచేశాక, మళ్లీ డిజైన్లు పరిశీలించాలని కేంద్రం మెలిక పెట్టడం తగదని అన్నారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు తక్షణమే సాంకేతిక అనుమతులు ఇవ్వాలని కోరారు.

గల్ఫ్ అమరుల సంస్మరణ సభకు సన్నాహాలు

» వారి కుటుంబ సభ్యులతో సీఎం సహపంక్తి భోజనం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 'చనిపోయిన వారిని స్మరించండి.. బతికున్న వారి కోసం పోరాడండి' అనే స్ఫూర్తితో త్వరలో హైదరాబాద్ ప్రజాభవన్‌లో గల్ఫ్ అమరుల సంస్మరణ సభ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలంగాణ ఖనిజ వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి తెలిపారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొని వారికి భరోసా కల్పించనున్నారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో ఏ కారణంగా చనిపోయినా.. విధి నిర్వహణలో మరణం (ఆన్ డ్యూటీ డెత్)గా పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున 94 మందికి కలిపి మొత్తం రూ.4.70 కోట్ల ఆర్థిక సాయాన్ని ఇప్పటికే వారి ఖాతాల్లో జమ చేయించిందని అనిల్ పేర్కొన్నారు.

రాష్ట్రం భగభగ.. 40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణపై సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మంగళవారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సమీపానికి చేరుకున్నాయి. ఒక్క హైదరాబాద్ మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో 38 నుంచి 39 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో అత్యధికంగా 39.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. నిర్మల్, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 39.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రాగల రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండే అవకాశం లేదని తెలిపింది.

ఎల్ఆర్ఎస్ రాయితీపై అవగాహన కల్పించండి

» సమీక్షలో సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): లే-అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద ఈ నెల 31 వరకు క్రమబద్ధీకరణ రుసుము చెల్లించిన దరఖాస్తులకు ఇచ్చే రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రధానకార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ పురోగతిపై మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో నామమాత్రపు ఫీజులు చెల్లించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా సీఎస్ అధికారులకు సూచించారు. అలాగే నీట్ యూజీ పరీక్షల నిర్వహణలో రాష్ట్రానికి మంచి ట్రాక్ రికార్డు ఉందని, మే నెల 4న జరగనున్న నీట్-యూజీ పరీక్ష కోసం మౌలిక సదుపాయాలు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలను గుర్తించాలని సీఎస్ అధికారులకు ఆదేశించారు.

అన్ని వ్యాధులకు అధిక బరువే కారణం

» 'బ్రేక్ ది వెయిట్'లో ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి



యంత్రం ద్వారా బాడీ ఫ్యాట్‌ను పరీక్షించుకుంటున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చాలా వ్యాధులు అధిక బరువుతో ముడిపడి ఉన్నాయని, దానిని తగ్గించుకుంటే ఎన్నింటికో పరిష్కారం లభిస్తుందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఐటీ రంగంలో అత్యధికంగా 80 శాతం మంది అధిక బరువుతో ఉన్నారని, దీనిపై దృష్టి పెట్టాల్సి ఉందని చెప్పారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో నిర్వహించిన 'బ్రేక్ ది వెయిట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశంలో పెరుగుతున్న ఊబకాయ సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. 60 శాతం మంది భారతీయులు అధిక బరువుతో ఉన్నారని చెప్పారు. ఊబకాయం కారణంగా గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు ప్రభావితం అవుతున్నాయని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 40శాతం మంది విద్యార్థులు నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌తో బాధపడుతున్నారని చెప్పారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ సరైన ఆహారాన్ని తీసుకొని ఊబకాయాన్ని తగ్గించుకోవాలని చెప్పారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం కోసం ఫిట్ కాప్ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. అందులో 1800 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. జీవనశైలి వ్యాధులతో 300-400 మంది ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు.

రెవెన్యూ రికవరీ అధికారాలు రెరాకు

» రెరా న్యాయాధికారి ఆదేశాలు కోర్టుతో సమానం

» పలు నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ మోసాల్లో పౌరులకు సత్వర న్యాయం అందించేందుకు రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ(రెరా) నిబంధనల్లో సర్కారు కీలక మార్పులు చేసింది. తెలంగాణ రియల్ ఎస్టేట్(నియంత్రణ, అభివృద్ధి) చట్టం 2017లో ఉన్న 1(2), 2(1)(జె), 23 నిబంధనలకు సవరణ చేస్తూ వీటికి అదనంగా 23(2)ను కొత్తగా చేర్చి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ మంగళవారం జీవో 60 ఇచ్చారు. రెరా చట్టంలోని నిబంధన 2(1)(జె) కింద ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుకు సంబంధించి పనులు పూర్తయిన తర్వాత కూడా కొనుగోలుదారులకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వని నిర్మాణ సంస్థల నుంచి అపరాధ రుసుము వసూలు చేసేలా, రెవెన్యూ రికవరీ చట్టంలోని అధికారాల అమలు రెరా అథారిటీకి వర్తించేలా సవరణ చేశారు. అందులోనే మరో నిబంధన 23(1) సవరణ ప్రకారం సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేయని సంస్థల నుంచి కొనుగోలుదారు చెల్లించిన మొత్తానికి వడ్డీ, జరిమానా, పరిహారం వసూలు చేసే అధికారాలు రెరాకు ఇచ్చారు. అలాగే నిబంధన 23(2)లోని విభాగం 40(2) ప్రకారం ఈ నిబంధనలు అమలు చేయడానికి రెరాలో ఉన్న న్యాయాధికారి, రెరా అథారిటీ, రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్ జారీ చేసే ఉత్తర్వులను సివిల్ కోర్టు ఇచ్చే ఉత్తర్వులుగా రియల్ ఎస్టేట్ సంస్థలు భావించి అమలు చేయాల్సి ఉంటుంది. నిబంధన 1(2)కి సంబంధించి.. ఆయా సంస్థల నుంచి రియల్ ఎస్టేట్ సంస్థలు సకాలంలో సర్టిఫికెట్ తీసుకోకపోయినా, తీసుకున్న తర్వాత ఒప్పందం ప్రకారం చెప్పిన గడువులోగా కొనుగోలుదారుకు ఇంటిని అప్పగించకపోయినా కొత్త సవరణల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం రెరాకు కల్పించారు.

1,891 కోట్ల బకాయిలు చెల్లించండి

(మొదటిపేజీ తరువాయి)



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమైన సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

కలిశారు. ప్రహ్లాద్ జోషి నివాసంలో ఉదయం, సాయంత్రం రెండుసార్లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 2014-15 వానాకాలం సీజన్‌లో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు రూ.1,468.94 కోట్లు రావాల్సి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. పదేళ్లుగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. అప్పట్లో అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని చెప్పారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకుని రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కోరారు. 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు నాన్ నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద పంపిణీ చేసిన బియ్యానికి రూ.79.09 కోట్ల బకాయిలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గడువును ప్రతినెలా కాకుండా కనీసం నాలుగు నెలలకు పొడిగించాలని కోరారు. అప్పుడే సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని అన్నారు.

4 వేల మెగావాట్ల అనుమతిని పునరుద్ధరించండి

రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి అనుమతులు పునరుద్ధరించాలని ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో 4 వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం.. తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిందని తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్తు ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. పౌర సరఫరాల శాఖకు సంబంధించి పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై ప్రహ్లాద్ జోషితో చర్చించినట్లు తెలిపారు. సుమారు రూ.2 వేల కోట్లు కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సి ఉందని అన్నారు. బకాయిలు విడుదల చేయాల్సిందిగా కేంద్ర మంత్రిని కోరామన్నారు. అన్ని అంశాలపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

70వేల కోట్లకు అప్పు!

ఈ నెలాఖరు నాటికి చేరే అవకాశం.. బడ్జెట్‌లో వేసిన అంచనాలకు మించి సేకరణ!

» ఇప్పటికే రూ.63,586 కోట్లకు చేరిక

» మంగళవారం రూ.2వేల కోట్ల సేకరణ



హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే అప్పు నానాటికీ పెరిగిపోతోంది. ఈ నెలాఖరుకు ఆ మొత్తం రూ. 70 వేల కోట్లకు చేరనుందని అంచనా. బడ్జెట్‌లో అంచనా వేసిన అప్పుకంటే ఎక్కువగా తీసుకుంటుండడం గమనార్హం. అయితే... కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే ఈ రుణం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర జీఎస్‌డీపీ ఈసారి ఆశాజనకంగా ఉంటుందని, పైగా... పాత రుణాల కిస్తీలు, వడ్డీలను చెల్లించాల్సి వస్తోందని కేంద్రానికి వివరించినట్లు సమాచారం. నిజానికి ఈసారి బడ్జెట్‌లో మొత్తం రూ.57,112 కోట్ల రుణాలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ... కేంద్ర ప్రభుత్వం రూ.49,255 కోట్లకు మాత్రమే అనుమతి ఇచ్చింది. అయినా... ఈ చివరి త్రైమాసికం(జనవరి, ఫిబ్రవరి, మార్చి)లో మొత్తం రూ.30 వేల కోట్ల రుణాన్ని తీసుకుంటామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రతిపాదించింది. కానీ... కేంద్ర ప్రభుత్వం అంత మొత్తం అప్పునకు అనుమతి ఇవ్వలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో రూ.10 వేల కోట్లకుగాను రూ.4,800 కోట్లు, ఫిబ్రవరిలో రూ.10 వేల కోట్లకుగాను రూ.3000 కోట్ల రుణాలను మాత్రమే సేకరించగలిగింది. ఇలా జనవరి నాటికి రాష్ట్రం అప్పు రూ.58,586.64 కోట్లకు చేరింది. ఫిబ్రవరి 4న తీసుకున్న రూ.3000 కోట్లతో కలిపి ఈ రుణం రూ.61,586 కోట్లు అయ్యింది. తాజాగా మంగళవారం మరో రూ.2000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 22 ఏళ్ల కాల పరిమితి 7.27 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 24 ఏళ్ల కాల పరిమితి 7.27 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్ల చొప్పున ఈ అప్పును తీసుకున్నది. దీంతో రాష్ట్రం అప్పు మంగళవారం నాటికి రూ.63,586 కోట్లకు చేరింది. ఈ నెల 11న రూ.2,500 కోట్లు, 18న రూ.2000 కోట్లు, 25న రూ.2,500 కోట్ల రుణాలు తీసుకుంటామని చివరి త్రైమాసికం ఇండెంట్లలో భాగంగా ఆర్‌బీఐకి ప్రతిపాదించింది. అయితే... వీటికి కేంద్రం నుంచి అనుమతి లభిస్తుందా లేదా అన్నది చూడాలి. ఒకవేళ వీటికి కూడా అనుమతి లభిస్తే... రాష్ట్రం అప్పు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.70 వేల కోట్లకు చేరే అవకాశముంది. సాధారణంగా కేంద్రం అనుమతించిన మేరకే రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులను సేకరించాల్సి ఉంటుంది. జీఎస్‌డీపీని ముందస్తుగానే అంచనా వేసి రాష్ట్రాలు... వివిధ రంగాల్లో ఉత్పత్తి బాగా ఉందని, జీఎస్‌డీపీ మరింత పెరిగే అవకాశముందంటూ కేంద్రాన్ని ఒప్పిస్తాయి. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా జీఎస్‌డీపీ పెరుగుతుందంటూ కేంద్రాన్ని ఒప్పించినట్లు సమాచారం. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం... జీఎస్‌డీపీలో 3 శాతం మేర రుణాలు తీసుకునే అవకాశముంది. జీఎస్‌డీపీ మెరుగ్గా ఉంటే... రుణాలు కూడా కాస్త ఎక్కువ మేర తీసుకునే వెసులుబాటు ఉంటుంది. పాత రుణాల కిస్తీలు, వడ్డీల కింద ప్రతి నెలా తాము రూ.6,500 కోట్ల మేర చెల్లిస్తున్నామంటూ ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర రాబడులు, అప్పులు కలిపి ప్రతి నెలా రూ.18,500 కోట్ల వరకు ఉంటున్నాయని, కానీ... వ్యయాలు మాత్రం రూ.22,500 కోట్లు ఉంటున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇలాంటి ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కోడానికి అప్పుల విషయంలో రాష్ట్రానికి కాస్త వెసులుబాటు కల్పించాలని కేంద్రాన్ని కోరుతున్నారు.

వేలానికి 400 ఎకరాలు

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత వేలం వేయాలనేది టీజీఐఐసీ ప్రతిపాదన. అందుకే, కన్సల్టెంట్లను కోరుతూ ఆర్ఎఫ్‌సీ ప్రకటన ఇచ్చింది. బిడ్ దక్కించుకున్న సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో లే అవుట్ అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. విక్రయించనున్న స్థలాల వద్ద రియల్ ఎస్టేట్ విలువకు సంబంధించి మొదట ఓ నివేదిక సమర్పించాలి. తర్వాత ఇందులో కమర్షియల్, రెసిడెన్షియల్ స్థలాలతోపాటు పార్కులు, వాక్ వేలు, సైక్లింగ్, ఎకో పార్కులు వంటివి ఉండాలి. రహదారులు, సుందరీకరణ పనుల కోసం ప్రత్యేక ప్రణాళిక ఉండాలి. విడతలవారీగా అక్కడ చేపట్టబోయే మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక, అంచనా వ్యయం వివరాలు ఇవ్వాలి. ఈ వివరాలు సమర్పించాక ఐదు విడతల్లో భూములను వేలం వేయాల్సి ఉంటుంది. వేలం ద్వారా ప్రభుత్వానికి వచ్చిన మొత్తం ఆదాయంలో 0.003 శాతాన్ని సదరు సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తుంది. రియల్ ఎస్టేట్ రంగంలో సుమారు 20 సంవత్సరాల అనుభవమున్న సంస్థలకు కన్సల్టెంట్ ఎంపికలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కన్సల్టెంట్ ఎంపిక కోసం బిడ్ దాఖలు చేయడానికి ప్రభుత్వం మార్చి 15 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఇచ్చింది. దీనికి సంబంధించి ఈనెల 7న ప్రీ బిడ్ సమావేశం నిర్వహించనున్నారు. నాణ్యత, ఖర్చు ఆధారిత ఎంపిక విధానం (క్యూసీబీఎస్)లో బిడ్డర్‌ను ఎంపిక చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) కార్యాలయంలో బిడ్ దాఖలు చేయాల్సి ఉంటుంది.

రేపు క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రి మండలి సమావేశం గురువారం జరగనుంది. సచివాలయం ఆరో అంతస్తులోని క్యాబినెట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 6వ తేదీ మధ్యాహ్నం 2 గం.లకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుంది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఎస్సీ ఉప వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులపై చర్చించనున్నారు. ఈ బిల్లుల ఆమోదం కోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ అసెంబ్లీ సమావేశాల తేదీలను కూడా ఈ క్యాబినెట్ భేటీలో నిర్ణయిస్తారు.



గాంధీ ఆస్పత్రిలో వైద్యుల హాజరు రిజిస్టర్ పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

'గాంధీ'లో మంత్రి దామోదర తనిఖీలు

వైద్యులు, ప్రొఫెసర్ల గైర్హాజరుపై ఆగ్రహం

20 మందికి నోటీసులు ఇవ్వాలని ఆదేశం

అడ్డగుట్ట/హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆస్పత్రికి చేరుగానే నేరుగా ఔట్ పేషెంట్ వార్డుకు వెళ్లిన మంత్రి... రోగులతో మాట్లాడారు. గాంధీ ఆస్పత్రిలో అందుతున్న సేవలు, మందుల సరఫరాపై ఆరా తీశారు. ఆ తర్వాత ఓపీ వార్డు వెనుక వైపు ఉన్న మదర్ అండ్ చైల్డ్ సెంటర్ (ఎంసీహెచ్)వార్డులో తనిఖీలు చేశారు. ఈ సెంటర్‌లోని 5వ అంతస్తులో విధులు నిర్వర్తిస్తున్న నర్సులు, గైనకాలజీ విభాగాధిపతులతో మాట్లాడారు. వైద్య రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లు తీసుకురావాలని మంత్రి ఆదేశించగా.. అరగంట వరకూ జాప్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ డాక్టర్ ఎన్ని గంటలకు వస్తున్నారన్న సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఇలాగైతే కష్టమేనని వైద్యులు, నర్సులపై మండిపడ్డారు. ఉదయం 12 గంటలకు కూడా ఓపీకి రాని వైద్యుల వివరాలతో నివేదిక తయారు చేసి, తన వద్దకు తీసుకురావాలని ఆదేశించారు. ఓపీలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు కనిపించకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించి ఎనిమిది నెలలు అవుతున్నా.. సేవలు ప్రారంభించకపోతే ఎలా? అని నిలదీశారు. మంత్రి పర్యటించినప్పుడు సుమారుగా 20 మంది విధుల్లో లేరని తెలిసింది. ఈ సందర్భంగా వారందరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని వైద్య విద్య సంచాలకుడు నరేంద్రకుమార్‌ను మంత్రి ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు.

'నర్సింగ్ కౌన్సిల్' అక్రమాలపై విచారణ!

నర్సింగ్ కౌన్సిల్‌లో జరుగుతున్న అక్రమాలపై 'నర్సింగ్ కౌన్సిల్ పైసా వసూల్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనం కలకలం సృష్టించింది. కౌన్సిల్ అధికారుల వసూళ్ల పర్వంపై మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఆరోగ్య శాఖ కార్యదర్శిని ఆదేశించారు. కాగా, కౌన్సిల్ అక్రమాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ బృందాలూ రంగంలోకి దిగాయి. కాలేజీల నుంచి వసూళ్ల పర్వంపై పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించే పనిలో ఉన్నాయి.

పదవుల కోసం పైరవీలు వద్దు

» పని చేసేవారి వివరాలు తెప్పించుకుంటా

» కష్టపడే వారికి న్యాయం జరుగుతుంది

» ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

» పార్టీ అంశాలు బయట మాట్లాడితే వేటు

» రాహుల్‌ను పీఎం చేసేందుకు కృషిచేయండి: మీనాక్షి నటరాజన్



లోక్ సభ నియోజకవర్గ నేతలతో సమావేశంలో మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): "మీరు పదవుల కోసం పైరవీలు చేయాల్సిన అవసరం లేదు. పార్టీ కోసం కష్టపడుతున్న వారి వివరాలను నేనే స్వయంగా తెప్పించుకుంటాను. కచ్చితంగా న్యాయం చేస్తాను" అని.. మెదక్, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ నేతలకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా.. కులగణన ద్వారా అణగారిన కులాలకు జరిగే ప్రయోజనం, వర్గీకరణ అంశాలకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. పార్టీలో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తామని, పార్టీ అంతర్గత విషయాలను బయట మాట్లాడితే వేటు పడటం ఖాయమని హెచ్చరించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో.. మెదక్, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ నేతలతో మంగళవారం ఆమె వేర్వేరుగా సమావేశమయ్యారు. మెదక్ నియోజకవర్గ సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి, పార్టీ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఇతర నాయకులు పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ రెండు సమావేశాల్లోనూ పార్టీ నేతలకు మీనాక్షి దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియా వేదికగా బీజేపీ, బీఆర్ఎస్‌ను విమర్శించాల్సిన నేతలు.. సొంతపార్టీ నేతలపైనే ఎక్కువగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీలో ఏదైనా అన్యాయం జరిగినా, అంతర్గతంగా సమస్యలున్నా నేరుగా తనకు చెప్పాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు ఎందుకు తగ్గాయంటూ పార్టీ నేతలను ఆమె ఆరా తీయగా.. బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి భారీగా బదిలీ అయ్యాయని, ఈ నేపథ్యంలోనే ఓట్లు తగ్గాయని రెండు నియోజకవర్గాల నేతలూ వివరించారు. కాగా.. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలు అందుతున్నా సరిగా అందట్లేదంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందనే విషయాన్ని నేతలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా పని చేస్తూ బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టాలని మీనాక్షి సూచించారు. నియోజకవర్గాల ఇన్‌చార్జులు బాధ్యతతో పని చేయాలని.. వారి వల్ల సమస్యలు వస్తే వారిని తొలగిస్తామని స్పష్టంచేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తమను ఇబ్బంది పెడుతున్నారంటూ స్థానిక నేత కాట శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కోసం వేసిన కమిటీ ఇంతవరకూ నివేదిక ఇవ్వలేదని తెలిపి.. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనికి ఆమె.. పాత, కొత్త నేతల సమస్యలు ఉన్న చోట్ల సమన్వయ కమిటీలు వేసుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశాల్లో పాల్గొన్న మహేశ్‌కుమార్ గౌడ్.. పార్టీలో కొత్త, పాత నేతలు ఐక్యతతో ముందుకు సాగాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలని.. మండల కమిటీల పనితీరుపైన పునః సమీక్ష చేసుకోవాలని సూచించారు. కాగా.. మీనాక్షి నటరాజన్ బుధవారం గాంధీభవన్‌లో పార్టీ అనుబంధ సంఘాల చైర్మన్లతో భేటీ కానున్నారు. అనంతరం ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

సకల సదుపాయాలతో అర్బన్ పార్కులు

» హైదరాబాద్ చుట్టూ 59 చోట్ల

» సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పని చేసుకునేలా తీర్చిదిద్దాలి

» పీపీపీ పద్ధతిలో టూరిజం ప్రాజెక్టులు

» అధికారులతో భట్టి విక్రమార్క, జూపల్లి

హైదరాబాద్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ప్రజల మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి హైదరాబాద్ చుట్టూ సకల సదుపాయాలతో అర్బన్ పార్కులను అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. హైదరాబాద్ చుట్టూ 59 బ్లాక్‌లను గుర్తించి అర్బన్ పార్కులుగా అభివృద్ధి చేయడానికి ఇప్పటికే అటవీ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, టూరిజం శాఖ సైతం కొత్త ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలని సూచించారు. సచివాలయంలో మంగళవారం ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక, పురావస్తు శాఖలకు సంబంధించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో వారు మాట్లాడారు. వర్క్ ఫ్రం హోం చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని, ఆయా ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులను తీసుకురావాలన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అక్కడికి వచ్చి పని చేసుకోవడానికి కావలసిన ఆహ్లాదకరమైన వాతావరణం, వసతులు, తగిన భద్రత, వైఫై తదితర సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పీపీపీ పద్ధతిలో టూరిజం ప్రాజెక్టులను చేపట్టడానికి చాలా సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని, ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కాగా, వచ్చే ఏడాది నిర్వహించనున్న సమ్మక్క-సారలమ్మ జాతర, సరస్వతి (గోదావరి) పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. దేవాదాయ, అటవీ-పర్యావరణ శాఖల బడ్జెట్ ముందస్తు సమావేశం సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.వందల కోట్లతో నిర్మించనున్న రహదారులు, పుష్కర ఘాట్లు భవిష్యత్తులోనూ ఉపయోగపడేలా ఉండాలన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్ ప్రాంతాలను తీర్చిదిద్దాలని సూచించారు. ఆరు ప్రధాన ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై చర్చించారు.

నిమ్స్‌కు గణనీయంగా పెరిగిన రోగుల రాక

» 2024లో 9.2 లక్షల మందికి చికిత్స

» నిమ్స్ ఫ్యాకల్టీ అసోసియేషన్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నిమ్స్‌కు రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకు అనుగుణంగా మెరుగైన వైద్య సేవలు, చికిత్సలు అందించడానికి నిమ్స్ ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని నిమ్స్ ఫ్యాకల్టీ అసోసియేషన్ తెలిపింది. నిమ్స్‌లో జరిగిన ఫ్యాకల్టీ సమావేశం అంశాలను అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ భూషణ్ రాజు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నిమ్స్‌లో 2022లో 6.6 లక్షల మంది రోగులు చికిత్స పొందగా 2024 నాటికి ఆ సంఖ్య 9.2 లక్షలకు చేరిందని వివరించారు. టీఎంవీఆర్ సర్జరీ, అధునాతన డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ వంటి అరుదైన శస్త్రచికిత్సలు చేసినట్లు చెప్పారు. అవయవ మార్పిడి శస్త్రచికిత్సలలో నిమ్స్ ముందంజలో ఉందని, జన్యు వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో పురోగతి సాధించిందని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద డయాలసిస్ యూనిట్లలో ఒకటిగా నిమ్స్ ఉందని చెప్పారు. సంచాలకులు బీరప్ప నగరి నాయకత్వంలో నిమ్స్ కొత్త శిఖరాలకు చేరుకుంటుందన్నారు. ఆస్పత్రికి అవసరమైన సహకారం అందిస్తున్న ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముడు


మృతుడు మహేశ్(ఫైల్)

మాసాయిపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తోడబుట్టిన అన్న ప్రాణాలనే తీశాడో తమ్ముడు. ఈ విషాద ఘటన మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో జరిగింది. మాసాయిపేటకు చెందిన దుంపల మహేశ్ (38), దుంపల చందు అన్నదమ్ములు. ఇద్దరికీ వివాహం కాగా వారిని వారి భార్యలు వదిలేసి వెళ్లారు. దాంతో అన్నదమ్ములిద్దరూ వారసత్వంగా వచ్చిన పెంకుటింట్లో వేర్వేరు గదుల్లో ఒంటరిగానే బతుకుతున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అన్నదమ్ములిద్దరికీ ఉమ్మడిగా అరెకరం పొలం ఉంది. దాని విలువ రూ.30 లక్షల వరకు ఉంటుంది. మద్యానికి బానిసైన చందు.. తన అన్న మహేశ్ చనిపోతే ఆ భూమి మొత్తం తనకే వస్తుందని అంటుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి మంచంపై నిద్రిస్తున్న మహేశ్‌ను గొంతు నులిమి చంపేశాడు. దానిని ఆత్మహత్యగా చిత్రీకరించాలని భావించి మృతదేహాన్ని పక్కన దూలానికి తాడు కట్టి వేలాడదీశాడు. ఉదయాన్నే తన అన్న ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులకు, స్నేహితులకు చెప్పాడు. మహేశ్ మృతదేహం, అక్కడి పరిసరాలను చూస్తే ఆత్మహత్య చేసుకున్నట్లు అనిపించకపోవడం, చందు పొంతన లేకుండా మాట్లాడుతుండడంతో అనుమానం వచ్చి వారి సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు చందును అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.

జోగులాంబ ఆలయ అర్చకుడు
ఆనంద్‌శర్మపై చర్యలకు రంగం సిద్ధం

- కోర్టులో చార్జిషీటు దాఖలు చేసిన పోలీసులు
- చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మపై కర్నూలు పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి, ఆయనపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తన కుటుంబంతో కలిసి సినిమాకు వెళ్లిన క్రమంలో ముఖానికి మాస్క్ ధరించిన ఒక వ్యక్తి ఎమ్మెల్యే, ఆయన కుటుంబసభ్యులను సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశారు. అది గమనించిన ఎమ్మెల్యే వ్యక్తిగత ఫొటోలు ఎందుకు తీస్తున్నావంటూ ప్రశ్నించడంతో ఆ వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆ వ్యక్తిని జోగులాంబ ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మగా గుర్తించిన విజయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుటుంబ వివరాలను రహస్యంగా తెలుసుకోవడానికి ప్రయత్నించడం వెనుక కుట్ర ఉందని అనుమానించిన విజయుడు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన కలెక్టర్ కర్నూలు పోలీసులతో మాట్లాడిన తర్వాత దర్యాప్తు వేగవంతమైంది. తాజాగా కర్నూలు పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి శర్మపై చర్యలు తీసుకోవాలని జోగులాంబ ఆలయ ఈవోకు లేఖ పంపారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు త్వరలో ఆనంద్‌శర్మపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

70 కోట్ల చిట్‌ఫండ్ స్కామ్.. నలుగురి అరెస్టు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ముసుగులో చిట్టీలు ప్రారంభించి, ఆ డబ్బును సొంత అవసరాలకు మళ్లించుకున్న నలుగురు మోసగాళ్లను అరెస్టు చేశామని సీఐడీ డీజీ శిఖా గోయల్ తెలిపారు. శంకర్‌పల్లి వీరభద్రీయ సహకార పరపతి సంఘం ఏర్పాటు చేసిన నిర్వాహకులు.. అందులోని సభ్యులకు ఆశ చూపి అనధికారికంగా చిట్టీల వ్యాపారాన్ని ప్రారంభించారు. చిట్టీల కాలపరిమితి ముగిసినా సొమ్ము చెల్లించకపోవడంతో పాశం వేణుగోపాల్ రెడ్డి 2022లో శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా, 1300 మందిని రూ.70కోట్ల మేర మోసం చేసినట్లు తేలింది. ఆ తర్వాత ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. సుదీర్ఘ విచారణ తర్వాత పరపతి సంఘంలో కీలక పాత్ర పోషించిన చవ్వా కుమార్, చవ్వా యాదగిరి, చవ్వా చిన్న ఇస్తారి, చవ్వా వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు శిఖాగోయల్ తెలిపారు.

25 ఎకరాల ప్రభుత్వ భూమిలో
ఒక్క ప్లాటుకు ఎన్‌ఓసీ ఇస్తారా?

- కలెక్టర్‌కు ఆ అధికారం ఉందా?
- ప్రశాంతి హిల్స్ సమస్యపై హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతి హిల్స్‌లోని 25 ఎకరాల ప్రభుత్వ భూమిలోని ఓ ప్లాటుకు రంగారెడ్డి కలెక్టర్ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఆ భూమిపై ప్రభుత్వానికి ఆసక్తి లేదా? ఎన్‌ఓసీ ఇచ్చే అధికారం కలెక్టర్‌గా ఉందా అని ప్రశ్నించింది. దీనిపై పూర్తిస్థాయి వివరాలతో కౌంటర్ దాఖలు చేయకపోతే కేసును సీబీఐకిగానీ ఈడీకిగానీ అప్పగిస్తామని హెచ్చరించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, రాయదుర్గ్ నౌఖస్లా గ్రామపరిధిలోని ప్రశాంతిహిల్స్ సర్వే నెంబర్ 66/2లో ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న 25 ఎకరాల్లో ఉన్న ప్లాట్ నెంబర్ 211/బీ (200 చదరపు గజాలు)లో భవన నిర్మాణం చేసుకోవచ్చని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 2023 సెప్టెంబర్‌లో ఎన్‌వోసీ ఇచ్చారు. ఇలా ఇవ్వడం చెల్లదని పేర్కొంటూ ఏ చెన్నమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అసలు ఏ చట్టప్రకారం జిల్లా కలెక్టర్‌లు ఎన్‌వోసీ ఇస్తున్నారని ప్రశ్నించింది.

సీఏ ఇంటర్ ఫలితాల్లో
టాపర్‌గా హైదరాబాద్ అమ్మాయి

- 521 మార్కులతో సత్తా చాటిన దీపాన్షీ అగర్వాల్
- 86 % స్కోర్‌తో రెండో స్థానంలో విజయవాడ అబ్బాయి


దీపాన్షీ అగర్వాల్.

హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సీఏ ఇంటర్ పరీక్షల ఫలితాల్లో హైదరాబాద్‌కు చెందిన దీపాన్షీ అగర్వాల్ జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) మంగళవారం విడుదల చేసిన ఈ ఫలితాల్లో దీపాన్షీ 86.63 శాతం స్కోర్‌తో 600 మార్కులకు 521 మార్కులు సాధించి జాతీయస్థాయిలో తొలి స్థానం సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా దీపాన్షీ మాట్లాడుతూ.. రోజుకు 8-10 గంటల వరకు చదివానని, తన తండ్రి ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఈ ఫలితాల్లో విజయవాడకు చెందిన తోట సోమనాథ్ శేషాద్రి నాయుడు 86 శాతం స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచారు.

రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యం

- చిట్యాల మండలంలో విజిలెన్స్ తనిఖీలు

చిట్యాల రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యాన్ని బియ్యంగా మారుస్తున్నట్లు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. ఆయా మిల్లుల యజమానులపై కేసులు పెట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకలలోని జైహనుమాన్, వట్టిమర్తిలోని శ్రీజ కార్పొరేషన్ రైస్‌మిల్లుల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించింది. జై హనుమాన్ రైస్‌మిల్లులో అనుమానాస్పదంగా కనిపించిన 16 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించిన అధికారులు.. బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కలిసి ఉండటంతో రేషన్ బియ్యంగా నిర్ధారించుకున్నారు. వాటిని సీజ్ చేశారు. శ్రీజ రైస్‌మిల్లులో ప్రభుత్వ గన్నీ బ్యాగులు, అక్కడ నిల్వ చేసిన 460 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. ఇతర రైస్ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ ధాన్యాన్ని శ్రీజ మిల్లులో బియ్యంగా మారుస్తున్నట్లు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని నల్లగొండలోని గోదాంకు తరలించారు.

ఎస్‌ఎల్‌బీసీ కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ

- నేటి నుంచి రోజుకు 800 టన్నుల మట్టి బయటకు
- గల్లంతైన వారి జాడ దొరికిందని పుకార్లు

నాగర్‌కర్నూల్/అచ్చంపేట/దోమలపెంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రానికి బెల్టు పనిచేయడం ప్రారంభం కావడంతో సహాయక చర్యల్లో వేగం పుంజుకుంది. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగి 11 రోజులయినా మట్టి తరలింపు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. లోకో ట్రైన్ ద్వారా టిప్పర్ మట్టిని కూడా బయటకు తేలేకపోతున్నామని సహాయక బృందాలు ఆదివారం టన్నెల్ వద్దకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపాయి. దీంతో యుద్ధ ప్రాతిపదికన కన్వేయర్ బెల్టును పునరుద్ధరించాలని సీఎం ఆదేశించడంతో పనులు చకచకా జరిగిపోయాయి. టన్నెల్‌లో 5 వేల టన్నుల మట్టి ఉందని అంచనా వేస్తుండగా బుధవారం నుంచి బెల్టు ద్వారా రోజుకు 800 టన్నుల మట్టిని బయటకు తేగలుగుతామని సహాయక బృందాలు అంచనా వేస్తున్నాయి. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. టన్నెల్‌లో గల్లంతైన వారి జాడ దొరికిందని మంగళవారం కూడా పుకార్లు షికార్లు చేశాయి. గల్లంతైన వారిలో ఇద్దరి మృతదేహాలు దొరికాయంటూ వార్తలు ప్రసారం కావడంతో ఉత్కంఠ నెలకొంది.


టన్నెల్ నుంచి కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు వస్తున్న మట్టి


కన్వేయర్ బెల్టు ద్వారా వచ్చిన మట్టితో రేగిన దుమ్ముపై నీరు పడుతున్న సిబ్బంది

ఇది రాచరిక పాలన కాదు

అధికారాన్ని ప్రజలపై బుల్డోజర్ నడపడానికి కాక.. వారి సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలి

- ప్రజా ఉద్యమాల ఐక్యవేదిక సదస్సులో మీనాక్షి నటరాజన్
- చరఖాతో నూలు వడికిన మీనాక్షి
- పార్టీ కండువా కప్పబోయిన కార్యకర్తకు మందలింపు
- మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును సమీక్షించాలి: మేధాపాట్కర్


ప్రజా ఉద్యమాల ఐక్యవేదిక సదస్సులో మాట్లాడుతున్న మీనాక్షి నటరాజన్, చిత్రంలో కోదండరాం, మేధాపాట్కర్

హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "ప్రజాస్వామ్యంలో అణచివేతకు తావులేదు. ప్రజా ఉద్యమాలను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి.. ఎవరైనా సరే, ప్రజాభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటామంటే కుదరదు. ఏకపక్షంగా పాలన సాగించడానికి ఇదేమీ రాచరికం కాదు" అని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. అధికారాన్ని ప్రజలపై బుల్డోజర్ నడపడానికి కాక.. వారి సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని సూచించారు. మూసీ నిర్వాసితులతో సంభాషించడానికి వెళ్లిన మేధాపాట్కర్‌ను సోమవారం స్థానిక పోలీసులు అడ్డగించడాన్ని ఆమె నిరసించారు. ఈ చర్య ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదన్నారు. ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజకీయ పార్టీలు, ప్రజా ఉద్యమాల పాత్ర' అంశంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి మీనాక్షి నటరాజన్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. అయితే.. తానొక రాజకీయ పార్టీ ప్రతినిధిగా కాక సర్వోదయ ఉద్యమ కార్యకర్తగా ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. రాజకీయ పార్టీలు గతి తప్పినప్పుడు వాటిని సరైన దిశగా తీసుకెళ్లగలిగేవి ప్రజా ఉద్యమాలు మాత్రమేనని, ఆందోళనకారులను ప్రభుత్వాలు శత్రువుల్లా భావించకూడదని గట్టిగా చెప్పారు. "మధ్యప్రదేశ్ సీఎంగా దిగ్విజయ్ సింగ్ ఉన్న సమయంలో, ముఖ్యమంత్రి కార్యాలయం ఎదుట రోజంతా నిరసనలు కొనసాగేవి. సాయంత్రమైతే ఉద్యమకారులు, పాలనాధికారులు కలిసి చోళే బఠానీ తింటూ కబుర్లాడుకునేవారు" అని ఆమె గుర్తుచేసుకున్నారు. కొన్నేళ్లుగా మారిన రాజకీయ పరిస్థితుల రీత్యా, ప్రభుత్వాలు ప్రజా శ్రేయస్సు కన్నా, కార్పొరేట్ల ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్నాయని విమర్శించారు. ఆ క్రమంలో పౌరులకు, పర్యావరణానికి శ్రేయస్కరం కాని విధానాలు రూపొందిస్తుండడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్స్ సమస్యలన్నీ ఒక్కటే కనుక, వారి హక్కులసాధనకు జాతీయ స్థాయి సంఘాన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి తెలంగాణకు చెందిన షేక్ సలావుద్దీన్ వంటి కార్యకర్తలు ముందుకు రావాలని సూచించారు. జాతీయ స్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు వంటి విషయాలపై సేవాగ్రామ్‌లో కాంగ్రెస్ నేతలకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి సైతం అందాలన్న గాంధీజీ 'అంత్యోదయ' సూత్రాన్ని పాలకులు ఆకళింపు చేసుకోవాలని సూచించారు. కాగా.. ఈ సదస్సుకు ఆమె నిర్ణీత సమయానికి పదినిమిషాల ముందే వచ్చారు. వెంట ఎలాంటి మందీమార్బలం లేకుండా సాదాసీదాగా సభా స్థలానికి విచ్చేశారు. 45 నిమిషాలకుపైగా నేలమీద కూర్చొని.. తన వెంట తెచ్చుకున్న చరఖాతో నూలు వడికారు. ఆమె ప్రాంగణం నుంచి వెళుతున్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు పార్టీ కండువా కప్పడానికి ప్రయత్నించగా.. 'అందుకు ఇది వేదిక కాదు' అని మందలించారు. మహిళల ఆత్మగౌరవానికి, తెలంగాణ స్ఫూర్తికి విరుద్ధమైన ప్రపంచ సుందరి పోటీలను సీఎం రేవంత్‌కు చెప్పి ఆపించాలని పీవోడబ్ల్యూ సంధ్య విన్నవించగా మీనాక్షి సానుకూలంగా స్పందించారు. కాగా.. అమరావతి ప్రాజెక్టును ప్రపంచబ్యాంకు సమీక్షిస్తున్నట్టే, మూసీ ప్రాజెక్టును సమీక్షించాల్సిన అవసరం ఉందని ఈ సదస్సులో పాల్గొన్న సామాజిక ఉద్యమకారిణి మేధా పాట్కర్ అభిప్రాయపడ్డారు.

వరి సాగులో యూరియా వాడకం తగ్గనుంది!

- భవిష్యత్తులో కొత్త వంగడాలతో సాధ్యమే
- ఇర్రి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజయ్ కోహ్లీ

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో యూరియా వాడకాన్ని తగ్గించేలా పరిశోధనలు జరుగుతున్నాయని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇర్రి) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, శాస్త్రవేత్త అజయ్ కోహ్లీ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నూతన వరి వంగడాలతో ఇది సాధ్యమేనని చెప్పారు. దీని వల్ల నేల నాణ్యతతోపాటు ప్రజల ఆరోగ్యమూ మెరుగుపడుతుందని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన "భవిష్యత్తు బాగు కోసం వరి పరిశోధన" అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొన్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ రూపొందించిన వరి వంగడాలతో ఆసియా ఖండంలో ఆహార భద్రత సాధ్యమైందని, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ నుంచి విడుదలైన ఐఆర్-8, ఐఆర్-64 రకాలు అత్యధికంగా సాగులో ఉన్నాయని చెప్పారు. తద్వారా భారత్‌లో వరి సాగు, దిగుబడులు గణనీయంగా పెరిగాయన్నారు. వరల్డ్ ఫుడ్ ప్రైజ్ అవార్డు గ్రహీత మహంతి మాట్లాడుతూ ఆగ్నేయ ఆసియా దేశాల అవసరాలకు అనుగుణంగా తెలంగాణలో వరి సాగును ప్రోత్సహించాలని, తద్వారా రైతుల ఆదాయంతోపాటు ఎగుమతులు పెరుగుతాయన్నారు. అంతకుముందు యూనివర్సిటీలోని వరి పరిశోధన సంస్థను అజయ్‌కోహ్లీ సందర్శించారు. అక్కడ జరుగుతున్న పరిశోధనల గురించి శాస్త్రవేత్తలతో మాట్లాడి, వారిని అభినందించారు. అనంతరం సచివాలయానికి వెళ్లి వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో భేటీ అయ్యారు.

అరవకుండా మత్తుమందు ఇచ్చి..
కొట్టి, గొంతు నులిమి..

- శిరీషను భర్త, ఆడపడుచే చంపినట్టు పోలీసుల ప్రాథమిక నిర్ధారణ?
- ప్రేమించినట్లు నటించి శిరీషను మూడో పెళ్లి చేసుకున్న వినయ్
- మొదటి భార్యను కూడా ఇలాగే చంపినట్లు విచారణలో వెల్లడి!

చాదర్‌ఘాట్/హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ పరిధిలో జరిగిన వివాహిత సింగం శిరీష మృతి కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. శిరీషను ఆమె భర్త వినయ్‌కుమార్, ఆడపడుచు కలిసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. శిరీష కన్నా ముందు ఇద్దరు మహిళలను పెళ్లి చేసుకున్న వినయ్ కుమార్.. మొదటి భార్యను ఇలాగే హత్య చేయగా, రెండో భార్య అతని వేధింపులు భరించలేక ఇల్లు వదిలి పారిపోయినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. పోలీసు వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం.. శిరీషను కూడా వారు కొంతకాలంగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. తల్లిదండ్రులు, బంధువుల అండదండలు లేని శిరీష వారి వేధింపులను చాలాకాలం మౌనంగా భరించింది. కానీ, ఇటీవల వేధింపులు మరీ ఎక్కువ కావడంతో భర్తతో తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం అర్ధరాత్రి శిరీషకు ఆమె ఆడపడుచు సరితకు మధ్య గొడవ తలెత్తింది. ఇద్దరూ ఒకరిపై మరొకరు తీవ్రస్థాయిలో పరుష పదజాలాలతో దుర్భాషలాడుకున్నారు. క్షణికావేశానికి గురైన ఆడపడుచు శిరీషను కొట్టింది. దీంతో శిరీష ఆమెపై ఎదురు తిరగడంతో భర్త వినయ్‌కుమార్ కూడా తన సోదరి సరితకు తోడుగా దాడికి దిగాడు. ఎలాగైనా శిరీష అడ్డు తొలగించుకోవాలని వినయ్, సరిత పథకం వేశారు. అతడు మెడికల్ రిప్రజెంటేటివ్ కావడంతో.. శిరీషకు బలవంతంగా మత్తు ఇంజక్షన్ ఇచ్చాడు. ఆమె మత్తులోకి జారుకున్న తర్వాత గొంతు నులిమి, దిండుతో అదిమిపట్టి ఊపిరాడకుండా చేసి దారుణంగా హత్య చేశారు. ఆదివారం ఉదయం ఏమీ తెలియనట్టు.. అన్న, చెల్లెలు ఇద్దరూ కలిసి శిరీషకు ఛాతీలో నొప్పి వచ్చిందని నాటకం ఆడుతూ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెను పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శిరీష మృతదేహాన్ని వెంటనే దహనం చేసేందుకు.. వినయ్, సరిత కలిసి అంబులెన్స్‌లో వారి స్వగ్రామానికి బయల్దేరారు. కానీ, శిరీష మేనమామ మధుకర్ ఫిర్యాదుతో వారి పథకం పారలేదు. పోలీసులు వినయ్‌తో పాటు, అతని సోదరి సరితను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

తల్లిదండ్రులు లేరని తెలిసే..

శిరీషకు తల్లిదండ్రులు లేరని తెలుసుకున్న వినయ్ కుమార్ ఒక పథకం ప్రకారమే ఆమెను ప్రేమిస్తున్నట్లు నటించి పెళ్లి చేసుకున్నాడు. అతని నేర చరిత్ర గురించి తెలియని శిరీష .. ప్రేమ మైకంలో పడి, తనను పెంచుకున్న తల్లిదండ్రులను కాదనుకొని మరీ వినయ్ కోసం ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. కానీ.. పెళ్లయిన కొద్దిరోజుల నుంచే శిరీషను వినయ్ కుమార్, ఆడపడుచు సరిత, ఇతర కుటుంబసభ్యులు వేధించడం ప్రారంభించారని.. చివరకు భర్త, ఆడపడుచు కలిసి శిరీషను దారుణంగా హత్య చేశారని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.

ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం!

నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి.. నిజాంపేటలోని గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న గాయని


అపస్మారక స్థితిలో కల్పన

హైదర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నేపథ్య గాయని కల్పన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కల్పన బహుభాషా నేపథ్య గాయని. కేవలం గాయనిగానే కాకుండా డబ్బింగ్ ఆర్టిస్టుగా, నటిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రముఖ గాయకుల్లో కల్పన ఒకరు. 27 ఏళ్లుగా పాటలు పాడుతున్నారు. దేశవిదేశాల్లో 3000కు పైగా సంగీత ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆమె బిగ్‌బాస్ షోలో కూడా పాల్గొన్నారు. ఈటీవీ నిర్వహించిన స్వరాభిషేకం కార్యక్రమంతో ఆమె బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు. మహాశివరాత్రి రోజున సంగారెడ్డిలో నిర్వహించిన సంగీత విభావరిలో పాల్గొని పాటలు పాడారు. ఆమె హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఉన్న వర్టెక్స్ ప్రివిలేజ్ విల్లాస్‌లో నివాసం ఉంటున్నారు. రెండు రోజులుగా ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది అసోసియేషన్‌కు సమాచారం ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు ఆమెకు ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో ఆమె భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పారు. చెన్నైకి చెందిన ఆమె భర్త ప్రసాద్ కూడా మంగళవారం ఉదయం నుంచి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆయన కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి ప్రధాన ద్వారం తీసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఇంటి వెనక వంట గది నుంచి లోపలికి వెళ్లారు. అప్పటికే కల్పన అపస్మారక స్థితిలో మంచంపై పడి ఉన్నారు. ఆమె నిద్ర మాత్రలు మింగినట్లు గుర్తించారు. హుటాహుటిన కల్పనను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని.. ఆమె పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కల్పన భర్త ప్రసాద్ కూడా ఆస్పత్రికి చేరుకున్నారు. అతన్ని పోలీసులు ఇంటికి తీసుకెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న కల్పనను చూసేందుకు సునీత, గీతామాధురి, శ్రీకృష్ణ, కారుణ్య తదితరులు ఆస్పత్రికి వచ్చారు.

ఎన్నో ఆటుపోట్లు..

జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నానని కల్పన పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. 2010లో భర్తతో విడాకులు తీసుకున్న సమయంలో ఎదురైన సమస్యలతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని.. అప్పుడు ప్రముఖ గాయని చిత్ర తనకు ధైర్యం చెప్పారని ఓ ఇంటర్వ్యూలో కల్పన చెప్పారు. భర్తతో విడిపోయిన తర్వాత కుటుంబాన్ని పోషించుకోవడం కష్టమైందని, పిల్లలను చదివించుకోలేకపోయానని కూడా ఆమె ఇంటర్వ్యూలో వెల్లడించారు. చిత్ర సూచన మేరకు పాటల పోటీలో పాల్గొని గెలవడంతో తన కష్టాలు తీరాయని చెప్పారు. బలమైన వ్యక్తిత్వం ఉన్న మహిళగా కల్పనకు చిత్ర పరిశ్రమలో గుర్తింపు ఉందని, అలాంటి వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించారంటే ఏదో బలమైన కారణమే ఉండి ఉంటుందని సన్నిహితులు అభిప్రాయపడుతున్నారు.

ఐటీడీఏల్లో అక్రమ డిప్యుటేషన్లు

- గిరిజన ప్రాంతాల్లో పని చేయాల్సిన.. వైద్యులు, సిబ్బంది ఇతర ప్రాంతాలకు
- కలెక్టర్, పీవోకు తెలియకుండానే బదిలీ
- డీఎంహెచ్‌వోలకు పైసలిచ్చి డిప్యుటేషన్లు
- ఏజెన్సీలోనే పనిచేస్తున్నట్లు జీత భత్యాలు
- వైద్య సిబ్బంది కొరతతో గిరిజనులకు కష్టం

హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐటీడీఏ)ల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జిల్లా వైద్యాధికారులు అక్రమ డిప్యుటేషన్లు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకించి ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని ఐటీడీఏల పరిధిలో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతేడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం అన్ని రకాల డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లను రద్దు చేసింది. ఎవరికైనా డిప్యుటేషన్ ఇవ్వాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని పేర్కొంది. అలాగే జిల్లాల్లో అత్యవసర పరిస్థితుల్లో డిప్యుటేషన్ ఇవ్వాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. అయితే ఐటీడీఏ ప్రాంతాల్లో మాత్రం ఐఏఎస్ అధికారి అయిన ప్రాజెక్టు ఆఫీసర్(పీవో), అడిషనల్ డీఎంహెచ్‌వో(ట్రైబల్) అనుమతులు తీసుకోవాలి. కానీ వీరి అనుమతి లేకుండా గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌వోలు ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లపై పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి. కలెక్టర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు ప్రజారోగ్య సంచాలకులు పట్టించుకోకపోవడంతో అక్రమ డిప్యుటేషన్లను యథేచ్ఛగా ఇచ్చేస్తున్నారు. వైద్య సిబ్బంది స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రూ.30 వేల నుంచి మొదలుకొని రూ.లక్ష వరకు వసూళ్ల పర్వం నడుస్తున్నట్లు ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది చెబుతున్నారు. తెలంగాణలో భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూరు, మన్ననూరులో ఐటీడీఏలు ఉన్నాయి. ఒక్కో ఐటీడీఏ పరిధిలో సగటున 25 నుంచి 30 వరకు పీహెచ్‌సీలున్నాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లు, ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఏఎన్‌ఎమ్‌లు, ఆఫీసు సబార్డినేట్లతో పాటు అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది ఉంటారు. డాక్టర్లు మొదలుకొని ఆఫీసు సబార్డినేట్ల వరకు నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లు ఇస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. కేవలం మౌఖిక ఆదేశాలతో కూడా కొందరికి ఇటువంటి వర్క్ ఆర్డర్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అంతా ఇష్టారాజ్యం...

భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 27 వరకు పీహెచ్‌సీలున్నాయి. ఇక్కడ కూడా నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. మారుమూల ప్రాంతాల్లోని వైద్యులను వర్క్ ఆర్డర్ పేరుతో జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. జూలూరుపాడు పీహెచ్‌సీలో పనిచేసే ఓ మెడికల్ ఆఫీసర్, నర్సాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, సులానగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌ను డీఎంహెచ్‌వో కార్యాలయానికి డిప్యుటేషన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే జిల్లా ఆస్పత్రిలో పనిచేసే ఓ స్టాఫ్‌నర్స్‌ను కూడా డీఎంహెచ్‌వో ఆఫీసుకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో స్టాఫ్‌నర్స్‌కు ఏం పని ఉంటుందని అక్కడి వైద్య సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఇక ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో 32 పీహెచ్‌సీలున్నాయి. ఆ ఐటీడీఏ పరిధిలో గిరిజన ప్రాంత పీహెచ్‌సీల్లోని ఏడుగురు డాక్టర్లను మైదాన ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై పంపినట్లు తెలుస్తోంది. బజార్‌హత్నూర్ వైద్య అధికారిని తాంసీ పీహెచ్‌సీకి, జరి నుంచి శాంతినగర్‌కు, సైదాపూర్ నుంచి పుత్లీబౌలికి, భీమాపూర్ నుంచి ఇంద్రవెల్లికి, నర్సాపూర్ నుంచి అంకోలికి, గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ టీబీ సెంటర్‌కు వైద్య అధికారులను డిప్యుటేషన్లపై పంపినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. ఈ పీహెచ్‌సీలన్నీ గిరిజన ప్రాంతాల్లోనివే. అక్కడ పని చేయాల్సిన వైద్యులను గిరిజనేతర ప్రాంతాలకు పంపారు. రికార్డుల్లో వారంతా గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్నట్లు చూపుతూ.. అక్కడి వేతనాలు, అదనపు భత్యాలను అందిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో పని చేసే వైద్యులు అడిషనల్ హెచ్‌ఆర్‌ఏ, ఏజెన్సీ భత్యాలను క్లెయిమ్ చేసుకోవచ్చు. అలాగే ఆ ప్రాంతాల్లో రెండేళ్లపాటు పని చేస్తే పీజీ ఇన్ సర్వీస్ కోటాకు అర్హులవుతారు. ఇక ఆ ఐటీడీఏ పరిధిలో 9 మంది ల్యాబ్ టెక్నీషియన్లను కూడా డిప్యుటేషన్‌పై పంపారు. అందులో ఒక్కరికే కలెక్టర్ నుంచి అనుమతి ఉంది. 9 మందిలో నలుగురు గిరిజన ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో పనిచేసేవారే. అందులో గుడిహత్నూర్, గాదిగూడ పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేస్తాయి. అక్కడ పనిచేయాల్సిన వారిని డిప్యుటేషన్లపై పంపి.. వారి స్థానాలను ఖాళీగా ఉంచారు. అలాగే స్టాఫ్ నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆఫీస్ సబార్డినేట్లకు కూడా డిప్యుటేషన్లు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ తతంగం వెనుక డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో కూడా కొన్ని డిప్యుటేషన్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటువంటి డిప్యుటేషన్ల వల్ల గిరిజన ప్రాంత పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది లేక ఆరోగ్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.